www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 2-1-2020 | పేజీలు: 12 + 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 16 సంచిక (Issue) : 169 | శ్రీవికారినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి రా. 9.01 తదుపరి అష్టమి; నక్షత్రం: ఉత్తరాభాద్ర పూర్తి; వర్జ్యం: మ. 3.10-4.58; దుర్ముహూర్తం: ఉ. 10.29-11.13, మ. 2.53-3.37; అమృతఘడియలు: రా. 1.57-3.45; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.50; సూర్యాస్తమయం: 5.49 | నిజామాబాద్ సిటీ*

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai

"గగన్ యాన్, చంద్రయాన్-3 రెండు ప్రాజెక్టుల పనులు సక్రమంగా, జోరుగా సాగుతున్నాయి. గగన్ యాన్ కోసం నలుగురు ఎయిర్‌ఫోర్స్ పైలట్లను ఇప్పటికే ఎంపిక చేశాం. వారికి ఈనెల మూడో వారం నుంచి రష్యాలో వ్యోమగామ శిక్షణ మొదలవుతుంది. బహుశా వచ్చే సంవత్సరమే గగన్ యాన్ ప్రయోగం చేపడతాం"

-ఇస్రో చైర్మన్ శివన్



నింగిలోకి నలుగురు!

మన గగన్ యాన్ రెడీ.. ఎయిర్‌ఫోర్స్ నుంచి ఎంపిక.. వచ్చే ఏడాది ప్రయోగం!?

- సిద్ధమవుతున్న చంద్రయాన్-3
- ఈ ఏడాది నవంబరులో లాంచ్!
- వెలాసిటీ రిడక్షన్ వైఫల్యంవల్లే
- విక్రమ్ ల్యాండర్ హార్డ్ ల్యాండింగ్
- ఇస్రో చైర్మన్ శివన్ ప్రకటన

బెంగళూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు గగన్ యాన్! మరోవైపు చంద్రయాన్-3. అంతరిక్ష రంగంలో దూసుకుపోయేందుకు భారత్ సిద్ధమవుతోంది. 2019లో 'జస్ట్ మిస్' అయిన చందమామను మళ్లీ పట్టుకుంటామని ఇస్రో ప్రకటించింది. అలాగే... భారత దేశ తొలి మానవ సహిత అంతరిక్ష యాత్ర 'గగన్‌యాన్' కోసం వాయుసేనకు చెందిన నలుగురు పైలట్లను ఎంపిక చేశారు. కొత్త సంవత్సరం తొలిరోజైన బుధవారం ఇస్రో చైర్మన్ కె.శివన్ బెంగళూరులో మీడియాతో మాట్లాడారు. చంద్రయాన్-2 విఫలమైనప్పటికీ చంద్రుడిని చేరుకోవాలన్న తమ ప్రయత్నాలు ఆగలేదన్నారు. "చంద్రయాన్-3లో ల్యాండర్, రోవర్‌ల తయారీలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ల్యాండర్, రోవర్, ప్రొపెల్షన్ మాడ్యూల్ తయారీలో శాస్త్రవేత్తలు నిమగ్నమై

మిగతా 10వ పేజీలో...



'ఒకే దేశం ఒకే రేషన్ కార్డు' ప్రారంభం

తెలంగాణ, ఏపీ సహా 12 రాష్ట్రాల్లో అమల్లోకి

10

మా ప్రత్యర్థి కాంగ్రెస్సే

ఆ పార్టీని ఆషామాషీగా తీసేయలేం

మాకు శాశ్వత శత్రువులు ఉండరు!

కాంగ్రెస్, బీజేపీ.. రాజకీయ ప్రత్యర్థులే



నూతన సంవత్సరం సందర్భంగా కేటీఆర్‌ను సన్మానిస్తున్న మంత్రి ఎర్రబెల్లి

- మిత్రపక్షమైనా మజ్లి్స్‌తో కలిసి పోటీ చేయం
- లోక్‌సభ ఫలితాలు అనుకున్నట్లు రాలేదు
- అయినా టీఆర్‌ఎస్సే నంబర్‌వన్‌గా ఉంది
- సద్విమర్శలు చేస్తే తప్పకుండా స్వీకరిస్తాం
- జగన్‌తో రిలేషన్ బాగాలేదని ఎవరన్నారు ?
- సీఎం పదవిపై కేసీఆర్ స్పష్టత ఇచ్చారు
- 2020-2030 దశకం తెలంగాణదే
- మీడియాతో ఇష్టాగోష్ఠిలో మంత్రి కేటీఆర్

పౌరసత్వ సవరణ చట్టానికి హిందువులంతా అనుకూలం, ముస్లింలందరూ వ్యతిరేకం అనే వాదన సరికాదు. అలా అంటే కేసీఆర్‌ను మించిన హిందువు ఎవరున్నారు? ఆయన చేసినన్ని యాగాలు ఎవరైనా చేశారా? గుళ్లు ఎవరైనా కట్టించారా? ఆయన పౌరసత్వ సవరణ చట్టంలోని ఒక లోపాన్ని ఎత్తి చూపుతూ దాన్ని వ్యతిరేకించారు. భావోద్వేగాలను కెలకటం మా ఉద్దేశం కాదు"

ఏపీలోని బందర్ పోర్టును లీజుకు తీసుకునే ఆలోచన తెలంగాణకు ఉంది. ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ వస్తే భద్రాచలమే ఒక నౌకాశ్రయం అవుతుంది. సాంకేతికత అభివృద్ధి చెందుతున్న క్రమంలో సీ ప్లేన్స్ వచ్చే అవకాశం ఉంది. అప్పుడు మల్లన్నసాగర్, మిడ్ మానేరు, పాలమూరు జలాశయాలు ఉపయుక్తంగా ఉంటాయనడంలో సందేహం లేదు. నకిరేకల్ వైపు డ్రై పోర్టు వచ్చే అవకాశం ఉంది.

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): "టీఆర్‌ఎస్‌కు శాశ్వత శత్రువులు ఉండరు. టైమ్ టు టైమ్ ప్రత్యర్థులు ఉంటారు" అని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ.. తమకు శత్రువులు కాదని, రాజకీయ ప్రత్యర్థులు మాత్రమేనని అన్నారు. ప్రత్యేక కారణంతో తాము పౌరసత్వ సవరణ బిల్లును పార్లమెంట్‌లో వ్యతిరేకించామని, దేశ హితానికి అనుగుణంగా ఉంటే భవిష్యత్తులో ఏ బిల్లుకైనా మద్దతు ఇస్తామని తెలిపారు. తెలంగాణ భవన్‌లో బుధవారం మీడియా ప్రతినిధులతో ఆయన ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. రాష్ట్రంలో ఇప్పటికీ తమ ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్సేనని చెప్పారు. వందేళ్లకుపైగా చరిత్ర ఉన్న కాంగ్రెస్.. తన ప్రస్థానంలో ఎన్నో ఎత్తుపల్లాలను చూసిందని, ఆ

మిగతా 9వ పేజీలో...

₹130కే 200 ఉచిత చానళ్లు

వినియోగదారు ఎంచుకున్నవి ఇవ్వాల్సిందే

- 26 డీడీ చానళ్లు వాటికి అదనం.. రూ.160కి ఉచిత చానళ్లన్నీ ఇవ్వాలి
- బొకేలో ఉండే చానళ్ల గరిష్ఠ ధర.. రూ.19 నుంచి రూ.12కు తగ్గింపు
- ఒకటికి మించి టీవీలుంటే ఎన్‌సీఎఫ్‌లో 40 శాతానికే రెండో కనెక్షన్
- 20 శాతానికిపైగా వీక్షకులుండే చానళ్లకు క్యారియర్ ఫీజు తీసుకోవద్దు
- గరిష్ఠ క్యారియర్ ఫీజు 4 లక్షలు.. మార్చి 1 నుంచి అమల్లోకి ధరలు

న్యూఢిల్లీ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): టీవీ వీక్షకులకు 'ట్రాయ్' నూతన సంవత్సర కానుక ప్రకటించింది! కేబుల్ ధరలపై కీలక నిర్ణయం తీసుకుంది. బొకేల పేరుతో చానళ్లు చేస్తున్న మాయాజాలానికి అడ్డుకట్ట వేసేలా.. ఒకటికి మించి కనెక్షన్లు తీసుకున్నవారికి ఊరట కలిగించేలా కొత్త టారిఫ్ విధానాన్ని రూపొందించింది. వినియోగదారులు తాము చూసిన చానళ్లకు మాత్రమే డబ్బు చెల్లించే సదుద్దేశంతో గతంలో రూపొందించిన విధానం, అమలు చేసిన నిబంధనలు అంతిమంగా ప్రజలపై భారం పడేలా చేశాయి. దానిపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తడంతో.. 'టారిఫ్ ఆర్డర్, ఇంటర్ కనెక్షన్ రెగ్యులేషన్స్, క్వాలిటీ

మిగతా 10వ పేజీలో...



ఒక భాషకు చెందిన చానళ్లన్నీ ఒకే వరసలో ఉండాలి. చానల్ నంబరును కూడా తరుచూ మార్చకూడదు. ఒక వేళ మార్చాలంటే అందుకు 'ట్రాయ్' అనుమతి తప్పనిసరి.

ఓటర్లకు బదులు కిటికీ, బీరువా!



ఆర్మూర్ జాబితాలో వింతలు

9

రాజకీయాలను కేసీఆర్ భ్రష్టు పట్టించారు

- ఎన్నికలను డబ్బుమయం చేసింది ఆయనే
- కాంగ్రెస్ కార్యకర్తలను ఇబ్బంది పెడుతున్నారు
- ఇది కొనసాగితే జైల్ భరో చేపడతాం: ఉత్తమ్
- పార్టీని వీడిన వారు తిరిగి రావాలని ఆహ్వానం



9

మునిసి'పోల్స్'కు మళ్లీ షెడ్యూల్ ప్రకటించాలి

హైకోర్టుకు ఉత్తమ్



దొంగ దెబ్బ తీయడం తెలియదు

- నమ్మిన వారు మోసగిస్తే బాధేస్తుంది!
- ద్రోహులు బాగుపడరు
- డబ్బు, మద్యానికి ఓట్లు పడవు
- అమ్ముడుపోనిది ఆత్మగౌరవం మాత్రమే
- మంత్రి ఈటల వ్యాఖ్యలు

9

● వణక్కమ్...



గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు బుధవారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్

నెలకో ప్రజా దర్బార్

- కొత్త సంవత్సరంలో అంతా సంతోషంగా ఉండాలి: తమిళిసై
- ముఖ్యమంత్రి సహా గవర్నర్‌కు పలువురి శుభాకాంక్షలు

2

జడ్జిల సంఖ్య 42కు పెంచాలని సిఫారసు వస్తే..

వారంలో క్లియర్ చేస్తాం

- హైకోర్టులో 11 ఖాళీలు
- పెండింగ్ కేసులు 2.07 లక్షలు
- 'నల్సా'కు తెలంగాణ సర్కారు పది ఎకరాలిచ్చింది
- దేశమంతా తెలంగాణ వైపు చూస్తోంది
- హైకోర్టు ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో జస్టిస్ ఎన్వీ రమణ



12

ఎక్సైజ్‌కు న్యూ కిక్కు!

30, 31 తేదీల్లో **450 కోట్ల ఆదాయం**

రిటైలర్ల విక్రయాలు 600 కోట్లపైమాటే

- నెల రాబడి 2012 కోట్లు.. 4% పెరుగుదల
- 2018 డిసెంబరు రాబడి 1970 కోట్లు
- అర్ధరాత్రి దాటినా షాపులు, బార్లు బార్లా
- 3148 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు
- కిక్కిరిసిన మెట్రో.. అర్ధరాత్రి 2 వరకూ రైళ్లు
- 40 వేల మంది అదనంగా ప్రయాణం



హైటెక్ సిటీ వద్ద సహచరులు, కుటుంబ సభ్యులతో కలిసి కేక్ కట్ చేస్తున్న సీపీ సజ్జనార్

న్యూ ఇయర్ కోసం మందు బాబుల మస్త్ మస్త్ 'మజా' ఎక్సైజ్ శాఖకు మహా 'కిక్కు' ఇచ్చింది. పొద్దుట్నుంచి అర్ధరాత్రి 12గంటల దాకా వైన్‌షాపులు కిటకిటలాడితే.. బార్లు, క్లబ్బులైతే అదనంగా మరో గంటపాటు 'వెల్ కమ్' చెప్పాయి! సమయ పరంగా ఈ 'సడలింపు'తో మద్యం ప్రియులు మరింత ఖుషీ చేసుకుంటే ఎక్సైజ్ శాఖకు కాసుల వర్షం కురిసింది. మద్యం షాపులు, బార్లే కాదు.. హైదరాబాద్‌లో మెట్రో రైళ్లూ కిక్కిరిశాయి. 'డ్రంక్ అండ్ డ్రైవ్' బెడద నుంచి తప్పించుకునేందుకు మద్యం ప్రియుల్లో చాలామంది మెట్రో రైల్లో ఇళ్లకెళ్లారు. అర్ధరాత్రి 2గంటల దాకా ఆ రైళ్లు నడిచాయి. బార్ల నుంచి ఇళ్లకు సొంతవాహనాల్లో వెళితే ఏంటట? అని సాహసం చేసినవాళ్లలోనూ వేలమంది 'డ్రంక్ అండ్ డ్రైవ్'లో దొరికిపోయారు. ఇక తెల్లారింది మొదలు ఆలయాల వద్ద భక్తుల కోలాహలం కనిపించింది. కొత్త ఏడాదిలో అంతా మంచే జరగాలని కోరుకుంటూ భక్తులు పోటెత్తడంతో ప్రధాన ఆలయాల్లో సందడి నెలకొంది!!

...వివరాలు 2లో

తల్లి పక్కలో నిద్రపోతున్న

నాలుగేళ్ల చిన్నారిని ఎత్తుకెళ్లి అత్యాచారం



- చీకట్లో అడవిలో వదిలేసిన నిందితుడు
- తల్లికి మెలకువ రావడంతో అదే రాత్రి గాలింపు
- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఘటన

గోదావరిఖనిలో ఐదేళ్ల బాలికపై 12 ఏళ్ల బాలుడి లైంగిక దాడి

మహాముత్తారం/యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 1: అభం శుభం తెలియని నాలుగేళ్ల చిన్నారి తను. తండ్రి లేడు. రాత్రి అయిందంటే తల్లి పక్కలో చేరి హాయిగా నిద్రపోతుంది. మంగళవారం అలా నిద్రలో ఉండగానే అప్పుడప్పుడు ఇంటికి వచ్చే ఓ అంకుల్ ఆమెను ఎత్తుకెళ్లాడు. ఊరవతల ఉన్న అడవిలోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం చీకట్లో, ఎముకలు కొరికే చలిలో అక్కడే

మిగతా 9వ పేజీలో...

పంజగుట్ట పోలీసు స్టేషన్ ముందు

ఆత్మహత్యాయత్నం చేసిన లోకేశ్వరి మృతి

ఆధార్ కార్డు చూపించి పెట్రోల్ కొనుగోలు

12

NEWS PAPERS
తెలుగు

GET IT ON
Google Play

Size : below 8 mb





పరంజ్యోతి

ధర్మాత్ములు ఎవరంటే..



ధర్మోరక్షతి రక్షితః ..ధర్మాన్ని మనం రక్షిస్తే అది మనల్ని రక్షిస్తుంది. మనిషి ధర్మాన్ని ఆధారం చేసుకొని నడిచి తీరవల్సిందే! ధర్మాన్ని పాటించని వారు అష్టకష్టాలు పడవలసి వస్తుంది. 'వ్యక్తి తన బాధ్యతగా నిర్వర్తించవలసిన కర్మలను పద్ధతిగా ఆచరించడమే ధర్మం' అని శాస్త్ర వచనం. కన్న పిల్లల్ని పద్ధతిగా పెంచడం మాతృధర్మం అయితే, ఆ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించి క్రమశిక్షణ పాటించేటట్లు చూడడం పితృధర్మంగా చెబుతారు. పైనపు ముద్దలైన బాలబాలికలను విద్యతో తీర్చిదిద్ది సమాజంలోకి పంపడం గురుధర్మం. ఇలా ప్రతి ఒక్కరూ తమ తమ ధర్మాలను పాటించినప్పుడే సమాజమైనా, దేశమైనా పచ్చగా ఉండి నాలుగు కాలాల పాటు మనగలుగుతాయి.

జహాఁదయా తహాఁధర్మ్ హై, జహాఁలోభ్ వహాఁపాప్
జహాఁక్రోధ్ తహాఁకాల్ హై, జహాఁక్షమా వహాఁఆప్

..ధర్మం, దాని ముఖ్య లక్షణాలైన దయ, క్షమ వంటివాటిని ఆధారంగా చేసుకుని మహాత్మా కబీరు చెప్పిన పద్యమిది. ఎక్కడ దయకు స్థానం ఉంటుందో అక్కడ ధర్మం ఉంటుంది. ఎక్కడ క్షమ ఉంటుందో అక్కడ దైవం ఉంటుంది. లోభం ఎక్కడ ఉంటుందో అక్కడ పాపం ఉంటుంది. కోపం ఎక్కడ ఉంటుందో అక్కడికి మృత్యువు పిలువని పేరంటంగా వచ్చి సర్వనాశనం చేస్తుంది. మనిషి ధర్మాన్ని పాటించినప్పుడే సుఖసంతోషాలతో సంతృప్తిగా జీవించగలడని దీని అర్థం. అందుకే మన పురాణేతిహాసాలు ధర్మానికి పెద్దపీట వేశాయి. రామాయణంలో ధర్మానికి అద్దం పట్టే ఎన్నో ఘట్టాలున్నాయి. ఉదాహరణకు.. శ్రీరామచంద్రుడు అరణ్యవాసంలో ఉన్నప్పుడు రుషులు, మునులు వచ్చి తాము రాక్షసుల వల్ల పడే బాధల గురించి చెప్పుకుంటే.. రాముడు వెళ్లి రాక్షసులతో యుద్ధం చేసి వారందరిని సంహరిస్తుంటాడు. దీన్ని గమనించిన సీతమ్మ తల్లి ఒకరోజు.. 'మనం వచ్చింది మీ నాన్నగారి మాట పాటించడానికి అనేది మరిచి రాక్షసులను చంపుతున్నారు. ఇది ఎంతవరకు సరియైనదో నాకు అర్థం కావట్లేదు' అంటుంది. ఆమె మాటలు విన్న రాముడు.. 'నేను క్షత్రియుణ్ని. అయోధ్యయినా అరణ్యమైనా నాకు ఒక్కటే. కాబట్టి, నేను రాజధర్మాన్ని పాటిస్తూ చెడును సంహరించి మంచిని కాపాడుతున్నాను' అని సమాధానమిచ్చాడు. ధర్మానికి పది లక్షణాలున్నాయని ధర్మశాస్త్రాలు చెబుతాయి. అవేంటంటే.. ధృతి (ఆత్మవిశ్వాసంతో సంతోషంగా ఉండడం), దమం (మనసును అదుపులో పెట్టకోవడం), క్షమ (సహనం కలిగి ఉండడం), శౌచం (శారీరక, మానసిక శుభ్రత పాటించడం), అస్తేయం (మరొకరికి సొత్తుకు ఆశపడకుండడం.. దొంగతనాలు చేయకుండా ఉండడం), ధీ (బుద్ధి కలిగి ఉండడం), విద్య (మంచి చెడులు విశ్లేషించి ప్రవర్తించడం), సత్యం (నీతి నిజాయితీతో జీవించడం), అక్రోధం (భావోద్వేగాలను అదుపులో పెట్టుకొని వ్యవహరించడం) ఇంద్రియ నిగ్రహం (కోరికలకు కళ్లెం వేయడం). ఈ పది లక్షణాలనూ కలిగి ఉన్నవారు ధర్మాత్ములు.

- పరికిపండ్ల సారంగపాణి, 9849630290

లోకం తీరు



నిత్యావసరాల ధరలు పెరిగినప్పుడు రోడ్లపై ర్యాలీలు చేస్తారు.. మద్యం ధర పెరిగినప్పుడు బాధతో ఇంకా ఎక్కువగా తాగుతారు..!

చలికాలం

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
నల్లగొండ	14.2	28.0
ఆదిలాబాద్	16.2	26.2
వరంగల్	18.0	29.0
హైదరాబాద్	18.8	28.4
ఖమ్మం	21.0	30.0

నేడు, రేపు తేలికపాటి వర్షాలు

హైదరాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గురు, శుక్రవారాల్లో మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశాలు ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. బుధవారం పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసినట్లు తెలిపింది. హైదరాబాద్‌లోని నాంపల్లి, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌తోపాటు పలు ప్రాంతాల్లో సాయంత్రం వర్షం కురిసింది. మరోవైపు ఉత్తర ఒడిశా, పరిసర ప్రాంతాల్లో 1.5 కి.మీ నుంచి 2.1 కి.మీ మధ్య ఏర్పడిన ఉపరితల ఆవర్తనం బలహీనంగా మారింది. తెలంగాణలో ప్రధానంగా ఆగ్నేయ దిశ నుంచి గాలులు వీస్తున్నాయి.

నెలకోసారి ప్రజా దర్బార్

ప్రజా భవన్‌గా రాజ్‌భవన్.. 15లక్షలకు రెడ్‌క్రాస్ సభ్యత్వం.. రక్తదాతల వివరాలతో యాప్

- కొత్త సంవత్సరంలో అందరూ సంతోషంగా ఉండాలి: తమిళిసై
- గవర్నర్‌కు పలువురి శుభాకాంక్షలు



రాజ్‌భవన్‌లో టీయూడబ్ల్యూజే డైరీ ఆవిష్కరిస్తున్న గవర్నర్ తమిళిసై, జర్నలిస్టు యూనియన్ ప్రతినిధులు కె.శ్రీనివాసరెడ్డి, దేవులపల్లి అమర్, నగునూరి శేఖర్, కె.విరహత్ అలీ తదితరులు

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రజల కోసమే రాజ్‌భవన్ పని చేస్తోందని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వ్యాఖ్యానించారు. ప్రతి రోజూ 20 నుంచి 50 వరకూ విజ్ఞప్తులు వస్తున్నాయని, దీన్ని మరింత విస్తృతం చేయడానికి నెలకోసారి ప్రజాదర్బార్ నిర్వహిస్తామని ప్రకటించారు. నూతన సంవత్సర ప్రారంభం సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు బుధవారం ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2020లో తెలంగాణ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో మంచి పథకాలు అమలవుతున్నాయని అన్నారు. తాను గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రక్తదాతల వివరాలను ప్రజల ముందుంచడానికి వీలుగా రెడ్‌క్రాస్ సొసైటీ యాప్‌ను సిద్ధం చేశామన్నారు. ప్రస్తుతం రెడ్‌క్రాస్‌లో 15 లక్షల మందికి సభ్యత్వం ఉందని, తాను బాధ్యతలు స్వీకరించడానికి ముందు 30 వేల మందే ఉండేవారని చెప్పారు. గవర్నర్‌ను కలిసిన వారిలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు నిరంజన్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, శ్రీనివాస్ గౌడ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, అరుణ, ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, సీఎస్ సోమేశ్‌కుమార్, ప్రభుత్వ సలహాదారు రాజీవ్‌శర్మ, డీజీపీ మహేందర్‌రెడ్డి ఉన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా రాజ్‌భవన్‌కు సందర్శకులు పోటెత్తారు. కాగా, డైరీలోని ప్రతి పేజీలో సమాజ శ్రేయస్సు కోసం చేసే మంచి పనులు, విజయాలు నమోదయ్యేలా కృషి చేయాలని జర్నలిస్టులకు గవర్నర్ తమిళిసై సూచించారు. టీయూడబ్ల్యూజే మీడియా డైరీని ఆమె ఆవిష్కరించారు. ఐజేయూ అధ్యక్షుడు కె.శ్రీనివాసరెడ్డి, దేవులపల్లి అమర్, టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు నగునూరి శేఖర్, ప్రధాన కార్యదర్శి కె.విరహత్‌అలీ, ప్రెస్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు మాజీద్, నరేందర్‌రెడ్డి, కె.అమర్‌నాథ్, సత్యనారాయణ, విష్ణుదాస్ శ్రీకాంత్, దొంతు రమేష్, మహిపాల్‌రెడ్డి, యాదగిరి, రాజేష్, అయిల్ రమేష్, హెచ్‌యూజే అధ్యక్షుడు రియాజ్‌అహ్మద్, శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

కేసీఆర్‌కు శుభాకాంక్షల వెల్లువ

హైదరాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): టీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్‌కు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. నూతన సంవత్సరం ప్రారంభం సందర్భంగా బుధవారం ఇక్కడ ప్రగతిభవన్‌లో ఆయనను కలిసిన వారిలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు ఎర్రబెల్లి , సత్యవతి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సీఎస్ సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి, జెన్‌కో-ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు, నాగుర్ల వెంకటేశ్వర్లు, టీఎస్‌పీఎస్సీ చైర్మన్ చక్రపాణి, కె.కేశవరావు, నామా నాగేశ్వర్‌రావు, డీజీపీ మహేందర్‌రెడ్డి, పీసీసీఎఫ్ శోభ ఉన్నారు. కాగా, విద్యార్థులకు అందజేసే మోడల్ డిక్షనరీని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి జనార్దన్‌రెడ్డి.. కేసీఆర్‌కు అందజేశారు. యాదాద్రి, ఐనవోలు ఆలయాల కేలండర్లను సీఎం ఆవిష్కరించారు.

క్విడ్ ప్రోకోను మించి..!

ఐఎంఎస్‌లో భారీగా అక్రమాలు


- దర్జాగా దారిమళ్లిన అక్రమార్జన

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): బీమా వైద్య సేవల విభాగం (ఐఎంఎస్)లో జరిగిన మందుల కొనుగోళ్ల కుంభకోణంలో 'నీకిది.. నాకది (క్విడ్ ప్రోకో)' తరహాను మించి అక్రమాలు జరిగాయి. నిఘాకు చిక్కకుండా పక్కా ప్రణాళికతో వందల కోట్ల ప్రభుత్వ నిధులు ప్రైవేటు వ్యక్తుల ఖాతాల్లోకి మళ్లించినట్లు ఏసీబీ తేల్చింది. మెడికల్ కిట్లు మార్కెట్ ధరకు అమ్మితే ఒక్కో కిట్‌పై 25% కమీషన్ వస్తుంది. కానీ, అలా చేయకుండా మార్కెట్ రేటు కంటే ఎక్కువ మొత్తానికి అమ్మి సొమ్ము చేసుకున్నారు. అసలు పరికరాలు సరఫరా చేయకుండానే చేసినట్లు రికార్డుల్లో చూపించి ఇండెంట్‌లో ఉన్న మొత్తం కిట్లు సరఫరా అయినట్లు బిల్లులు చెల్లించారు. ఇలా చేయడం వల్ల రూ.110 కోట్ల ఇండెంట్‌లో సుమారు రూ.33 కోట్లు వ్యక్తిగత ఖాతాల్లోకి మళ్లించుకున్నారు. క్విడ్ ప్రోకో విధానంలో ఎప్పటికైనా పట్టుబడే అవకాశం ఉంటుంది. కానీ, ఐఎంఎస్ నిందితులు వ్యవహరించిన తీరుతో అక్రమాలు జరిగాయని గుర్తించడం అంత సులువు కాదు. కీలక నిందితుల్లో ఒకడిగా ఉన్న బాబ్జీ ఏకంగా రూ.19 కోట్లు పన్ను చెల్లించి కోట్ల రూపాయల ఆదాయానికి లెక్క చూపించినట్లు ఏసీబీ పూర్తి ఆధారాలు సేకరించింది.

ఆస్పత్రి లెట్రిన్‌లో ప్రసవం

కమోడ్‌లో పడ్డ శిశువు.. మృతి

ఘట్‌కేసర్, జనవరి 1: ఘట్‌కేసర్ ప్రభుత్వాస్పత్రిలో బుధవారం ఓ మహిళ మరుగుదొడ్లో ప్రసవించింది. ఘట్‌కేసర్‌కు చెందిన సరితకు బషీర్‌బాగ్‌కు చెందిన వినేశ్‌తో వివాహం జరిగింది. ఎనిమిది నెలల గర్భిణి అయిన సరితకు మంగళవారం రాత్రి పురిటి నొప్పులు రావడంతో ఆస్పత్రికి తీసుకువచ్చారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు డెలివరీకి ఏర్పాట్లు చేశారు. అయితే సరిత మరుగుదొడ్లోకి వెళ్లినప్పుడు అక్కడే ప్రసవించింది. కేవలం కిలో బరువున్న శిశువు కమోడ్‌లో పడిపోయింది. ఆస్పత్రి సిబ్బంది వెంటనే శిశువును బయటకు తీశారు. అప్పటికే శిశువు చనిపోయింది. సరిత గర్భంలో తగినంత ఉమ్మనీరు లేకపోవడం వల్లనే ఇలా జరిగిందని వైద్యులు చెప్పారు. కాగా వైద్యుల నిర్లక్ష్యం కారణంగా సరితకు అబార్షన్ జరిగిందని కుటుంబసభ్యులు ఆరోపించారు.



అఖిలేశ్ పాక్‌లో ఉంటే హిందువుల బాధలు తెలుస్తాయి

సమాజ్‌వాదీ పార్టీ చీఫ్, ఎంపీ అఖిలేశ్ యాదవ్ నెల రోజుల పాటు పాకిస్థాన్‌లో ఉండాలి. ఆలయాల్లో పూజలు చేయాలి. హిందువులు ఎలాంటి దాడులను చవిచూస్తున్నారో అప్పుడాయనకు అర్థం అవుతుంది.


- స్వతంత్ర దేవ్ సింగ్, బీజేపీ యూపీ అధ్యక్షుడు



పాకిస్థానీ హిందువులు ఇటలీకి వెళ్లాలా?

సీఏఏ వద్దంటే.. పొరుగున ఉన్న ముస్లిం దేశాల్లోని హిందువులు ఎటు వెళ్లాలి ? పాకిస్థానీ హిందువులు ఇటలీకి వెళ్లాలా? అక్కడికి వెళితే.. పేదవాళ్లనే సాకుతో హిందువులు, సిక్కులకు పౌరసత్వం ఇచ్చేందుకు ఇటలీ అంగీకరించదు.

- జి.కిషన్‌రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి



మూర్ఛ, బీపీ ఔషధాలతో కేన్సర్‌కు అడ్డుకట్ట

వాషింగ్టన్, జనవరి 1 : మూర్ఛ, మానసిక సమస్యలు, మైగ్రేన్ తలనొప్పుల చికిత్సకు వాల్‌ప్రోయిక్ యాసిడ్‌ను వినియోగిస్తుంటారు. హైడ్రాలజైన్ అనే మరో ఔషధాన్ని రక్తపోటు నియంత్రణకు వాడుతుంటారు. అయితే ఈ రెండు ఔషధాలను ఏకకాలంలో వినియోగిస్తూ, కొవ్వుతో కూడిన ఆహారపదార్థాలను తినడం ద్వారా రొమ్ము కేన్సర్ కణితుల పెరుగుదల మందగిస్తుందని అమెరికాలోని జార్జ్‌టౌన్ వర్సిటీ శాస్త్రవేత్తలు అంటున్నారు. వాటి ప్రభావంతో డీఎన్ఏ మీథైల్‌ట్రాన్స్‌ఫెరేజ్(డీఎన్ఎంటీ)లో జరిగే మార్పులతో ఇది సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

సూది మందుతో జన్యుచికిత్స!

వాషింగ్టన్, జనవరి 1: జన్యు చికిత్సకు సంబంధించి పరిశోధకులు ముందడుగు వేశారు. ఇంజక్షన్ ద్వారా మూత్రపిండాల్లోకి నేరుగా జన్యువులను ప్రవేశపెట్టే చికిత్సా విధానాన్ని కనుగొన్నారు. దీనిని ఇప్పటికే ఎలుకలపై విజయవంతంగా ప్రయోగించారు. అమెరికాకు చెందిన ఎస్జీవో మాయో క్లినిక్ శాస్త్రవేత్తలు ఈ పరిశోధనలు నిర్వహించారు. ఎడినో అసోసియేటెడ్ వైరస్‌లు(ఏఏవీ), లెంటివైరల్ వెక్టార్లను ఉపయోగించి ఈ మందును అభివృద్ధి చేశారు. భవిష్యత్తులో ఈ చికిత్స విధానాన్ని మనుషుల్లోనూ ఉపయోగించవచ్చన్నారు. తద్వారా ఇంజక్షన్లు ఇచ్చి జన్యు వ్యాధులకు సులభంగా చికిత్స అందించవచ్చన్నారు.

ఎక్సైజ్‌కు 'న్యూ' కిక్!

30, 31 తేదీల్లో 450కోట్ల ఆదాయం... రిటెయిలర్ల విక్రయాలు 600కోట్లపైమాటే

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): 'కొత్తకు ఎపుడూ స్వాగతం.. పాతకూ వందనం' అంటూ మద్యం ప్రియులు మందేసి చిందేయడం ఎక్సైజ్ శాఖకు పండగైంది. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా రాష్ట్రంలో మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. డిసెంబరు 30, 31 తేదీల్లోనే రూ.450కోట్ల ఆదాయం వచ్చింది. మొత్తంగా డిసెంబరు నెలలో రూ.2012 కోట్ల రాబడి వచ్చింది. ఇది గత ఏడాది డిసెంబరు నెలతో పోలిస్తే రూ.42 కోట్లు ఎక్కువ. 2018 డిసెంబరులో రూ.1970 కోట్ల రాబడి వచ్చింది. అంటే 2018 డిసెంబరుతో పోలిస్తే 2019 డిసెంబరులో ఎక్సైజ్ ఆదాయం 4 శాతం పెరిగింది. మద్యం రేట్లు పెరగడం కొత్త ఏడాది సంబురాలపై ప్రభావం చూపింది. బీరును మినహాయించి లిక్కర్ విక్రయాలనే పరిగణనలోకి తీసుకుంటే గత ఏడాది కంటే 5 శాతం తగ్గినట్లు ఎక్సైజ్ వర్గాలు వివరించాయి. 2018 డిసెంబరులో 39 లక్షల కేసుల లిక్కర్ అమ్ముడుపోగా.. ఈ డిసెంబరులో 35 లక్షల కేసులే అమ్ముడుపోయాయి. మద్యం రేట్లు పెరగడమే దీనికి కారణమని ఆ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అయితే, చీప్ లిక్కర్, మీడియం, సెమీ ప్రీమియం బ్రాండ్లే కాస్త ఎక్కువగా అమ్ముడయ్యాయని చెబుతున్నాయి. కాగా 30, 31 తేదీల్లో మద్యం షాపులు, బార్లు, క్లబ్బులు వంటి రిటెయిలర్ల ద్వారా రూ.600 కోట్లకు పైగా మద్యం, బీరు విక్రయాలు సాగినట్లు అంచనా. రాష్ట్రంలో మొత్తం 2216 మద్యం షాపులు, 1000 వరకు బార్లు, క్లబ్బులు ఉన్నాయి. సాధారణ రోజుల్లో జీహెచ్ఎంసీ పరిధిలోని ఒక్కో మద్యం షాపు రోజుకు రూ.3-4 లక్షల వరకు, జిల్లాల్లోని వైన్ షాపులు రూ.1.50- 2 లక్షల వరకు, బార్లు రూ.5 లక్షల వరకు విక్రయాలు సాగిస్తుంటాయి. కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని డిసెంబరు 30, 31 తేదీల్లో వైన్ షాపులు, బార్లు, క్లబ్బులు సగటున రూ.10 లక్షల వరకు విక్రయాలు సాగించినట్లు అంచనా.



కొత్త సంవత్సరం వేడుకల సమయంలో రోడ్ల మీద ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న సామాన్యులు

3148 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

నూతన సంవత్సర వేడుకల్లో మద్యం తాగి మంగళవారం అర్ధరాత్రి రోడ్ల మీదకు వచ్చినవారిలో ఆ 'సంబురం' ఆవిరైంది! రాష్ట్రవ్యాప్తంగా పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి తనిఖీలు చేపట్టారు. మొత్తంగా 3,148 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. అత్యధికంగా హైదరాబాద్ కమిషనరేట్‌లో 951, సైబరాబాద్‌లో 868, రాచకొండ పరిధిలో 281కేసులు నమోదయ్యాయి. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, ప్రమాదాలు చోటు చేసుకోకపోవడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా రాష్ట్రంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని, ప్రజలు స్వీయ నియంత్రణ పాటించారని డీజీపీ మహేందర్ రెడ్డి అన్నారు.

మెట్రో ధూం ధాం..

న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా బుధవారం తెల్లవారుజామున 2గంటల వరకు మెట్రో రైళ్లు నడిచాయి. రికార్డు స్థాయిలో 4.6లక్షల మంది మెట్రోలో ప్రయాణించినట్లు అధికారులు పేర్కొన్నారు. రోజువారీ ప్రయాణికుల కన్నా 40వేల మంది ఎక్కువగా ప్రయాణించారని వెల్లడించారు. రికార్డు స్థాయిలో అమీర్‌పేట స్టేషన్‌కు 28,696 మంది రాగా.. 25548 మంది ఈ స్టేషన్ నుంచి బయటకు వెళ్లారు. మెట్రో రైళ్లలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రయాణికులు మసలుకొన్నారని మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి పేర్కొన్నారు.




కిక్కిరిసిన ఆలయాలు, పర్యాటక ప్రాంతాలు

అర్ధరాత్రి వరకు పార్టీలు, కేకుల కటింగ్‌లతో సందడి చేసిన ప్రజలు.. కొత్త ఏడాదిలో సూర్యోదయం కాగానే ప్రార్థనాస్థలాల బాట పట్టారు. హైదరాబాద్‌లోని బిర్లామందిర్, చిల్కూరు బాలాజీ, బల్కంపేట ఎల్లమ్మ, జూబ్లీహిల్స్ పెద్దమ్మ, తాడ్‌బంద్ హనుమాన్, మహంకాళి అమ్మ వారు, పలు ప్రాంతాల్లోని సాయిబాబా ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. పర్యాటక ప్రాంతాల్లోనే సందర్శకుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఎన్టీఆర్ గార్డెన్, లుంబినీపార్క్, సంజీవయ్య పార్కు, జూపార్క్, చార్మినార్, మక్కా మసీద్, ఫలక్‌నుమా ప్యాలెస్, గోల్కొండ కోట తదితర ప్రాంతాల్లో పర్యాటకుల సందడి కనిపించింది. ఖైరతాబాద్ చౌరస్తా సెల్ఫీ స్పాట్‌గామారింది.

అపశ్రుతులు

కొత్త ఏడాది వేడుకలు కొన్ని కుటుంబాల్లో విషాదం నింపాయి. నల్లగొండ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. డిండి మండలం కందూరుకు చెందిన బొల్లె శివాని (17), గన్నేర్లపల్లికి చెందిన కర్నాటి హరికృష్ణ (22), మద్దెల అనిల్ బైక్‌పై వస్తుండగా... అదుపుతప్పి గుంతలో పడడంతో శివాని, హరికృష్ణ మృతిచెందారు. అనిల్‌కు తీవ్రగాయాలయ్యాయి. మేడ్చల్ జిల్లాలో ఫైజాన్ అలీ (19) ఇంజనీరింగ్ విద్యార్థి బైక్‌పై నుంచి పడి మృతిచెందాడు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరులో స్నేహితుల మధ్య మాటామాటా పెరిగి అది కత్తిపోట్లకు దారితీసింది. గుమ్ముల రాజు, రాజశేఖర్, రాజు గాయపడ్డారు.



ప్రమాదంలో మృతిచెందిన శివాని (ఫైల్)



కత్తుల దాడిలో గాయపడ్డ రాజు



దుబాయ్‌లోని సోనాపూర్ లేబర్ క్యాంపులో ఆత్మీయ సమ్మేళనంలో ఎంపీ అర్వింద్

సాంకేతిక పరిజ్ఞానంతో..

ప్రవాసీయుల సమస్యల పరిష్కారం

- దుబాయ్‌లో ఎంపీ అర్వింద్ నూతన సంవత్సర వేడుకలు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ప్రవాసీయుల సమస్యలను అత్యాధునిక సమాచార, సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కరిస్తున్నామని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ తెలిపారు. సకాలంలో సరైన సమాచారం ఉంటే అనేక సమస్యలు పరిష్కారమవుతాయని, దీని కోసం ఓ కేంద్రీకృత సమాచార వ్యవస్థను నిజామాబాద్‌లో ఏర్పాటు చేశామని వెల్లడించారు. దుబాయ్‌లో ప్రవాస కార్మికులతో కలిసి ఆయన నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. బుధవారం సోనాపూర్‌లోని ఓ లేబర్ క్యాంపులో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఎంపీ మాట్లాడారు. గల్ఫ్ ప్రవాసీయుల సమస్యల పరిష్కారానికి బీజేపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రపంచంలో ఏ మూలలో ఉన్న భారతీయులకైనా సేవలందించేందుకు కేంద్రం కృషి చేస్తుందని చెప్పారు. బిజీగా ఉన్నప్పటికీ ప్రవాసీయులతో టచ్‌లో ఉండాలనే ఉద్దేశంతో దుబాయ్ వచ్చానని తెలిపారు. యూఏఈ, భారత జాతీయ గీతాలతో ప్రారంభమైన కార్యక్రమంలో బీజేపీ తెలంగాణ గల్ఫ్ అధ్యక్షుడు నరేంద్ర పన్నేరు, దుబాయ్‌లోని బీజేపీ అనుకూల ప్రవాసీ సంఘం ఇండియన్ పీపుల్స్ ఫోరం అధ్యక్షుడు భూపేంద్ర కుమార్, గిరీశ్ పంత్, ప్రవాసీ ప్రముఖులు కొమ్మూరి రాజు రవికుమార్, బీజేపీ తెలంగాణ దుబాయ్ కన్వీనర్ వంశీగౌడ్, భారత కాన్సులేట్‌కు చెందిన జస్పాల్ అహూజా అనే దౌత్యవేత్త పాల్గొన్నారు.

ఓఆర్ఆర్‌పై ఫాస్టాగ్ తిప్పలు

- ఖాతా నుంచి అదనపు సొమ్ము కట్
- సకాలంలో రీఫండ్ చేయని వైనం

హైదరాబాద్ సిటీ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డుపై ఫాస్టాగ్ విధానాన్ని అమలు చేసి ఏడాదవుతున్నా సాంకేతిక సమస్యలు తీరడం లేదు. ఔటర్‌పై ప్రయాణం చేసిన దూరాన్ని ఆధారంగా చేసుకొని ఫాస్టాగ్ ఖాతా నుంచి డబ్బులు కట్ కావాల్సి ఉండగా అదనంగా కట్ అవుతున్నాయి. ఈ సమస్యపై ఓఆర్ఆర్ అధికారులకు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదు. ఖాతా నుంచి కట్ అయిన డబ్బులను తిరిగి జమ చేయడంలోనూ నిర్లక్ష్యం కనిపిస్తోంది. కోకాపేట నుంచి నానక్‌రామ్‌గూడ వరకు కారుకు టోల్‌ఫీజు ధర రూ.20. కానీ వాహనదారుల ఖాతా నుంచి రూ.70 కట్ అయింది. ఇలా పలు వాహనాలకు ఫాస్టాగ్ ఖాతా నుంచి అదనపు డబ్బు కట్ అవుతోంది. అధికారులకు ఫిర్యాదు చేసి ఏడాది అయినా ఆ డబ్బును రీఫండ్ చేయడం లేదని పలువురు వాపోతున్నారు. ఔటర్‌పైకి ప్రవేశించేటప్పుడు ఫాస్టాగ్‌కు లింక్ కాని వాహనానికి సాధారణ చార్జీగా రూ.70 కట్ అవుతాయని అధికారులు అంటున్నారు. కానీ సాంకేతిక ఇబ్బందుల వల్ల ఫాస్టాగ్‌కు లింక్ అయిన వాహనాలకూ రూ.70 కట్ అవుతోందని వాహనదారులు అంటున్నారు. కొంద రైతే ఎక్కడ ఫిర్యాదు చేయాలో తెలియక వదిలేస్తున్నారు. అయితే, అదనంగా కట్ అయిన డబ్బును తిరిగి ఖాతాలో జమ చేస్తామని అధికారులు చెబుతున్నారు.

న్యూ ఇయర్ వేడుకల్లో యువతులపై లైంగిక వేధింపులు

- బెంగళూరులో మళ్లీ రెచ్చిపోయిన అల్లరిమూకలు

బెంగళూరు, జనవరి 1: నూతన సంవత్సర వేడుకల్లో బెంగళూరులో మహిళలపై లైంగిక వేధింపులు ఆగడం లేదు. 2017 నూతన సంవత్సర వేడుకల్లో బ్రిగేడ్ రోడ్డులో అల్లరి మూకలు మహిళలు, యువతులను వేధించిన సంగతిని మరువకముందే.. తాజాగా కోరమంగళలో మహిళలను లైంగికంగా వేధించారు. అర్ధరాత్రి 12 గంటలకు నూతన సంవత్సర వేడుకలు జరుపుకొనేందుకు రోడ్లపైకి వచ్చిన యువతులను తాకుతూ అసభ్యంగా ప్రవర్తించారు. విషయం తెలుసుకున్న వెంటనే డీసీపీ ఇషా పంత్ ఘటనా స్థలికి చేరుకున్నారు. బాధిత యువతులతో మాట్లాడి సమాచారం తెలుసుకున్నారు. సీసీటీవీ ఫుటేజీలు పరిశీలించి వేధింపులకు పాల్పడిన వారిని గుర్తించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.



విద్యార్థులకు పండ్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్

విద్యార్థులు, రోగులకు పండ్లను పంచిన కలెక్టర్

జగిత్యాల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కొత్త ఆలోచనలతో సంక్షేమ పథకాలను అమలు చేస్తూ రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిన జగిత్యాల జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.శరత్ న్యూ ఇయర్ వేడుకలకు వినూత్నమైన ఆలోచనలు చేశారు. ఉద్యోగులు, నాయకులు, ప్రజాప్రతినిధులు ఆయనకు న్యూ ఇయర్ విషెస్ చెప్పేందుకు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఇలా వచ్చేవారంతా పూల బొకేలకు బదులుగా పండ్లు తేవాలని సూచించడంతో వారంతా పండ్లు తీసుకొచ్చారు. ఆ పండ్లను కలెక్టర్ అనాథ ఆశ్రమంలోని పేద విద్యార్థులకు, ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు పంపిణీ చేశారు.



మనోహర్ పంతులుకు జ్ఞాపికను అందజేస్తున్న కోమటిరెడ్డి

ఆదర్శనీయులు మనోహర్ పంతులు

- ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

మోత్కూరు, జనవరి 1: స్వాతంత్ర్య సమరయోధుడు మనోహర్ పంతులు జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం జనంపల్లి గ్రామానికి చెందిన వేమవరం మనోహర్ పంతులు శత వసంతాల వేడుకను మోత్కూరులో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్ పంతులు దంపతులను వెంకట్‌రెడ్డి ఘనంగా సన్మానించి మాట్లాడారు. మనోహర్ పంతులు ధన్యజీవి అని, నేటి యువత, రాజకీయ నాయకులు ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వందేళ్ల జీవితంలో 80ఏళ్లు మనోహర పంతులు రాజకీయాల్లోనే ఉండి ప్రజలకు సేవ చేశారన్నారు. ఈ సందర్భంగా మనోహర్ పంతులుకు తెలంగాణ బాపు బిరుదును ప్రదానం చేశారు. అనంతరం 30మంది స్వాతంత్ర్య సమర యోధులను ఘనంగా సన్మానించారు. ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, తదితరులు పాల్గొన్నారు.



జెట్ విమానం కలకలం!

- భూసేకరణ సర్వే కోసమని అనుమానాలు
- ఆందోళనలో చింతపల్లి, పెద్దఅడిశర్లపల్లి ప్రజలు

చింతపల్లి, జనవరి 1: నల్లగొండ జిల్లా చింతపల్లి, పెద్దఅడిశర్లపల్లి మండలాల్లో బుధవారం జెట్ విమానం చక్కర్లు కొట్టడం కలకలం రేపింది. నల్లగొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల కూడలి అయిన చింతపల్లి మండలం వీటీనగర్‌లో అతి కింది నుంచి నిమిషం సమయం జెట్ విమానం చక్కర్లు కొట్టి రంగారెడ్డి జిల్లా కందుకూరు వైపు వెళ్లింది. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం ముచ్చర్లలో ఫార్మాసిటీ కోసం 20వేల ఎకరాల భూమిని సేకరించేందుకు అధికారులు సర్వే చేసినట్లు తెలిసింది. హైదరాబాద్-నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై చింతపల్లి మండలంలోని వీటీనగర్ నుంచి ముచ్చర్లకు రోడ్డును నిర్మించనున్నారని, ఇందుకుగాను భూసేకరణకు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో జెట్ విమానం చక్కర్లు కొట్టడంతో భూములను లాక్కుంటారేమోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు నాగార్జునసాగర్ పరివాహక ప్రాంతం నల్లమల గుట్టలపై జెట్ విమానం చక్కర్లు కొనసాగుతున్నాయి.



కట్టతెగడంతో వట్టిపోయిన సరళాసాగర్

కట్ట తెగడానికి కారణాలివీ

ఎంజీకేఎల్ఐ లింకుతో నీరు పూర్తిగా నింపారు.. కాలువలకు నీరు సమయానికి వదల్లేదు

- పొదలు పెరగడంతో వదులుగా మారిన కట్ట
- సరళాసాగర్‌పై ఉన్నతాధికారులకు నివేదిక
- భారీ ప్రాజెక్టుగా మార్చే యోచనలో ప్రభుత్వం
- రబీకి ప్రత్యామ్నాయంపై త్వరలో నిర్ణయం

వనపర్తి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): సరళాసాగర్ కట్ట తెగిపోయి.. అర టీఎంసీకి పైగా నీరు వృథా కావడానికి కారణాలను ఇంజనీర్లు కనుగొన్నారు. ప్రజాప్రతినిధులు, మంత్రుల ఆదేశాల మేరకు ఇంజనీర్ల బృందం సరళాసాగర్‌లో మంగళవారమే సర్వే చేపట్టింది. కట్ట తెగడానికి కారణాలు, రబీ పంటకు నీళ్లిచ్చేందుకు తీసుకోవాల్సిన ప్రత్యామ్నాయ చర్యలపై సమగ్ర నివేదికను నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులకు అందజేసినట్లు సమాచారం. కట్ట తెగడానికి అందరూ అనుకున్నట్లుగానే మూడు అంశాలు కారణమని నివేదికలో పేర్కొన్నట్లు విశ్వసనీయ సమాచారం. సరళాసాగర్ ప్రాజెక్టును గతేడాది వరకు ఎత్తిపోతల పథకం ద్వారానే నింపారు. ఈ ఏడాది మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకాన్ని లింక్ చేయడం, కట్ట దృఢత్వాన్ని పరిశీలించకుండా పూర్తి స్థాయిలో నీళ్లు నింపడం వల్ల కట్ట తెగిపోయింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 22 అడుగులు. అయితే, సరళాసాగర్ ఎత్తిపోతల పథకంతో ఏటా 16 అడుగుల నీటినే నింపుతున్నారు. పాత ప్రాజెక్టు కావడం, కట్టపై ఎలాంటి మరమ్మతులు చేపట్టక పోవడంతో తక్కువ నీటిని నింపారు. అయితే, ఈఏడాది ఎంజీకేఎల్ఐ ద్వారా నీళ్లు రావడంతో పర్యవేక్షణలేకుండానే నెలన్నరగా పూర్తి స్థాయిలో నీళ్లు నింపడంతో కట్టపై ఒత్తిడి పెరిగినట్లు నివేదికలో పేర్కొన్నారు. 22 అడుగుల నీటిమట్టం ఉన్నప్పటికీ రబీకి సరైన సమయంలో నీళ్లు విడుదల చేయలేదని కూడా విచారణలో చర్చకు వచ్చింది. రాజకీయ కారణాల నేపథ్యంలో నీటి విడుదలను వాయిదా వేయడం, మరో పార్టీ ప్రతినిధులొచ్చి నీళ్ల విడుదల చేసినా మళ్లీ నిలిపివేయడం వంటి కారణాలు కూడా కట్టపై ఒత్తిడి పెరగడానికి కారణమైంది. ప్రాజెక్టులో నీటిమట్టం నెలన్నర రోజులుగా పూర్తి స్థాయిలో ఉంది. దీంతో కట్టపై ఒత్తిడి కలిగి లీకేజీలు పెరగడంతో కట్టకొట్టుకుపోయింది. ఇక కట్టపై ముళ్ల పొదలు పెరగడం, వాటి వేర్లు కుళ్లిపోయి పందికొక్కులు, చీమలు చేరి కట్టను వదులు చేయడం మూడో ప్రధాన కారణంగా అధికారులు నివేదించారు. అధికారుల,ప్రభుత్వ తప్పిదంలేదని పైకి చెబుతున్నా వారి స్వీయవిచారణలోనే అధికారుల నిర్లక్ష్యం తేటతెల్లమవుతోంది. పాత ప్రాజెక్టు కావడంతో కొట్టుకుపోయిందని సమర్థించుకున్నా.. దృఢత్వాన్ని పరిశీలించకుండా పూర్తి స్థాయిలో నీళ్లు నింపడానికి కారకులెవరో తెలపాల్సి ఉంది. కట్ట దృఢంగానే ఉందని భావిస్తే గతేడాది వరకు 16 అడుగులే ఎందుకు నింపారు? ఈ ఏడాది 22 అడుగులు ఎందుకు నింపారో తేలాల్సి ఉంది.

కింకర్తవ్యం..?

రెండు పంటలకు ఆయకట్టు 4500 ఎకరాలు, నాన్ ఆయకట్టు 2000 ఎకరాలకు పైగా నీరిచ్చే సరళాసాగర్ ప్రాజెక్టు కట్ట తెగిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రబీ కోసం రైతులంతా ఇప్పటికే తుకాలు వేసుకున్నారు. అయితే, కట్ట తెగిపోవడంతో వారు అయోమయంలో పడ్డారు. మంత్రి నిరంజన్‌రెడ్డి కట్టను పరిశీలించినపుడు కేఎల్ఐ ద్వారా ఎడమ కాలువకు ఒక పాయ ద్వారా నీటిని అందిస్తామని, 4 వేల ఎకరాలకు నీరు ఇస్తామని ప్రకటించారు. సర్వే పూర్తి చేసి త్వరలో ప్రత్యామ్నాయ పనులు చేపట్టాలని మంగళవారం హైదరాబాద్ నుంచి వచ్చిన అధికారుల బృందం కూడా సూచించినట్లు తెలుస్తోంది. అయితే, గతంలో లాగే సైఫన్ సిస్టం ఉంచి ప్రాజెక్టు నిర్మాణం చేపడతారా? లేక సైఫన్ సిస్టం తీసేసి సామర్థ్యం పెంచడంతో పాటు కొత్తగా డ్యాం నిర్మాణం చేపడతారా? అనే విషయంలో సందిగ్ధత నెలకొంది. ఇంకా ఎక్కువ ఆయకట్టుకు నీరు ఇచ్చేలా నిర్మించుకుందామని దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి చెప్పినట్లు తెలుస్తోంది. పాత డ్యాంను తొలగిస్తే దేశంలోనే తొలి సైఫన్ సిస్టం ప్రాజెక్టు చరిత్రలో కలిసిపోతుంది. మరోవైపు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ధాన్యం రైతు కడుపు 'మంట'

కొనుగోళ్లలో జాప్యంపై నిప్పుపెట్టి నిరసన



ధాన్యానికి నిప్పుపెట్టి నిరసన తెలుపుతున్న రైతులు

గోవిందరావుపేట, జనవరి 1: ధాన్యం కొనుగోలులో జాప్యాన్ని నిరసిస్తూ ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని లక్నవరం గ్రామానికి చెందిన రైతులు బుధవారం జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. రోడ్డుపై ధాన్యాన్ని కుప్పగా పోసి నిప్పు పెట్టారు. కొనుగోలు కేంద్రాలకు తరలించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కాంటాలు పెట్టకుండా ఆలస్యం చేస్తుండటంతో రోజుల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలు కురిస్తే భారీ మొత్తంలో నష్టపోవాల్సి వస్తుందని అన్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి కాంటాలను వేగవంతం చేయాలని, కొనుగోలు సమయంలో అనవసర నిబంధనలను సడలించాలని డిమాండ్ చేశారు. కాగా, రైతుల ఆందోళనకు కాంగ్రెస్, వామపక్షాల నేతలు సంఘీభావం తెలిపారు.

పరశురాముడిగా భద్రాద్రి రామయ్య



భద్రాచలం, జనవరి 1: భద్రాచలం వైకుంఠ ఏకాదశి మహోత్సవాల్లో బుధవారం శ్రీ సీతారామచంద్రస్వామి పరశురామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పరశురామవతారంలో స్వామి వారిని మిథిలా స్టేడియంలోని అధ్యయనోత్సవ వేదిక వద్దకు తీసుకొచ్చారు. అనంతరం స్వామివారిని తిరువీధి సేవకు తీసుకెళ్లారు. నేడు శ్రీరామవతారంలో భద్రాద్రి రాముడు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

సాగర్‌లో పర్యాటకుల సందడి



నాగార్జునసాగర్, జనవరి 1: నాగార్జునసాగర్‌లో బుధవారం పర్యాటకుల సందడి నెలకొంది. కేరళ, హైదరాబాద్, ఖమ్మం, నల్లగొండ, వరంగల్ తదితర ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో సాగర్‌కు తరలివచ్చారు. దీంతో సాగర్‌లో ఎక్కడ చూసినా పర్యాటకులతో కళకళలాడింది. హిల్‌కాలనీ డౌన్ పార్కు వద్ద ఉన్న లాంచీస్టేషన్ నుంచి పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జలాశయంలో లాంచీలను జాలీ ట్రిప్పులు తిప్పారు. అనుపు, బుద్ధవనం, ఎత్తిపోతల, కొత్త వంతెన, ఎస్‌బీఐ పార్కు, పాత వంతెన ప్రదేశాల్లో పర్యాటకులు సందడి చేశారు. అయితే, నాగార్జునకొండకు లాంచీలు వెళ్లకపోవడంతో పర్యాటకులు నిరాశకు గురయ్యారు.



మీడియాతో మాట్లాడుతున్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ నేతల ఇసుక దందా

కాంగ్రెస్ నేత కోమటిరెడ్డి వ్యాఖ్యలు

ఆత్మకూరు(ఎం), జనవరి 1: ప్రాజెక్టులు, రిజర్వాయర్ల నిర్మాణం పేరుతో పాత జిల్లా నుంచి ఇసుకను తరలిస్తూ జిల్లా మంత్రి, ఎమ్మెల్యేలు ఇసుక దందాలు కొనసాగిస్తున్నారని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)లో ఆయన మీడియాతో మాట్లాడారు. అభివృద్ధిని పట్టించుకోని జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యేలు అడ్డగూడూరు మండలంలోని జానకీపురం నుంచి రోజుకు 200 లారీల చొప్పున ఇసుకను తరలిస్తున్నారని అన్నారు. అధికారంలోకి వచ్చి ఆరేళ్లు కావస్తున్నా ఆత్మకూరు(ఎం) మండలంలో బునాది కాని కాల్వ నిర్మాణం పూర్తి చేయలేని అసమర్థులు టీఆర్ఎస్ నాయకులని విమర్శించారు. ధనిక రాష్ట్రమైన తెలంగాణలో ఆర్టీసీని ప్రభుత్వంలో ఎందుకు విలీనం చేయడం లేదని ఎంపీ ప్రశ్నించారు.

భక్తులతో పోటెత్తిన ఆలయాలు

యాదాద్రిలో దర్శనానికి 5 గంటలు.. చిలుకూరుకు 'లక్ష' తాకిడి.. జోగుళాంబకు 80 వేల మంది



చిలుకూరులో స్వామి వారి దర్శనానికి క్యూలైన్లలో వేచివున్న భక్తులు

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్ : కొత్త సంవత్సరం తొలిరోజైన బుధవారం కోటి ఆశలతో వచ్చిన భక్త జన సందోహంతో రాష్ట్రంలోని అన్ని దేవాలయాలు కిటకిటలాడాయి. అర్చకుల మంత్రోచ్చరణలు, భక్తుల సంకీర్తనలతో మార్మోగిపోయాయి. ఆలయాలు, పరిసర ప్రాంతాల్లో ఎటు చూసినా జన సందోహమే కనిపించింది. యాదాద్రి, బాసర, జోగుళాంబ జిల్లా ఆలంపూర్‌లోని జోగుళాంబ, రంగారెడ్డి జిల్లా చిలుకూరు బాలాజీ, మేడ్చల్ జిల్లా కీసర, చీర్యాల్ దేవాలయాల్లో భక్తులు చాంతాడంత క్యూలైన్లలో నిల్చుని దర్శనం చేసుకున్నారు. యాదాద్రిలో ధర్మ దర్శనానికి ఐదు గంటలు, ప్రత్యేక దర్శనాలకు రెండు గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. కొండపైన హరిహరులను దర్శించుకున్న భక్తులు సువర్ణ పుష్పార్చనలు, తిరుకల్యాణోత్సవం, సుదర్శన హోమం, వ్రతపూజలు, అలంకార జోడు సేవల్లో కుటుంబ సమేతంగా పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనుబంధ పాతగుట్ట ఆలయంలోనూ భక్తుల రద్దీ నెలకొంది. కాగా, యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ప్రసాదాలు, శేషవస్త్రాలు, నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు, దేవస్థాన ఈఓ గీతారెడ్డి బుధవారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌కు అందజేశారు. బాసర సరస్వతీ ఆలయానికి మహారాష్ట్ర నుంచి వేలాదిగా తరలివచ్చారు. జోగుళాంబ దేవిని దాదాపు 80 వేల మంది దర్శించుకున్నారు. చిలుకూరు బాలాజీ దేవాలయానికి తెల్లవారుజామున 4 గంటల నుంచే క్యూలైన్లు మొత్తం కిక్కిరిశాయి. దీంతో ఆలయంలో ప్రదక్షిణలను పూర్తిగా నిలిపివేసి మహాద్వార దర్శనాన్ని కల్పించారు. లక్షమంది స్వామివారిని దర్శించుకున్నారు.

అంతర్జాతీయ సదస్సుకు దాచారం విద్యార్థి

భారత్ నుంచి ఎంపికైంది ఇద్దరే



సందీప్‌కుమార్

మోత్కూరు, జనవరి 1: ఫ్రాన్స్‌లో జరగనున్న అంతర్జాతీయ సదస్సుకు యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం దాచారం విద్యార్థి సందీప్ ఎంపికయ్యాడు. ఈ నెల 6 నుంచి 10 వరకు 'ఇంటర్నేషనల్ వింటర్ స్కూల్ ఆన్ పబ్లిక్ పాలసీ' అనే అంశంపై నిర్వహించే అంతర్జాతీయ సదస్సుకు మన దేశం నుంచి ఎంపికైన ఇద్దరిలో సందీప్ ఒకడు. పేద కుటుంబానికి చెందిన పొట్టిపాక లక్ష్మయ్య-రామనర్సమ్మ దంపతుల కుమారుడైన సందీప్‌కుమార్ పదో తరగతి వరకు మోత్కూరులో చదివాడు. ప్రతిష్టాత్మకమైన యూజీసీ నెట్‌లో 2018 జనవరిలో పొలిటికల్ సైన్స్ (రాజనీతి శాస్త్రం)లో జేఆర్ఎఫ్‌లో అర్హత సాధించాడు. నెలకు రూ.40 వేల ఉపకార వేతనం పొందుతూ హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీలో పొలిటికల్ సైన్స్‌లో పరిశోధన (ఎంఫిల్) చేస్తున్నాడు.

ముగ్గురు పిల్లలతో తల్లి ఆత్మహత్యాయత్నం

నలుగురి పరిస్థితి విషమం



చికిత్స పొందుతున్న తల్లీపిల్లలు

సత్తుపల్లిరూరల్, జనవరి 1: కుటుంబ కలహాలతో ఓ గృహిణి ఆత్మహత్యాయత్నం చేసింది. శీతల పానీయంలో గుళికలు కలిపి ముగ్గురు పిల్లలకు తాగించి.. తానూ తాగింది. నలుగురూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం సిద్దారం గ్రామానికి చెందిన మారేష్, జమలమ్మ దంపతులకు కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. మనస్తాపానికి గురైన జమలమ్మ శీతల పానీయంలో గుళికలు కలిపి కుమార్తెలు రేష్మ, వర్షిత, కుమారుడు భరత్‌లకు తాగించి.. తాను తాగింది. వారిని ఆసుపత్రికి తరలించగా నలుగురి పరిస్థితి విషమంగా ఉంది.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

వర్గల్, జనవరి 1: సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం సామాల్లాపల్లిలో బుధవారం రైతు చింతశేఖర్ ఆత్మహత్య చేసుకున్నాడు. పంటలు పండక అప్పులు పెరిగిపోయి పురుగుల మందు తాగాడు. కాగా, నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం బాజకుంటలో రైతు మల్లయ్య(62) పొలం వెళ్తూ వేలాడుతున్న విద్యుత్ తీగలు విద్యుదాఘాతంతో మృతి చెందాడు.

అన్‌లైన్ అవార్డు పేరిట బురిడీ

రూ.7.97 లక్షలు మోసపోయిన మహిళ

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 1: ఆన్‌లైన్‌లో లక్కీ అవార్డుపేరిట సైబర్ నేరస్థుల చేతిలో ఓ మహిళ మోసపోయింది. ఈ మెయిల్‌ను నమ్మి రూ. 7లక్షల 97వేల నగదును గుర్తు తెలియని వ్యక్తులకు బదిలీ చేసింది. చివరకు మోసపోయినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. జనగామకు చెందిన సౌజన్యకృష్ణవేణికి నవంబర్‌లో గోల్డెన్ యాపిల్ మొబైల్స్ అవార్డు పేరిట నిర్వహించిన పోటీలో 2కోట్ల 9లక్షలు గెలుచుకున్నట్టు మెయిల్ వచ్చింది. 2కోట్లను తీసుకోవాలంటే రూ. 12,500 చెల్లించాలని మెసేజ్ రావడంతో నగదును బదిలీ చేసింది. సదరు కంపెనీ ప్రతినిధుల పేరిట వాట్సప్‌లో కంపెనీ తాలుకు బ్రోచర్, నిబంధనలను జత చేయడం, గతంలో నగదు గెలుచుకున్న వారని పేర్కొంటూ కొందరి వివరాలు మెజేస్‌ల రూపంలో పంపారు. వారి సూచనల మేరకు విడతల వారీగా మొత్తం 7.97 లక్షల రూపాయలను బదిలీ చేసింది. చివరకు తాను గెలుచుకున్న రెండు కోట్ల రూపాయలు ఇవ్వాలని సంస్థ ప్రతినిధులకు ఫోన్ చేయగా వారు దాట వేయడంతో మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు గోదావరిఖని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కాల గమనంలో కలిగి పోయిన 2019 చిరస్మరణీయ విజయాలను అందించింది. తిరు గులేని రికార్డులను సృష్టించింది. మరపురాని జ్ఞాపకాలను మిగి ల్చింది. మానవ చరిత్రకు మరెన్నో విశిష్టతలను కలుగజేసింది. అలాంటి అరుదైన మలుపుల్లో మేటి మైలురాళ్ల పూర్తి చేసిన అపురూప సాహసం.

పర్వతారోహణలో ఇప్పటికే పలు సాహసాలు చేసి దేశానికి ప్రత్యేక విశి ష్టతలను సంపాదించి పెట్టిన ఈ తెలుగు బిడ్డ గత నెల 26న మంచు ఖండమైన అంటార్కిటికాలోని అతి ఎత్తయిన విన్సన్ మసిఫ్ పర్వతాన్ని అధిరోహించింది. 16,050 అడుగుల ఎత్తు గల ఈ పర్వతం ప్రపంచంలోని అతి ఎత్తయిన పర్వతాల్లో ఒకటిగా రికార్డులకెక్కడమే కాదు, అధిరోహణకు అత్యంత దుర్గమమైనదిగానూ ఉంది. అటువంటి దుస్సాధ్యమైన అధిరోహణను అలవోకగా సుసాధ్యం చేసిన పూర్ణ సాహసాన్ని 'ఔరా' అంటూ ప్రపంచమే కొనియాడుతోంది. దీనితో ఆమె ఆరేళ్లలో ఆరు ఖండా ల్లోని ఆరు ఎత్తైన పర్వత శిఖరాలను అధిరోహించిన మహిళగానూ మరో రికార్డును సొంతం చేసుకున్నారు.

2014లో 13 ఏళ్ల 11 నెలల వయస్సులోనే ఆసియాలోని అతి ఎత్తయిన ఎవరెస్టు పర్వతాన్ని అధిరోహించిన పూర్ణ ఈ ఘనతను సాధించిన అతి పిన్న వయస్కురాలిగా రికార్డు సృష్టించింది. అందులోనూ తొలి ప్రయత్నం లోనే ఆ శిఖరాగ్రాన్ని చేరి అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. ఆ అపురూప విజయంతోనే ఆ బాలిక ఆగిపోలేదు. ఆ విజయోత్సాహంలోనే ప్రపం చపు ఏడు ఖండాల్లోని ఏడు ఎత్తయిన పర్వతాలను అధిరోహించడమే లక్ష్యంగా నిర్దేశించుకుంది. నాటి నుంచీ ఏడాదికో ఖండంలోని పర్వతం చొప్పున ఈ ఆరేళ్లలో ఆరు శిఖరాగ్రాలను చేరుకుని తన లక్ష్యానికి అడుగు దూరంలోకి వచ్చింది. 2020లో దాన్నీ పూర్తి చేస్తానంటూ పట్టుదలగా ప్రక టిస్తోంది. ఆమె సాధిస్తున్న విజయాలను, ఆమె దీక్షాదక్షతలను ప్రత్యక్షంగా చూస్తున్న ప్రపంచం అది సాధ్యమేనని నమ్ముతోంది. మన తెలుగు వారి కీర్తి ప్రతిష్ఠలను ఆమె ఇనుమడింపగలదని అంతా ఆనందం వ్యక్తం చేస్తు న్నారు.

పర్వతారోహణ అంటే కొండలు, గుట్టలు వంటి ఎత్తులు ఎక్కడమే కాదు. అది ఎన్నో సాహసాలతో కూడిన కృత్యం. పర్వత శిఖరాలను అందు

అపురూప సాహసి

కోవడమంటే ప్రాణాలను పణంగా పెట్టడమే. పర్వతాలపై భౌగోళిక స్థితి గతులు మనకు ఏమాత్రం పరిచయం లేనివిగా ఉంటాయి. విషపురుగులు, జంతు జాలాలతో కూడిన పరిస్థితులుంటాయి. కొన్ని పర్వతాలు దారీ తెన్నూ తెలియకుండా ఉండేవి అయితే, మరి కొన్ని మంచుతో కప్పబడి ఉంటాయి. ప్రమాదభరితమైన ఈ పరిస్థితులకు తోడు వాతావరణం మరింత ప్రతికూలంగా ఉంటుంది. పైకి వెళ్లే కొద్దీ ప్రాణవాయువు తగ్గి పోతూ ఉంటుంది. ఎవరెస్టు వంటి శిఖరాలపై అయితే గాలి అందక శ్వాస పీల్చుకోవడమే కష్టంగా ఉంటుంది. కేజీల కొద్దీ బరువును మోసుకుంటూ దారి చేసుకుంటూ ముందుకు సాగడమంటే సామాన్యులకు అసాధ్యం, సాహసులకు దుస్సాధ్యం. అందుకే, పర్వతారోహణ అంటే ప్రపంచంలోనే అత్యంత సాహస కృత్యంగా గుర్తింపు పొందింది. అందులోనూ ఖండఖండా ల్లోని పర్వతాలపై విభిన్న భౌగోళిక, వాతావరణ పరిస్థితులు ఉంటాయి. ఉష్ణ మండలంలో ఉండే మనలాంటి వారికి అతిశీతలంగా ఉండే అంటా ర్కిటికాలోని పర్వతంపై అడుగుపెట్టడమంటే అష్టకష్టాలతో కూడినదే. అలాంటి ఎన్నో ప్రతికూలతలను తట్టుకుంటూ 20 ఏళ్లు కూడా నిండని యువతి ఆరు పర్వతాలను ఏమాత్రం తొణకకుండా ఎక్కడమంటే మాటల్లో వర్ణించలేని, మానవ శక్తికి మించిన పని. ఇలాంటి ఘనతను సాధించిన వారు ప్రపంచంమొత్తంలోనూ వేళ్లమీద లెక్కపెట్టగలిగినంత మందే ఉన్నారు. అలాంటి అరుదైన వారిలోనూ పిన్న వయస్కురాలు పూర్ణ.

ఇప్పుడు సాహసానికి చిరునామాగా ఎదిగిన ఈ తెలుగు అమ్మాయి బాల్యంలో జరిగిందే మనకర్తవ్యస్ఫూర్తిగా, చదువుకోవడమే సాహసంగా ఉండేది. నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని గిరిజన గ్రామమైన పాకాలకు చెందిన పూర్ణ తల్లిదండ్రులు రెక్కాడితే గానీ డొక్కాడని వ్యవ సాయ కూలీలు. అంతటి పేదరికంలో పుట్టిన పూర్ణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చదువుకుంది. 8వ తరగతిలోనే పర్వతారోహణ శిక్ష ణకు ఎంపికైంది. 9వ తరగతి చదువుతున్నప్పుడే ఎవరెస్టును అధిరోహిం చింది. 'జీవితాన్ని గెలుచుకోవడం కష్టం. ఎవరెస్టును అందుకోవడమే ఈజీ' అన్న పూర్ణ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినిస్తున్నది. ఆమె చేసిన సాహసా లను చాటిచెప్పడానికి 'పూర్ణ : ద కరేజ్ హాజ్ నో లిమిట్' అన్న పేరుతో ఈ పర్వతారోహకురాలి బయోపిక్ నిర్మితమైంది. నిమ్న స్థాయి నుంచీ అత్యున్నత స్థాయికి ఎదిగిన పూర్ణ 'అమ్మాయిలు ఏదైనా సాధించగలరు' అని నిరూపించడమే లక్ష్యంగా మరిన్ని మనకల సాధిస్తానని ఆత్మవిశ్వా సంతో చెబుతోంది. ఆ సమున్నత లక్ష్యసాధనలో ఆమె విజయం సాధి స్తుందనడం నిస్సందేహమే!

వారు విభజిస్తున్నారు, మనం ఏకమవుదాం



■ యోగేంద్ర యాదవ్

కొత్త సంవత్సర వేళ మీరు ఏమి నిర్ణయాలు తీసుకున్నారు? సొంత జీవితాన్ని మరింత వెలుగుమయం చేసుకోవడానికి సంబంధించినవే అయివుంటాయి. అవి, సాధారణంగా అలానే వుండడం పరిపాటి. అయితే మన జాతీయ జీవనంలో వర్తమానం ఒక విషమ స్థితిలో వున్నది. మన పురా నవ భారతదేశం గుర్తుపట్టలేని విధంగా విరూప మవుతోంది; మనం విశ్వసించిన విలువలు, మన జీవితాలకు ఆలంబనగా వున్న సంప్ర దాయాలు వికృత దాడులకు గురవుతున్నాయి. మరి ఈ పరిస్థితులలో మన వ్యక్తిగత జీవితాలను రాజకీయ పరిణామాల నుంచి వేరు చేయలేము, చేయకూడదు కూడా.

" 'పౌరసత్వ సవరణ చట్టం' (సిఏఏ)కు వ్యతిరేకంగా నిరసన తెలుపు తున్న వారు ఎటువంటి వస్త్రాలు ధరించారో చూడండి, అటువంటి బట్టలను ఎవరు ధరించేది ఎవరో మీకు తెలియదా?" అంటూ మన ప్రభుత్వాధినేత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నర్మగర్భితంగా ఎత్తిచూపిన కాలమిది. ఒక సామాజిక సముదాయానికి వ్యతిరేకంగా పోలీసులు యుద్ధాన్ని ప్రారంభిం చిన రోజులివి. అంతేనా? చిన్న పిల్లలను సైతం చిత్ర హింసలకు గురి చేస్తున్న ఘోరాలు పెచ్చరిల్లిపోతున్న పాడు పాలన దాపురించింది కదా! అసత్యాల వ్యాప్తికి 'ఆధ్యాత్మిక గురువులు' నిర్నిరోధంగా దోహదం చేస్తున్న సమాజంలో 'సత్యమేవ జయతే' అన్న ధర్మసూత్రం వర్ధిల్లుతుందా? జ్ఞానాన్ని మధించి, విజ్ఞాన వివేకాలను విస్తరింపజేసే యువ ధీమంతులు, దేశ పాలకులపై తిరగబడాల్సిన అగత్య మెందుకు ఏర్పడింది? ఇటువంటి పరిస్థితు లలో నూతన సంవత్సర శుభ వేళ మన నిర్ణయాలు వ్యక్తిగతమైనవిగా మాత్రమే ఎలా వుంటాయి? ఉండవు, ఉండకూడదు కూడా. సుప్రసిద్ధ స్త్రీవాద నినాదాన్ని విలో మీకరించి చెప్పాలంటే ఇప్పుడు రాజకీ యమే వ్యక్తిగతం. జాతి జీవితం వక్ర గతుల్లోకి వెళ్ళిపోతుండడం మన వ్యక్తిగత సమస్య కాదూ?



పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా వెల్లువెత్తుతున్న ప్రజా నిరసనలను మతాల ప్రాతిపదికన దేశ ప్రజలలో చీలికలు తీసుకువచ్చేందుకు ఉపయోగించుకొనేందుకు దేశ పాలకులు ప్రయత్నిస్తున్నారు. దేశాన్ని సమైక్యంగా వుంచే బృహత్తర బాధ్యత ప్రజల పైనే వున్నది. ప్రజా నిరసనలు జాతీయ సమైక్యతకు దోహదం చేసే ఒక సరికొత్త అఖిల భారత ఉద్యమం 'భారత్ జోడో ఆందోళన్'గా పరిణమించి తీరాలి.

సంరక్షించేందుకు ఒక మహోద్యమం సాగుతోన్న సందర్భమిది.

కొత్త పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా అగ్నిపర్వతంలా బద్దలవుతున్న ప్రజా నిరసనలను అణచివేసేందుకు నరేంద్ర మోదీ ప్రభుత్వం సకల ప్రయత్నాలూ చేస్తోంది. శుద్ధ అబద్ధాలను గౌరవప్రదకరమైనవిగా చేస్తోంది. విద్వేషాలను ప్రేమపూరిత వ్యవహారాలుగా కన్పించేలా చేస్తోంది. పౌరుల ఆలోచనలను ప్రభావితం చేసేందుకు ప్రచార యంత్రాంగాన్ని ముమ్మరంగా వినియోగిస్తోంది. ప్రజల నిరసనలను తక్కువ చేసి చూపేందుకు, ప్రభుత్వ కథనాలకు విశేష వ్యాప్తి కల్పించేందుకు మీడియాను ఉపయోగించుకొంటోంది. అత్యవసర పరిస్థితి కాలంలో ఇందిరాగాంధీ ఇవే పద్ధతులను అనుసరించారు సుమా!

వార్తలు, వార్తా వ్యాఖ్యలు ప్రభుత్వానికి అనుకూలంగా వుండేలా చేసేం దుకు మోదీ సర్కార్ క్రూరమైన దమన చర్యలకు పాల్పడుతోంది. పౌరసత్వ సవరణ చట్టం–జాతీయ పౌర పట్టికకు వ్యతిరేకంగా తీవ్రమవుతోన్న శాంతి యుత, ప్రజాస్వామ్యయుత ఆందోళనలను బీజేపీ పాలిత రాష్ట్రాలు ప్రభావ శీలంగా నిషేధించాయి. నిరసన ప్రదర్శనలకు అనుమతించినప్పుడు శాంతి భద్రతల పరిరక్షణ యంత్రాంగం వాటికి అవాంతరాలను కల్పించేందుకు ప్రయత్నిస్తోంది. నిరసనకారులతో వ్యవహరించడంలో మితిమీరిన బల ప్రయోగం సాధారణమైపోయింది. పౌరసత్వ చట్ట వ్యతిరేక ఆందోళనలపట్ల పోలీసులు వ్యవహరిస్తున్న తీరును, హర్యానాలో జాట్‌ల, మహారాష్ట్రలో మరాఠాల నిరసనోద్యమాల విషయంలో పోలీసులు వ్యవహరించిన తీరుతో పోల్చి చూడండి. బీజేపీ అగ్రనాయకుడు యోగి ఆదిత్యనాథ్ పాలనలో ఉన్న ఉత్తరప్రదేశ్‌లో భయం రాజ్యమేలుతోంది. పలు పట్టణాలలో పోలీసులు వ్యవహరిస్తున్న తీరు చూస్తుంటే ముస్లిం సమాజంపై వారు యుద్ధం చేస్తున్నారని చెప్పక తప్పదు.

ప్రజాస్వామ్యం, వైవిధ్యం, అభివృద్ధి మొదలైనవి భారత్ భావన నిర్వచన ప్రాతిపదికలు. దేశ చరిత్రలోని ప్రస్తుత దశ ఆ సమున్నత సూత్రాలను సవాల్ చేస్తున్నది. భారతీయ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో పడింది. బహుశా అది వ్యవస్థాగత సంక్షోభం కావచ్చు. తత్కారణంగానే మన ఆర్థికం అంతకంతకూ దిగజారిపోతున్నది. ఆర్థిక వ్యవస్థ మందగమనం తీవ్రమాంద్యంగా పరిణమిస్తోంది. నిరుద్యోగం పెరిగిపోతోంది. తీవ్ర దుస్థితి నుంచి వ్యవసాయ రంగానికి ఉపశమనం లభించ డమే లేదు. అన్నదాత ఆవేదన పాలకులకు పట్టడం లేదు. మోదీ ప్రభుత్వం ఈ సంక్షోభాన్ని రూపుమాపడం కాదు కదా అసలు సమస్యను అర్థం చేసుకున్నదా అన్నది కూడా సందేహాస్పదంగా వున్నది. కనుకనే కాబోలు ఈ సంక్షోభ తీవ్రత నుంచి దేశ ప్రజల దృష్టిని మరల్చేందుకు వారిలో జాతీయవాద భావోద్వేగా లను రెచ్చగొట్టేందుకు అవిచ్ఛిన్నంగా ప్రయత్నిస్తోంది. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతి పత్తి నిచ్చిన అధికరణ 370 రద్దు, అయోధ్య తీర్పు, పౌరసత్వ సవరణ చట్టం మొదలైనవి ఆ ప్రయత్నాలలో భాగమే.

ఈ చర్యల పర్యవసానాలు దేశ శ్రేయస్సుకు ప్రతికూలంగా దీర్ఘకాలిక ప్రభావాలను చూపనున్నాయి. అయితే మోదీ ప్రభుత్వానికి ప్రజాదరణను పెంపొందించడమనేది వాటి స్వల్పకాలిక లక్ష్యం. ఇందుకు ప్రజాస్వామిక హక్కులు, సంస్థాగత సాధనాలు అవరోధంగా వున్నాయి. వీటిని తొలగించు కునేందుకే ప్రజాస్వామ్య సంస్థలు, హక్కులు, పాలనా పద్ధతులను కాలరాచి వేసే చర్యలను ముమ్మరంగా చేపట్టడం జరుగుతోంది. ఆ చర్యలకు వ్యతిరేకంగా జరుగుతోన్న పోరాటం ఫలితాలు ఎలా వుంటాయన్నది ప్రస్తుత దశలో చెప్పలేము. కాలంలోకి జారిపోయిన సంవత్సరం (2019)లో మన సమున్నత గణతంత్ర రాజ్యం సంకుచిత ధోరణుల్లోకి ముడుచుకు పోతున్న సూచనలు కన్పించాయి. ఆ తిరోగమనం నుంచి మన రిపబ్లిక్‌ను ప్రస్తుత ప్రజా ఉద్యమం కాపాడే అవకాశమున్నది. అయితే కొనసాగుతున్న ప్రజా నిరసనలను మతాల ప్రాతిపదికన దేశ ప్రజలలో చీలికలు తీసుకు వచ్చేందుకు ఉపయోగించుకోవచ్చని మోదీ ప్రభుత్వం ఇంకా ఆశిస్తోంది. ఈ విషయంలో పాలకులు తమ ఆశలను ఇంకా వదులు కోలేదు. రాబోయే కొద్ది వారాలలో నిరసనోద్యమాలు ఎలా పర్యవసించనున్నాయనే దాన్ని బట్టి అంతా ఆధారపడివున్నది. అయితే ఒక విషయం మాత్రం స్పష్టం. దేశప్రజలలో చీలికలు సృష్టించేందుకు పాలకులు కృతనిశ్చయంతో వున్నారు. దేశాన్ని సమైక్యంగా వుంచే బృహత్తర బాధ్యతను ప్రజలే చేపట్టాలి. ఈ వాస్తవం దృష్ట్యా కొత్త సంవత్సర నిర్ణయం ఇలా వుండాలని నేను ప్రతిపాదిస్తున్నాను : 'వో తోడేంగే, హమ్ జోడేంగే' (వారు విభజిస్తు న్నారు, మనం ఏకమవుదాం).

పౌరసత్వ సవరణ చట్టం జాతీయ పౌర పట్టిక–జాతీయ జనాభా పట్టిక వ్యతిరేక నిరసనలు జాతీయ సమైక్యతకు దోహదం చేసే ఒక సరికొత్త అఖిల భారత ఉద్యమం భారత్ జోడో ఆందోళన్‌గా పరిణమించి తీరాలి. బీజేపీ ప్రభుత్వ విచ్ఛిన్నకర కుతంత్రాలకు వ్యతిరేకంగా ఈ నిరసనో ద్యమాలు మరింతగా ముమ్మరమవ్వాల్సిన అవసరం ఎంతైనా వున్నది. ఈ నిరసనోద్య మాలతో పాటు మత సామరస్యాన్ని పెంపొందించే సానుకూల, నిర్మాణాత్మక చర్యలను కూడా మనం చేపట్టవలసి వున్నది. మూక హింసాకాండకు వ్యతి రేకంగా జరుగుతోన్న ప్రచారాన్ని ప్రతిఘటించడానికి నిరసనకారులు కచ్చితంగా గాంధేయ అహింసా పద్ధతులను అనుసరించి తీరాలి. ప్రజా నిరసనలు రాజకీయ ప్రయోజనాలకు దుర్వినియోగమవ్వడాన్ని అరికట్టేం దుకు ఉద్యమకారులు తమ ఉద్యమ రాజకీయేతర స్వభావాన్ని పరిరక్షించు కోవాలి. భారత్ సమైక్యత, సమగ్రతలకు జరిగిన నష్టాన్ని నివారించేందుకు ఉద్యమ ప్రతీకలుగా త్రివర్ణ పతాకం, భారత రాజ్యాంగం మాత్రమే ఉండాలి. జాతీయ సమైక్యతా సందేశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకు వెళ్ళేందుకు జనవరిలో పలు సందర్భాలు ఉన్నాయి. అవి: జనవరి 3న మహిళా, బహుజన సంస్థలు నిర్వహించే సావిత్రీ బాయి పూలే జయంతి; జనవరి 12న జాతీయ యువజనోత్సవంగా పాటిస్తున్న వివేకానంద జయంతి; జనవరి 17న రోహిత్ వేముల వర్ధంతి; జనవరి 23న నేతాజీ సుభాస్ బోస్ జయంతి; జనవరి 26న గణతంత్ర దినోత్సవం, జనవరి 30న గాంధీజీ వర్ధంతి. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా సాగుతోన్న ఉద్యమం ఇప్పటికే పలు సృజనాత్మక జాతీయ ఐక్యతా వ్యక్తీకరణలను చూసింది. యథాప్రకారం జరిగే నిరసన ప్రదర్శనలు ఒక స్థాయి, దశను దాటి కార్యసాధక ఫలితాలను సాధించలేవు. ఈ వాస్తవం దృష్ట్యా మన నిరసనలు వినూత్న రీతుల్లో జరగాల్సిన అవసరమున్నది.

అవును, ఏడు దశాబ్దాల భారత గణతంత్ర రాజ్యం పెడదోవ పట్టింది. దాని ప్రస్తుత ప్రస్థానం మన చిరంతన, సమున్నత నాగరికతా విలువల స్ఫూర్తిని కాలరాచివేస్తోంది. పౌరసత్వ సవరణ చట్టం–జాతీయ పౌర పట్టిక –జాతీయ జనాభా పట్టికపై వెల్లువెత్తుతోన్న నిరసనలు కేవలం ఒక వివక్షా పూరిత చట్టం లేదా రాజ్యాంగ విరుద్ధంగా ప్రభుత్వం చేపట్టిన ఒక చర్యకు వ్యతిరేకంగా పిక్కటిల్లుతోన్న ప్రజాఘోష మాత్రమే కాదు. అసోంలో అన్ని మతాల ప్రజలూ తమ విలక్షణ అస్తిత్వాన్ని సంరక్షించుకునేందుకు, తమకు భరోసా కల్పించిన ఒక ఒడంబడిక ఉల్లంఘనకు గురికాకుండా ఉండేందుకు, విశాల భారతదేశంతో ఒక గౌరవపూర్వక సంబంధాన్ని భద్రపరచుకునేందుకై వీధుల్లోకి పోటెత్తడం కొనసాగుతోంది. ఆసేతు హిమాచలం ముస్లిం సహో దరులు ఒక అపూర్వ సామూహికోద్యమంలో భాగస్వాములవుతున్నారు. సమ పౌర సత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. తమను ద్వితీయ శ్రేణి పౌరులుగా కుదించివేయడంపై వారు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. తమ సమ పౌరసత్వాన్ని చట్టబద్ధంగా తొలగించేందుకు చురుగ్గా జరుగు తోన్న ప్రయత్నాలను నిరోధించేందుకు వారు కృతనిశ్చయులయ్యారు. ఇక యువ భారతీయులు మతాలు, ప్రాంతాలకు అతీతంగా సమైక్యమవుతు న్నారు. జాతి గత చరిత్రను సంకుచిత దృక్పథంతో చూస్తూ ప్రతీకార ధోరణులకు పాల్పడుతున్న వారికి ఈ దేశ వర్తమానమూ, భవిష్యత్తు బందీ కాకూడదనే సంకల్పంతో వారు ఉద్యమిస్తున్నారు. భారతదేశపు ఆత్మను

(స్వరాజ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు)

మూలవాసులకు పౌరసత్వ పరీక్షలా!

ఆర్యులు ఈ దేశానికి రాకముందు కుల, మతల్లాంటివేమీ లేవు. సామాజిక అంత రాలూ లేవు. ఈ దేశానికి మొట్టమొదటగా వలస వచ్చిన ఆర్యులు ప్రకృతి ఆరాధన స్థానంలో దేవుళ్ళను, వేదమతం పేరు మీద మతాన్ని సృష్టించారు. వర్ణ వ్యవస్థను సృష్టించారు. వలస వచ్చిన ఆర్యజాతులను బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులన్నారు; ఈ దేశవాసు లందర్నీ శూద్రులన్నారు. శూద్రులను కులాలుగా విభజించిచారు. ఆర్యులపై వీరోచితంగా పోరా డిన శూద్రులను అతి శూద్రులుగా ముద్రవేసారు. శూద్రులకు, అతి శూద్రులకు చదువును నిరాకరించారు. అతిశూద్రులకు చదువుతోపాటు ప్రార్థనాలయాల ప్రవేశాన్నీ నిషేధించి అంట రానివారిగా ముద్రవేసి ఊరి బయట ఉంచారు. సామాజిక అంతరాలకు, కుల విభజన దుర్మార్గా నికి చరమగీతం పాడిన బౌద్ధాన్ని ఈ దేశం నుండి తరిమివేసారు. కులవ్యవస్థను, సామాజిక అంతరాలను అలాగే ఉంచడానికి హిందూ రాజులు తమ శక్తి యుక్తులను, పాలనా కాల న్నంతా వినియోగించారు. వేదాల్లో కనబడిన వర్ణవ్యవస్థ భగవద్గీత, మనుధర్మశాస్త్రంలో బల పరచబడి స్థిరీకరణం పొందింది.

ఈ దేశంలో బౌద్ధం ఉన్నతదశలో ఉన్న కాలంలో బౌద్ధ ధర్మంలో అందరికీ ప్రవేశం లభించింది. హిందూ మతంలో శూద్రులకు, అతి శూద్రులకు లేని సామాజిక గౌరవం, ప్రార్థనాలయాల ప్రవేశం, చదువుకునే అవకాశం బౌద్ధ ధర్మంలో ఉన్నాయి. అందుకోసం అతిశూద్రులు ఎక్కువ సంఖ్యలో, శూద్రులు కూడా బౌద్ధంలో చేరారు. బ్రాహ్మణ మతం, శంకరాచార్యాదుల విజృంభ ణతో బౌద్ధులు ఊచకోతకుగురై, బౌద్ధారామాలు దేవాలయాలుగా మారాయి. తర్వాత ప్రపం చవ్యాప్తమైన బౌద్ధ నైతిక ధర్మం బుద్ధుడు పుట్టిన నేలలో మైనారిటీదైపోయింది. వలస వచ్చిన ఆర్యుల పాలన స్థిరీకరింపబడి బుద్ధభూమి ఆర్యభూమై ఈ దేశవాసులు పాలితులయ్యారు.

బ్రాహ్మణరాజ్యం వచ్చి కులవ్యవస్థ మళ్ళీ విశ్వరూపం దాల్చిన తర్వాత భారతీయులంతా కులాలుగా, అంటరాని వారిగా విడిపోయారు. శూద్రులు, అతి శూద్రులకు చదువు నిరాకరిం పబడింది. రాజుల్లోని అంతఃకలహాలు, శైవ వైష్ణవ తగాదాలు, కుల కొట్లాటలు భారతీయు లను విభజించి విదేశీయులకు ద్వారాలు తెరిచాయి. ముస్లిం రాజుల కన్ను భారతదేశంపై పడింది. వీరు హిందూ రాజుల్లా కాకుండా శూద్రులకు, అతి శూద్రులకు చదువుకునే అవకా శాలు కల్పించారు. తమ మతంలో చేరిన వారికి అతి శూద్రులకు కూడా ప్రార్థనా లయాల ప్రవేశాన్ని కల్గించారు. దాంతో హిందూమతంలో అతిశూద్రులుగా ఉన్న వాళ్ళు, శూద్రులు కూడా కొంత మంది ముస్లిం మతాన్ని స్వీకరించారు. మధ్య ఆసియా ప్రాంతంనుంచి వచ్చిన ముస్లిం రాజులు పిడికెడుమందే. మిగితా వాళ్ళంతా మతం మార్చుకున్న దళిత బహుజనులే. ఆర్యులు పాలకులుగా ఇక్కడే ఉండిపో యినా ముస్లిం పాలకులు ఆంగ్లేయులు వచ్చింతర్వాత వెళ్ళిపోయారు. 80 ఏండ్ల ముస్లిం రాజుల పాలనలో భారతదేశ వ్యాప్తంగా ఉన్న 12 శాతం ముస్లింలలో 95%మందికి మూలాలు భారతీయ మూలజాతుల్లో ఉన్నాయి. శూద్రుల్లో ఉన్నాయి. వీళ్ళంతా భారతీయులే. భారత స్వతంత్ర పోరాటంలో ముస్లింలు ఆంగ్లే యులతో వీరోచితంగా పోరాడారు. అసు వులు బాసారు. ఈ దేశాన్ని హృదయా నికి హత్తుకున్నారు.



ఈ దేశ మూలవాసుల మూలాలున్న వారే చాలామంది వివక్షను భరించలేక తమకు సామాజిక గౌరవం లభించే మతాల్లో చేరిపోయారు. మత స్వేచ్ఛ, భావప్రకటనా స్వేచ్ఛ భారతీయ పౌరులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు. మతాలు వేరయినంత మాత్రాన వాళ్ళను ఈ దేశ పౌరసత్వం నుండి వేరు చేయడం సరైంది కాదు.

అలాగే బ్రిటిష్‌వారి పాలనా కాలంలో క్రైస్తవులుగా మారినవాళ్ళందరూ శూద్ర, అతి శూద్రకులాలకు చెందినవారే. క్రైస్త వులుగా మారిన దళితులు, శూద్రులు చర్చిలకు వెళ్ళగలిగారు. ఇంగ్లీషు చదు వులు చదువుకోగలిగారు. బ్రిటిష్ పాలన ముగిసిం తర్వాత విదేశీ పాలకులు వెళ్ళిపోయారు. భారతీయ మూలాలున్న క్రైస్తవులు ఈ దేశవాసులుగా ఇక్కడే ఉండిపోయారు. ముస్లిం మూలాలు, బ్రిటిష్ మూలాలున్న వారు ఈ దేశంలో అతి స్వల్ప సంఖ్యలో మాత్రమే ఉన్నారు. ఇలా మైనారిటీలుగా ఉన్న బౌద్ధ, ఇస్లాం, క్రైస్తవ మతస్థులంతా ఈ దేశమూలవాసులే.

వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకొని మన రాజ్యాంగంలో సెక్యులర్, సామ్యవాద, గణతంత్ర, సర్వసత్తాక పదాలు చేర్చబడ్డాయి. ఏ మతాన్నయినా అవలంబించే మతస్వేచ్ఛ మనకు రాజ్యాంగంలో పొందుపరుచబడింది. రాజ్యాంగంలో భారతీయ పౌరసత్వ చట్టమూ స్పష్టం గానే ఉంది. భారతదేశ వ్యాప్తంగా ఎంతో మంది గిరిజనులు, ఆదివాసీలు అడవుల్లో నివ సిస్తూ ఇప్పటికీ నాగరికతకు దూరంగానే ఉన్నారు. అడవితల్లి ముద్దు బిడ్డలుగా చిరునా మాలు లేకుండానే ఉన్నారు. బీసీలుగా చెప్పబడే వాళ్ళలో అనేక మంది సంచార జాతులు చిరునామాలు కూడా లేకుండా సంచార జీవులుగానే ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పౌరసత్వ సవరణ చట్టం (CAA-Citizen Amendment Act) జాతీయ పౌర రిజి స్ట్రేషన్ (NRC-National Register of Citizens) ల ప్రకారం వీళ్ళంతా భారతీయ పౌరు లుగా ఎలా నిరూపించుకుంటారు? ఏ ఆధారాలు చూపుతారు? నిరూపించుకోలేని వారంతా అసోంలోలా శరణార్థ జైలు శిబిరాల్లో మగ్గిపోవాల్సిందేనా? ఇవి ఎంత మందికి దుఃఖదాయ కంగా ఉన్నాయో దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలు, ఆ ఆందోళనల్లో మరణిస్తున్న పౌరులను చూస్తే అర్థం కావడం లేదా?

అక్రమ చొరబాటుదారులనుకాని, తీవ్రవాదులనుకాని గుర్తించడానికి ఇప్పుడున్న చట్టాలు సరిపోవా? తమ దేశంలో, తాము పుట్టిన నేలలో తాము ఈ దేశ పౌరులమని నిరూపించుకో వాలా? తలలను ఈ దేశ నేలకానిస్తూ ప్రార్థనలు చేసే ముస్లింలు, ఈ దేశ పౌరులు కాకుండా పోతారా? ఈ దేశ మూలవాసుల మూలాలున్నవారే చాలామంది వివక్షను భరించలేక తమకు సామాజిక గౌరవం లభించే మతాల్లో చేరిపోయారు. మత స్వేచ్ఛ, భావప్రకటనా స్వేచ్ఛ రాజ్యాంగం భారతీయ పౌరులకు కల్పించిన హక్కులు. మతాలు వేరయినంత మాత్రాన వాళ్ళను ఈ దేశ పౌరసత్వం నుండి వేరు చేయడం సరైంది కాదు. హిందువులుగా ఉన్న వల సదారులు కూడా ఈ చట్టాల ద్వారా తమ పౌరసత్వాన్ని నిరూపించుకోవడానికి నానా యాత నలు పడాల్సివస్తుంది. ఆధార్ కార్డు, పాన్ కార్డ్, వోటర్ ఐడెంటిటీ కార్డు, నివాసస్థలం లాంటివి ప్రభుత్వం జారీ చేసినవే ఉన్నప్పుడు నాది ఈ దేశమే అని నిరూపించుకోవడానికి కష్టతరమైన నిబంధనలను పెట్టడం సరైందేనా? ఇది రాజ్యాంగ ఉల్లంఘన కదా? 'హిందూదేశ' మత ఎజెండాను ముందుకు తెచ్చి దేశాన్ని మతదేశంగా మార్చడానికే సిఏఏలు, ఎన్.ఆర్.సి.లు.

మనిషి సృష్టికి ప్రతి సృష్టి చేసే స్థితికి ఎదిగిన దశలో దేశాలను మత దేశాలుగా మార్చా లను కోవడం అభివృద్ధి నిరోధకమే. మత తీవ్రవాదంతో పాటు ఏ తీవ్రవాదమూ వద్దు. ప్రజా స్వామ్యమే ముద్దు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా భారతరాజ్యాంగాన్ని మనస్ఫూర్తిగా అమలు చేస్తే ఏ సవరణలూ అవసరంలేదు.


■ డా. కాలువ మల్లయ్య

తీవ్రతరమౌతున్న నిర్బంధం

తెలంగాణలో భిన్న కారణాల వల్ల మావోయిస్టు పార్టీ కార్యక్రమాలు తగ్గి ఆ పార్టీ గిరిజన ప్రాంతాల్లో జరిగే పోరాటాలలో పాల్గొంటున్నది. నాకు తెలిసి తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత వాళ్ళవైపు నుండి ఎలాంటి చర్యలు లేవు. నిజానికి వాళ్ళు తెలంగాణలో బలంగా ఉన్న రోజుల్లో కూడా ఇన్ని ప్రజాసంఘాల మీద, ఆ సంఘాల కార్య కర్తల మీద ఉపా చట్టాన్ని ఉపయోగించిన దాఖలాలు లేవు. గత ఒకటి, రెండు నెలలుగా దాదాపు పన్నెండు ప్రజాసంఘా లకు చెందిన యాభై ఒక్క మంది కార్యకర్తల మీద విచక్షణా రహితంగా ఉపా చట్టాన్ని ప్రయోగిస్తూ, అందరిమీద ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేసారు. బహుశా దేశంలో ఎక్కడా కూడా ఇంత మంది కార్యకర్తల మీద, సంఘ బాధ్యుల మీద ఈ చట్టాన్ని ఉపయోగించిన దృష్టాంతాలు లేవు. మావోయిస్టు పార్టీని అదుపులో పెట్టాం అని మళ్ళీ మళ్ళీ ప్రకటిస్తున్న పోలీ సులకు, అకస్మాత్తుగా ఇంత మందిని కేసుల్లో ఇరికించే ఐడియా ఎందుకు వచ్చిందో అంతుపట్టడం లేదు. ముఖ్యమంత్రి అమిత్ షాను కలిసివచ్చిన తర్వాత ఈ నిర్బంధం పెరిగిందనేది కొంత వరకు నిజం.

భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు ఉపా ఒక క్యాన్సర్ పుండు లాంటిది. రాజ్యం ఎవ్వరిపైన అయినా.. తనకు విధేయంగా లేనివారిపైన, తనను ప్రశ్నిస్తున్న వారిపైన, రాజకీయ విశ్వాసా లున్న వారిపైన సునాయాసంగా ఈ చట్టాన్ని ప్రయోగిస్తు న్నది. ఈ చట్టం తెచ్చిన పాపం కాంగ్రెస్ వారిదే. ఇప్పుడు అధి కారంలో ఉన్న పార్టీకి ఇది 'యమపాశంగా' దొరికింది. నేరాలు చేసే వాళ్ళ మీద ఉపయోగించడానికి చాలా ఇతర చట్టాలు న్నవి. అవి ఏవీ కాకుండా ఈ చట్టమే ఉపయోగించడానికి కారణం.. దీని ద్వారా పోలీసు యంత్రాంగానికి ఏ శ్రమ లేకుండా కార్యకర్తలని, రాజ్యానికి ఇబ్బంది అనిపించిన వారిని ఏ సాక్ష్యాధారాలు లేకుండా సరాసరి ఆరు నెలలు జైలుకు పంపవచ్చు. దేశం మొత్తంలో ఉపా చట్టం మీద అరెస్టు ఐన వాళ్ళల్లో 90% మంది నిరపరాధులని న్యాయస్థానాలు తేల్చాయి. ఈ చట్టం కింద ఆరు నెలలే కాక ఈ చట్టం కింద కొత్త కేసులు పెట్టి 'జైలు శిక్షను పొడిగించవచ్చు. తీరా వాళ్ళు నేరస్థులు కారు అని కోర్టులో కేసులు కొట్టివేయవచ్చు. కాని ఆరు నెలలకు పైగా జైల్లో పెట్టినందుకు పోలీసుల మీద ఎలాంటి చర్యలు తీసుకునే వీల్లేకపోవటం ఈ చట్టంలోని తీవ్ర మైన లోపం. గతంలో టాడా, పోటాకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాల్లాంటి ఉద్యమం ఈ చట్టానికి వ్యతిరేకంగా చేపట్టవల సిన బాధ్యత ప్రజాస్వామ్య ప్రేమికుల మీద ఉంది.

మళ్ళీ తెలంగాణకు వస్తే గత వారం రెండు వారాలుగా విచ క్షణా రహితంగా తెలంగాణ ప్రజాఫ్రంట్, తెలంగాణ విద్యార్థి వేదిక అలాగే చైతన్య మహిళా సంఘ బాధ్యుల ఇళ్ళల్లోకి చొర బడి, ఎక్కడ దొరికితే అక్కడ అరెస్టు చేస్తున్నారు. మావోయిస్టు లకు సహాయపడుతున్నారని, తెలంగాణలో మావోయిస్టు పార్టీ కార్యక్రమాలు ఎక్కడా కనిపించకున్నా పక్క రాష్ట్ర ఉద్యమానికి తోడ్పడుతున్నారనేది వీళ్ళ మీద ఆరోపణ. పోలీసులు చేస్తున్న ఆరోపణలలో విప్లవ సాహిత్యం దొరికిందనేది విచిత్రమైన ఆరో పణ. వాళ్ళ దగ్గర లభించింది అని చెపుతున్న సాహిత్యం నిషే ధించబడింది కాదు. తెలంగాణలో ఏ కవి, రచయిత, ఉపా ధ్యాయ, అధ్యాపకులు కొంచెం చదువుకున్న వాళ్ళ ఇళ్ళు వెతి కినా ఈ సాహిత్యం దొరుకుతుంది. చాలా పుస్తకాలు చదివా ననే ముఖ్యమంత్రి గారు కూడా ఏదో సందర్భంలో ఈ సాహి త్యాన్ని చూసారనే అనుకుంటున్నాను.



ఈ మధ్యే మహారాష్ట్ర అగ్రనాయకుడు శరద్ పవార్ దేశవ్యా ప్తంగా భీమా కోరేగాం కేసులో వరవరరావుతోసహా అరెస్టు అయిన పదిమంది ప్రజాస్వామ్యవాదుల అరెస్టులనూ తప్పుప ట్టడమే కాక, పూనా పోలీసుల మీద చర్య తీసుకోవాలని పూనాలో ఒక ప్రెస్ మీటింగ్‌లో అనడమే కాక, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాకరేను కలిసి ఈ అంశంపై చర్చించారని పత్రికల్లో వార్తలు వచ్చాయి. ఈ క్రమంలోనే నక్సలైట్ల సాహిత్యం ఉండడం నేరమెలా ఔతుందని ప్రశ్నించారు. శరద్ పవార్ రాజకీయాలకు కొత్త కాదు. రెండు పర్యాయాలు మహా రాష్ట్ర ముఖ్యమంత్రిగా, అలాగే కేంద్ర క్యాబినెట్‌లో పని చేసిన అనుభవముంది. ఒక దశలో ఆయన ప్రధానమంత్రి అభ్యర్థి కూడా అనుకున్న రోజులున్నవి. ఇంత అనుభవం ఉన్నా ఒక రాజకీయ నాయకుడు అలా భావించాడంటే, తెలంగాణలో 50 మంది మీద ఉపా కేసులు పెట్టడాన్ని తెలంగాణ రాజకీయ నాయకత్వం ఎలా సమర్థించుకుంటుందో తెలియదు.

శ్రుతి, సాగర్ ఎన్‌కౌంటర్ల తర్వాత వచ్చిన అనూహ్య స్పంద నతో ముఖ్యమంత్రి ఎన్‌కౌంటరు లేని తెలంగాణ అని అన్నారు. మళ్ళీ మొన్న దిశ సంఘటనలో నలుగురిని ఎన్‌కౌంటర్ చేశారు. దాని మీద మొత్తంగా హై కోర్టు, సుప్రీంకోర్టులు స్పందించడంతో ఒక న్యాయ సమీక్ష జరుగుతున్నది. 'దిశ' మీద జరిగిన అమానుష దాడికి తెలంగాణ సమాజం చాలా పెద్ద ఎత్తున స్పందించింది. దోషులకు కఠిన శిక్ష వేయండి అని అడగడంలో తప్పులేదు. అడగాలి కూడా, కాని సరాసరి నరకండి, చంపేయండి, మేమే చంపుతాం అనే స్పందన ప్రజాస్వామ్య సమాజానికి, చట్టబద్ధ పాలనకు ప్రమాదం. వందల సంవత్సరాల పరిణామ క్రమంలో నాగరికత ముందుకు వెళ్తున్న క్రమం నుండి చట్టబద్ధ పాలననే ఒక ప్రజాస్వామిక ప్రక్రియను సమాజాలు అభివృద్ధి పరచుకొ న్నవి. గొంతు దాకా ఆయుధాలుగల రాజ్యానికి, నిరాయుధు లైన పౌరులకు మధ్య సమతౌల్యం కొరకు రాజ్యాంగాలు, హక్కులు, చట్టబద్ధ పాలన అనే విలువలు, ప్రమాణాలు వచ్చాయి, రాజ్యానికి విచ్చలవిడి అధికారమిస్తే హిట్లర్ లాంటి దుర్మార్గులు దానిని ఎలా ఉపయోగిస్తారో, ఆ మానవ విషాదాన్ని ప్రపంచం చూసింది. అందుకే చంపే యండి, ఎన్‌కౌంటర్ చేయండి అని సమాజమే అడగడం ప్రారంభిస్తే, రాజ్య అధికారం సమాజం పెట్టిన అన్ని పరి ధులు, ప్రమాణాలు దాటితే, అప్పుడు ఇదే ప్రజలు చేయగలగ టానికి ఏమీ మిగలదు. సమాజం సంక్షోభ సమయాల్లో కూడా తన సంయమనాన్ని, హేతుబద్ధతని కోల్పోకూడదు. అలా కోల్పోవడం సమాజానికే చాలా ప్రమాదం.

మావోయిస్టు ఉద్యమ రాజకీయాలు ఎందుకు పుట్టాయో, ఆ పోరాటాలు ఎందుకు జరుగుతున్నాయో అవగాహన చేసుకొన డానికి గత అర్ధ శతాబ్దకాలం చాలా ప్రయత్నాలు జరిగాయి. మన రాష్ట్రంలోనే చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఒక

ఆర్థిక అసమానతలు, సామాజిక ఆధిపత్యాలున్నంత కాలం ఉద్యమాలు ఏదో రూపంలో జరుగుతూనే ఉంటాయి. చారిత్రక స్పృహ కలిగిన ప్రభుత్వాలు ఉద్యమాలకు రాజకీయ పరిష్కారాలు కనుక్కోవడానికి కృషి చేయాలే తప్ప, మాట్లాడితే ఉపా చట్టంలో ఇరికించడం అవివేకం. ఈ నిర్బంధాన్ని గురించి ఒక మీటింగ్ పెడితే నలభై ప్రజా సంఘాలు హాజరయ్యాయి. ఈ ప్రజాస్వామ్య శక్తులను ప్రోత్సహించడం, వాళ్ళు లేవదీసే చర్చను మరింత ముందుకు తీసుకపోవడం తెలంగాణకే కాదు దేశానికీ అవసరం.

క్యాబినెట్ సబ్ కమిటీని వేసారు. హింస ప్రతిహింసల వలయం నుండి సమాజం బయట పడటానికి పౌర స్పందన వేదిక దాదాపు ఒక దశాబ్ద కాలం తీవ్ర కృషి చేసింది. విప్లవోద్యమ నాయకులతో సరాసరి ప్రభుత్వ ప్రతినిధులే నాలుగు రోజులు చర్చలు జరిపారు. ఆర్థిక అసమానతలు, సామాజిక ఆధిపత్యా లున్నంత కాలం ఉద్యమాలు ఏదో రూపంలో జరుగుతూనే ఉంటాయి. చారిత్రక స్పృహ కలిగిన ప్రభుత్వాలు ఉద్యమాలకు రాజకీయ పరిష్కారాలు కనుక్కోవడానికి కృషి చేయాలే తప్ప, మాట్లాడితే ఉపా చట్టంలో ఇరికించడం అవివేకం. అలాగే 'దిశ' లాంటి అమానుష సంఘటనలు జరిగినప్పుడు తక్షణ చర్యలు ఏవి తీసుకున్నా ఇలాంటి నేరాలు సమాజంలో ఎందుకు జరు గుతాయి, నేరంలేని సమాజాన్ని మనం నిర్మించలేమా... అన్న తాత్విక, చారిత్రక కోణాలలో చర్చ జరగాలి. ఒక దశాబ్దన్నర క్రితం వరంగల్‌లో 'దిశ' లాంటి సంఘటనే జరిగినప్పుడు బాల గోపాల్ ఒక ప్రామాణికమైన విశ్లేషణ చేస్తూ కొన్ని మౌలికమైన ప్రశ్నలు చర్చకు పెట్టాడు.

సమస్యలు తీవ్రతరమౌతున్నప్పుడు వాటిని లోతుగా చర్చిం చడానికి ఒక విస్తృత ప్రజాస్వామ్య వాతావరణం సమాజాలకు, అలాగే ప్రభుత్వాలకు అవసరం. ఉమ్మడి రాష్ట్రంలో పౌరస్పందన వేదిక, శంకరన్ గారి ఆధ్వర్యంలో కొన్ని మౌలికమైన సవాళ్ళను పౌర సమాజం ముందే కాక, మావోయిస్టు పార్టీ ముందూ అలాగే ప్రభుత్వం ముందూ పెట్టింది. ఆ కాలంలో జరిగిన చర్చ మూడు సంపుటాలుగా వేదికే ప్రచురించి దేశం ముందు పెట్టింది. నిర్బంధ వాతావరణంలో ఇలాంటి ప్రయత్నాలు, ప్రయోగాలు సాధ్యం కావు. ఇప్పుడు ఉపా చట్టం ప్రయోగిం చిన ప్రజా సంఘాలన్నీ ఒక ప్రజాస్వామిక ప్రయోగంలో భాగం. 'తెలంగాణ ప్రజా ఫ్రంటు' ప్రజాస్వామ్య తెలంగాణ గురించి, 'తెలంగాణ విద్యార్థి వేదిక' శాస్త్రీయ ప్రజాస్వామ్య విద్య గురించి, 'చైతన్య మహిళా సంఘం' పేద మహిళల మధ్య పని చేస్తూ మహిళల సమానత్వం కొరకు కృషి చేస్తున్నారు. ఇపిడబ్ల్యూ స్థాయిలో 'వీక్షణం' పత్రికను నడుపుతున్న ఎడిటర్ వేణుగోపాల్ మీద కూడా ఉపా కేసు పెట్టారు. ఇవేవీ చట్ట వ్యతి రేక కార్యక్రమాలు కావు. వాళ్ళకు రాజకీయ విశ్వాసాలుండ వచ్చు. విశ్వాసాలు వాటంతకవే నేరం కావని అత్యున్నత న్యాయస్థానామే ఒక జడ్జిమెంట్ చెప్పి ఉంది.

దిశ లాంటి దుర్ఘటనలు పునరావృతం కావద్దంటే అందరికి విలువలతో కూడిన విద్య, అలాగే మహిళల పట్ల మగవాళ్ల ప్రవర్తన గురించి, మహిళల ఆత్మగౌరవం గురించి, సమాన త్వాన్ని గురించి చర్చ కాదు; సమాజ చైతన్యం పెంచే కృషి జర గాలి. నిజానికి ఇన్ని ప్రజాసంఘాలుండడమే తెలంగాణ విశి ష్టత. ఈ నిర్బంధాన్ని గురించి ఒక మీటింగ్ పెడితే నలభై ప్రజా సంఘాలు హాజరయ్యాయి. ఈ ప్రజాస్వామ్య శక్తులను ప్రోత్స హించడం, వాళ్ళు లేవదీసే చర్చను మరింత ముందుకు తీసుక పోవడం తెలంగాణకే కాదు దేశానికీ అవసరం. తెలంగాణ ప్రజలు పోరాడింది కేవలం భౌగోళిక తెలంగాణ కొరకు కాదు, ఒక మానవీయ ప్రజాస్వామ్య తెలంగాణ దిశగా ఈ ప్రాంత ప్రయాణం ఉండాలి.

■ జి. హరగోపాల్

శ్రీశక్తి



ఫొటో: సింహాచారి



చదువు... అది అయిపోగానే ఉద్యోగం... ఈ రొటీన్ జీవితం కాదు ఆమె కోరుకుంది! తన కాళ్లపై తాను నిలబడి... నలుగురికి ఉపాధి కల్పించాలనే సంకల్పం. అన్నింటికి మించి గిరిజన యువతులూ స్వయంశక్తితో ఎదగ గలరని నిరూపించాలన్న తాపత్రయం. అదే గౌతమి కుర్సమ్‌ను అభిరుచి వైపు అడుగులు వేయించింది. ఓ బ్రాండెడ్ పిజ్జా అవుట్‌లెట్‌కు యజమానిని చేసింది. అమ్మానాన్నలు అండగా... ఆత్మవిశ్వాసం తోడుగా నచ్చిన రంగంలో ఇష్టపడి కష్టపడుతున్న గౌతమి అంతరంగం ఇది...

కలల అభిరుచి!

"నాన్న ప్రభుత్వ డాక్టర్. అమ్మ ఉపాధ్యాయురాలు. అన్నయ్య కూడా మెడిసిన్ చదివి నాన్న బాటలోనే నడుస్తున్నాడు. కానీ నాకెందుకో వాటి వైపు మనసు మళ్లలేదు. డాక్టర్ని కావాలనీ, 'టెన్ టు ఫైవ్' ఉద్యోగం చేయాలనీ అనిపించలేదు. ఏదైనా సరే... సొంతంగా, నాకంటూ ఒక గుర్తింపు ఉండే పని చేయాలనుకున్నా. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అటవీ ప్రాంతంలో ఉన్న మారుమూల గ్రామం బైరాగులపాడు మాది. గిరిజన కుటుంబం. మా నాన్న డాక్టర్ కె.వెంకటరమణ ఉద్యోగరీత్యా వివిధ ప్రాంతాల్లో పనిచేశారు. దీంతో నేనూ విద్యాలయాలు మారాల్సి వచ్చింది. అమ్మ ప్రభుత్వ టీచర్ కావడంతో ఇంట్లో ఎప్పుడూ చదువుకు ప్రాధాన్యం ఉండేది. పాత ఖమ్మం జిల్లా చర్లలో టెన్త్ అయిపోగానే గుంటూరులో ఇంటర్ చదివాను. అమ్మానాన్నలు నన్ను కూడా డాక్టర్‌గా చూడాలనుకున్నారు. అయితే పారిశ్రామికవేత్త కావాలన్నది నా కల. నా అభిరుచి తెలుసుకుని నాన్న నన్ను ఫుడ్ ప్రాసెసింగ్ వైపు దృష్టిపెట్టమన్నారు. అలా బాపట్లలోని 'కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ'లో చదివా. తరువాత జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఫుడ్ సైన్సెస్‌లో బీటెక్, పంజాబ్‌లోని సంత్ డొంగోవాల్ ఇనిస్టిట్యూట్‌లో పీజీ పూర్తి చేశాను.

అనుభవం కోసం ఉద్యోగం...

ఏదైనా పరిశ్రమ పెట్టాలంటే సంబంధిత రంగంలో అనుభవం ఉండాలి కదా! అందుకే పీజీ అయ్యాక బెంగళూరులోని 'క్వాలిటీ వాల్స్'లో రీసెర్చ్ ఎగ్జిక్యూటివ్‌గా చేరాను. అదే సమయంలో నాకు పెళ్లయింది. దీంతో కొన్నాళ్లు ఉద్యోగానికి దూరంగా ఉండాల్సి వచ్చింది. అలాగనీ నా లక్ష్యాన్ని పక్కన పెట్టలేదు. దానికితో బీటెక్ చదివే రోజుల్లో సామాజిక పరిస్థితులపై అవగాహన కలిగింది. గిరిజనులంటే కాస్త చిన్న చూపు చూస్తున్నట్టు అనిపించేది. దానికి బాధపడినా... విద్య, విజ్ఞానంతో దేన్నయినా జయించవచ్చని అమ్మానాన్నలు చెప్పేవారు. ఆత్మనూన్యతకు లోనైనప్పుడు భుజం తట్టి ప్రోత్సహించేవారు. అది నాలో ఆత్మస్థయిర్యాన్ని నింపింది. స్వయంకృషితో ఉన్నత స్థానాన్ని అందుకోవాలని, తద్వారా గిరిజనులు కూడా గొప్ప పారిశ్రామికవేత్తలు కాగలరని నిరూపించాలనే పట్టుదలను మరింత పెంచింది.

అప్పుడే ఆ ఆలోచన...

సొంతగా బిజినెస్ ప్రారంభించాలన్న కోరికైతే ఉంది కానీ... ఏంచేస్తే బావుంటుంది? ఎంత ఆలోచించినా స్పష్టత రాలేదు. మా ఆయన ఉద్యోగరీత్యా అప్పుడు మేము పటాన్‌చెరులో ఉంటున్నాం. ఎప్పుడైనా ఇష్టమైంది తినాలంటే నగరానికి రావాల్సి వచ్చేది. అక్కడున్న చిన్న చిన్న హోటళ్లలో ఏం తినాలన్నా ఆలోచించాల్సిన పరిస్థితి. ఆ సమయంలోనే ఫుడ్ కోర్ట్ పెడితే ఎలా ఉంటుంది? అదికూడా బ్రాండెడ్ అయితే కస్టమర్లు నమ్మకంగా వస్తారు. పైగా పిజ్జా సెంటర్ అయితే ప్రస్తుత ట్రెండ్‌కు సరిగ్గా సరిపోతుందనిపించి, దానికే ఫిక్సయిపోయాను.

రెండేళ్లు బ్రేక్...

ఏ వ్యాపారం అన్నదానిపై స్పష్టత వచ్చేసింది. కానీ పెట్టుబడి! అంత పెట్టే ఆర్థిక పరిస్థితి మాకు లేదు. దీంతో స్నేహితులను ఇందులో భాగం చేయాలనుకున్నా. అయితే ఆ ప్రయత్నాలు ఫలించలేదు. ఈ లోగా పాప పుట్టింది. తన ఆలనా పాలనతో రెండేళ్లు వేరే పని ముట్టుకోలేకపోయాను. ఆ తరువాత తెలిసింది... గిరిజన యువతకు 'సీఎం ఎస్టీ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ ఇన్నోవేషన్ స్కీమ్' (సీఎంఎస్టీఈఐ) కింద ప్రభుత్వం చేయూతనిస్తుందని! సొంతంగా వ్యాపారం ప్రారంభించాలనుకొనే గిరిజన ఔత్సాహికులకు దీని ద్వారా శిక్షణ, ఆర్థిక ప్రోత్సాహం అందిస్తారని. రాత పరీక్ష, ఇంటర్వ్యూల తరువాత దానికి ఎంపికయ్యాను. వ్యాపార మెలకువలు, కమ్యూనికేషన్ స్కిల్స్ తదితర అంశాల్లో 'ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్' (ఐఎస్‌బీ) నిపుణులు శిక్షణనిచ్చారు. మార్కెట్‌ను ఎలా అంచనా వేయాలో అక్కడే నేర్చుకున్నా.



గిరిజన యువతకు 'సీఎం ఎస్టీ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ ఇన్నోవేషన్ స్కీమ్' (సీఎంఎస్టీఈఐ) కింద ప్రభుత్వం శిక్షణ, ఆర్థిక ప్రోత్సాహం అందిస్తుంది. అందులో శిక్షణ పూర్తి చేసుకుని, ఇటీవల హైదరాబాద్‌లో 'ఛీజియానో పిజ్జా' అవుట్‌లెట్ ఏర్పాటు చేశా. శిక్షణ సమయంలో హామీ ఇచ్చినట్టుగానే కేటీఆర్ వచ్చి ఔట్‌లెట్‌ను ప్రారంభించారు. ఐఎస్‌బీ సహాయంతో ఈ ఫ్రాంఛైజీ నాకు దక్కింది.

కేటీఆర్ ఫిదా...


గత నెలలో సీఎంఎస్టీఈఐ శిక్షణ ముగిసింది. ఈ సందర్భంగా ఐఎస్‌బీ క్యాంపస్‌లో నిర్వహించిన సమావేశానికి తెలంగాణ మంత్రి కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మా బ్యాచ్‌లో కొంతమందికి ఆయన ముందు మాట్లాడే అవకాశం ఇచ్చారు. అందులో నేనూ ఒకదాన్ని! నేను పారిశ్రామికవేత్తను ఎందుకు కావాలనుకొంటున్నానో చెప్పే ప్రయత్నం చేశాను. ఎంతో ఆత్మవిశ్వాసంతో నేను వివరించిన పద్ధతి, అనర్గళంగా మాట్లాడే తీరును కేటీఆర్ ప్రశంసించారు. అభినందనలు తెలిపారు. నేను ఏ వ్యాపారం చేయాలనుకొంటున్నానో అడిగి తెలుసుకున్నారు. ప్రారంభోత్సవానికి తప్పకుండా వస్తానన్నారు. నాకు పట్టరాని ఆనందం కలిగింది. నేను చేయగలనన్న ధైర్యమూ వచ్చింది.

అదే పెద్ద సవాలు...

అనుకున్నట్టుగానే అన్నీ సమకూరాయి. శిక్షణ పూర్తయిన వారం రోజుల్లో, అంటే డిసెంబర్ మొదటి వారంలోనే హైదరాబాద్‌లో 'ఛీజియానో పిజ్జా' అవుట్‌లెట్‌ను ఏర్పాటు చేశాను. హామీ ఇచ్చినట్టుగానే కేటీఆర్ వచ్చి ప్రారంభించారు. అయితే అంతర్జాతీయ స్థాయి బ్రాండెడ్ సంస్థల ఫ్రాంఛైజీలు దక్కించుకోవడం నాలాంటి కొత్తవారికి సాధ్యం కాదు. ఐఎస్‌బీ సహాయంతో ఈ ఫ్రాంఛైజీ నాకు దక్కింది. ఇక్కడితో సొంత వ్యాపారం ప్రారంభించాలన్న నా కల నెరవేరింది. కానీ అసలు సవాల్ ఎదురైంది. అదే మార్కెటింగ్! ఇప్పటికే ఉన్న బడా కంపెనీలతో పోటీపడి నిలబడటమంటే పెద్ద సవాలే! లాభాల మాట అటుంచితే, ముందు నష్టాలు రాకుండా చూసుకోవడంపైనే దృష్టి పెట్టాల్సి ఉంటుంది. నిరంతర శ్రమ, ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తేనే ఇక్కడ నిలబడగలం. ఫ్రాంఛైజీ ఒప్పందం మొదలు అవుట్‌లెట్ ఏర్పాటు వరకు అనేక సమస్యలు ఎదురయ్యాయి. కానీ వాటి నుంచి తప్పుకొనే ప్రయత్నం చేయలేదు. ఇంకా చెప్పాలంటే వాటిని ఎదుర్కోవడం వల్లే నాకు మరింత అనుభవం వచ్చింది. ఇకముందు కూడా ఇదే ఉత్సాహంతో అవుట్‌లెట్‌ను నడిపించగలనన్న ఆత్మవిశ్వాసం కలిగింది. విజయవంతమైన పారిశ్రామికవేత్త కావాలన్న నా లక్ష్యాన్ని నిజం చేసుకొనే క్రమంలో ఇవేవీ నాకు అడ్డుకాదు."

● శ్యామసుందర్ ఆకుల

తిరుప్పావై



సౌభాగ్యదాయినీ! తలుపు తెరువమ్మా!

పద్దెనిమిదో పాశురం

ఉన్దు మదకళిత్తన్ ఓడాద తోళ్ వలియన్
నన్ద గోపాలన్ మరుమగళే! నప్పిన్నాయ్!
కన్దమ్ కమళుమ్ కుళలీ! కడై తిరవాయ్;
వన్దెంగుమ్ కోళి అళైత్తనగాణ్; మాదవి
ప్పన్దల్ మేల్ పల్కాల్ కుయిల్ ఇనంగళ్ కూవినగాణ్;
పన్దార్ విరలి! ఉన్ మైత్తునన్ పేర్ పాడ
శెన్దామరైక్కైయాల్ శీరార్ వళై యొళిప్ప
వన్దు తిరవాయ్ మగిళ్న్దు ఏల్ ఓర్ ఎంబావాయ్!

భావం: నీలాదేవి ఇంట శ్రీకృష్ణుడు ఉన్నాడని తెలిసి, గోపికలు అక్కడకు చేరారు. నీలాదేవి శ్రీకృష్ణుడికి అత్యంత ప్రియురాలు. ఆమెను ద్రావిడ భాషలో 'నప్పిన్న' అని పిలుస్తారు. కృష్ణుడికి రుక్మిణి, రాధాదేవి ఎంత ప్రీతిపాత్రులో నపికసన్న అంత ప్రీతిపాత్రురాలు. శ్రీకృష్ణుడి అష్టభార్యలలో ఆమె పేరు 'నాగ్నజితి' అని భాగవతంలో ఉంది. గోపికలు ఆ నప్పిన్నను కీర్తిస్తున్నారు. "మదజలం స్రవించే ఏనుగు వంటి బలం కలిగినవాడు, మహా భుజబలశాలి అయిన నందునికి ప్రియమైన కోడలా! నీలాదేవీ! పరిమళాలు ఎల్లెడలా వ్యాపింపజేసే కేశపాశాలు కలిగినదానా ! తలుపు తీయవమ్మా!" అని ప్రార్థిస్తున్నారు. ఆమె లేపితే కాని కృష్ణుడు కళ్ళు తెరవడు. ఈ సందర్భంలో తెల్లవారిందని తెలిపే గురుతులను గోపికలు ఏకరవు పెడుతున్నారు. ఇంటిలోని కోళ్ళు అన్ని దిక్కుల్లో తిరుగాడుతున్నాయి. కోళ్ళు అరిస్తే తెల్లవారినట్టు! వాటిని ఇక్కడ జ్ఞానులతో పోలిక చేసి చెబుతోంది గోదాదావి. మాధవీ పందిరి రెమ్మల్లో కోకిలలు కూస్తున్నాయి. నప్పిన్న చేతిలో పూల బంతి ఉంది. స్వామితో బంతులాట సలిపి, అలసి, స్వామి పక్కన ఆమె నిదురిస్తున్నది. ఎర్ర తామరల వంటి చేతుల గాజులు ఆ క్రీడలో గలగలలాడుతూండగా, ప్రేమతో, ఉత్సాహంతో వచ్చి తెలుపు తెరవాలని సౌందర్య సౌభాగ్యదాయిని అయిన నీలా దేవిని గోపికలు వేడుకుంటున్నారు.

● ఎ. సీతారామారావు

ముత్యాల ముగ్గు



22 చుక్కలు
5 వరుసలు
2 చుక్కలు వచ్చే వరకు
సరిచుక్క

ఎన్. తిరుమలేశ్వరి
కనిమెట్ట, వనపర్తి



15 చుక్కలు
8 వరకు
సందు చుక్కలు

పి. సాయిదీప్తి
తిరుపతి

మీ ముత్యాల ముగ్గుతో పాటు మీ ఫొటో, పోస్టల్ అడ్రస్, ఫోన్ నంబర్ కూడా వివరంగా రాయండి.

మా చిరునామా... నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం, రోడ్ నెంబర్ 70, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500033. Email: navya@andhrajyothy.com

వినూత్నం



ఫ్యాషన్ ప్రియుల కోసం రకరకాల దుస్తులను డిజైన్ చేసే కంపెనీలు మార్కెట్లో చాలా ఉంటాయి. కానీ చక్రాల కుర్చీకి పరిమితమైన దివ్యాంగుల కోసం దుస్తులు రూపొందించే కంపెనీలు చాలా అరుదు. కొన్ని బొటిక్స్ దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా దుస్తులు తయారుచేస్తూ 'అడాప్టివ్ ఫ్యాషన్' అవసరాన్ని చాటుతున్నాయి. ఆ విశేషాలివి...

ఈ దుస్తులు 'ప్రత్యేకం'!

ఫ్యాషన్ దుస్తుల్లో మెరిసిపోవాలనుకునే దివ్యాంగుల కలను ముంబయ్‌లోని 'ఓరోఫిట్', చెన్నైలోని 'సువస్త్ర డిజైన్స్', కొట్టాయంలోని 'మూవ్ ఎబిలిటీ' బొటిక్స్ నిజం చేస్తున్నాయి. వీల్‌చెయిర్ ఫ్రెండ్లీ శారీస్, జిప్ ఫ్రీ డ్రెస్సెస్, అయస్కాంత శక్తి ఉన్న బటన్స్‌తో చేసే దుస్తులను డిజైన్ చేయడం వీటి ప్రత్యేకత. తమ కుటుంబసభ్యుల కోసం కొందరు డిజైనర్లు రూపొందించిన దుస్తులను చూసి, చాలామంది తమ పిల్లలకు అలాంటివి కావాలని కోరడంతో ఈ బొటిక్స్ పుట్టుకొచ్చాయి.

భర్త కోసం తొలి డిజైన్!

వీల్‌ఛెయిర్‌కు పరిమితమైన తన భర్త సౌకర్యం కోసం చెన్నైకి చెందిన శాలిని విశాఖన్ నడుము దగ్గర ఎలాస్టిక్ బ్యాండ్‌తో ఉండే ప్యాంట్ తయారు చేశారు. అదే ఆమె మొదటి 'అడాప్టివ్ ఫ్యాషన్' డిజైన్. దివ్యాంగురాలైన స్నేహితురాలి తల్లికోసం వన్ పీస్, స్లిప్ ఆన్ సారీ డిజైన్ చేసి ఇచ్చారు. 'వన్ స్లిప్ సారీ డ్రెస్ మాదిరిగా ఉంటుంది. వీల్ ఛెయిర్‌లో సౌకర్యంగా ఉంటుంది" అని చెబుతారు శాలిని. ఇవే కాదు లెహంగాలు, షేర్వానీ కుర్తాలు కూడా డిజైన్ చేస్తారావిడ. "గుండీలు, లేస్‌ల కింద ఆల్టరింగ్ కుట్టు వచ్చేలా చూస్తా. వీల్ ఛెయిర్ ఉపయోగించేవాళ్లు, దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు అడాప్టివ్ ఫ్యాషన్ ద్వారా నావంతు తోడ్పాటు అందిస్తున్నా" అంటుంది ఫ్యాషన్ డిజైనర్.

కొట్టాయంలోని 'మూవ్ ఎబిలిటీ' బొటిక్‌లో కాళ్లు లేదా చేతులు చచ్చుబడిన వాళ్ల కోసం దుస్తులు ఉంటాయి. 'నిఫ్ట్'లో చదివిన జో ఇకరేత్, మూవ్‌మెంట్ థెరపిస్ట్ అయిన తన భార్య మురిఎల్లాతో కలిసి ఈ బొటిక్‌ను ప్రారంభించారు. పక్షవాతంతో చక్రాల కుర్చీలోనే ఉండేవాళ్ల కోసం పూల ప్రింట్లు, ఆర్ట్‌వర్క్‌తో కూడిన దుస్తులు రూపొందిస్తున్నారు ఇకరేత్. "ఈ రకమైన డ్రెస్సుల తయారీకి 15ఏళ్ల నా కూతురు తిలోత్తమ మాకు ఇన్‌స్పిరేషన్. తనకు శారీరకంగా కొన్ని సమస్యలతో పాటు ఒక చేతికి పక్షవాతం వచ్చింది. తనలా



బాధపడుతున్న వారికి డైలీవేర్‌గా, ఫ్యాషనబుల్‌గా ఉండే దుస్తులు అందించాలనే ఆలోచన లోంచి 'మూవ్ ఎబిలిటీ' పుట్టింది" అని చెబుతారు ఇకరేత్.

ముంబయ్‌లో మగవాళ్ల బ్రాండెడ్ దుస్తులకు కేరాఫ్ అడ్రస్ అయిన 'ఓరోఫిట్' తమ డిజైనర్లతో 'అడాప్టివ్ ఫార్మల్‌వేర్‌'ను సిద్ధం చేయిస్తోంది. వన్ హ్యాండ్ జిప్పర్, బటన్స్ భుజాల వద్ద ఉండే షర్ట్స్, జిప్పులు ఉండే చెప్పులు, షూ ఇక్కడ దొరకుతాయి. "నాకు ఒక చేతికి పక్షవాతం సోకింది. దాంతో షర్ట్ వేసుకోవడం కష్టంగా ఉండేది. అయితే డిజైనర్లు నా కోసం అనువైన షర్ట్ తయారుచేశారు. మొదట్లో వాటిని వేసుకునేందుకు గంటపైగా పట్టేది. ఇప్పుడు అరగంటలోనే నేను డ్రెస్సు వేసుకోగలుగుతున్నా" అని చెబుతారు 52 ఏళ్ల రష్మికాంత్ షాహ్. మొత్తానికి వీరు రూపొందిస్తున్న ఈ సౌకర్యవంతమైన దుస్తులు దివ్యాంగులకు ఆత్మస్థయిర్యంతో పాటు ఆనందాన్నిస్తున్నాయి.


మార్గం ఉందా?

మా అమ్మాయికి ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. ఇద్దరూ సమ హోదాలో ఉన్నవారే. చిన్న చిన్న సమస్యలతో రెండేళ్ల క్రితం విడిపోయారు. పిల్లలు లేరు. ఎంత చెప్పినా వినడం లేదు. కౌన్సెలింగ్‌కు వెళ్లమంటే వద్దంటున్నారు. వీళ్లని కలిపే మార్గం ఉందా?

- లక్ష్మి

చదువు మన ఆలోచనా పరిధిని విస్తృతం చేయాలి. ఎదుటివారిని అర్థం చేసుకునే తత్వం పెరగాలి. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనే భావన రావాలి. అప్పుడే ఆ చదువు సార్థకం అయినట్లు. దురదృష్టవశాత్తూ మీ అమ్మాయి, అల్లుడు ఈ విషయం పట్టించుకున్నట్టు లేరు. ఒకరినొకరు మరింతగా అర్థం చేసుకుని సహకరించుకోవాల్సింది పోయి లేని పోని ఇగోలతో చికాకులు కొని తెచ్చుకుంటున్నారు. విడిపోయి రెండేళ్లయ్యిందని అంటున్నారు. కాబట్టి విడాకులకు వెళ్లడమే మేలు. పిల్లలు లేరు కాబట్టి పెద్దగా ఇబ్బంది లేదు. అయినా ఇప్పటికీ మీరు వాళ్లిద్దరూ కలవాలనే కోరుకుంటున్నారు కాబట్టి చివరి ప్రయత్నంగా ఇద్దరితో విడిగా మాట్లాడి అపోహలు తొలగించే ప్రయత్నం

ఫ్యామిలీ కౌన్సెలింగ్




చేయండి. వైవాహిక జీవితంలో సర్దుబాటు అనేది ఎంత ముఖ్యమో వివరించండి. ఇందుకు మీ అల్లుడి తల్లిదండ్రుల సహకారమూ తీసుకోండి. ఇంతమంది పెద్దల ఆకాంక్ష ఆ ఇద్దరినీ కలుపుతుందనే ఆశిద్దాం.

● **కె.శోభ,**
ఫ్యామిలీ కౌన్సిలర్, హార్ట్ టు హార్ట్
shobhas292@gmail.com

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
నిజామాబాద్ • గురువారం 2 జనవరి 2020
6 diksuchi@andhrajyothy.com

భవిష్యత్తులో ఏ కెరీర్ బాగుంటుంది, కచ్చితంగా ఎలాంటి మార్పులు చోటు చేసుకుంటాయో ఎవరూ చెప్పలేరు. అయితే భవిష్యత్తు ఎలా ఉండబోతుంది అని ఓ మేరకు ఊహించడం సాధ్యమే అంటున్నారు ఇండస్ట్రీ నిపుణులు. రాబోయే సంవత్సరాల్లో ఈ రంగాలకు చెందినవారికి అవకాశం ఎక్కువ అంటున్నారు.



ట్వంటీ20 ట్రెండింగ్ కెరీర్స్

సోలార్ అండ్ విండ్ ఎనర్జీ

శిలాజ ఇంధనాలన్నీ ఏదో ఒకరోజుకు ఖాళీ అయ్యేవి. అందుకే ప్రభుత్వాలు పునరుత్పాదక ఇంధనంపై దృష్టిపెడుతున్నాయి. అందులో సోలార్ ఎనర్జీ ఒకటి. సౌరవిద్యుత్ ప్లాంట్ల సంఖ్య పెరుగుతున్న కొద్దీ సోలార్ ఎనర్జీ మరింత చౌకగా లభిస్తోంది. దాంతో ఈ పరిశ్రమ పుంజుకుంటోంది. ప్రపంచవ్యాప్తంగా చాలా పట్టణాల్లో సోలార్ ఎనర్జీ టెక్నీషియన్ జాబ్స్ సుస్థిరంగా ఉంటున్నాయి. 2026లోపు ఒక్క అమెరికాలోనే 30 వేల మందికి అవకాశాలు లభిస్తాయని అంచనా. ఇదే ఒరవడిలో విండ్ ఎనర్జీ టెక్నీషియన్స్‌కు కూడా డిమాండ్ ఊపందుకుంటోంది. కార్బన్, మీథేన్ ఉద్గారాల తగ్గింపుకోసం పెద్ద ఎత్తున కృషి జరుగుతోంది. స్వచ్ఛమైన ఇంధనం అంటే, విండో ఎనర్జీ దిశగా ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. పెద్ద ఎత్తున ఉండే టర్బయిన్ల నిర్వహణ, మరమ్మతుల కోసం విండ్ ఎనర్జీ టెక్నీషియన్లు అవసరమవుతారు.

మెడికల్ ప్రొఫెషనల్స్

వైద్య సదుపాయాలు మెరుగవడంతో మానవ జీవన కాలం పెరుగుతోంది. దీంతో మరోవైపు వృద్ధుల సంఖ్య రాన్రాను పెరుగుతోంది. ఈ కారణంగా డాక్టర్లకు తోడు నాన్ ఫిజిషియన్ హెల్త్ ప్రొఫెషనల్స్‌కు డిమాండ్ పెరుగుతోంది.



- **నర్స్:** ఇందులో మళ్ళీ మేల్ / ఫిమేల్ నర్సు ఉద్యోగాలకు విపరీతమైన డిమాండ్ ఉంటోంది. రాబోయే పదేళ్ళలో వీరు లక్షన్నర మంది అవసరమవుతారని అంచనా. ఇందులో కూడా ట్రెండ్ అంటే నర్సింగ్‌లో గ్రాడ్యుయేషన్ కోర్సు చేసిన వ్యక్తులకు మంచి వేతనంతో జాబ్స్ లభిస్తాయి.
- **ఫిజియోథెరపిస్ట్:** అలాగే ఫిజియోథెరపిస్ట్‌లు 2026 వరకు 1,77,000 మంది అవసరమవుతారు. వీరికి మళ్ళీ సహాయకులుగా మరో లక్షన్నర మంది తగు శిక్షణ పొందిన వ్యక్తులు ఉండాలని అంచనా.
- **హెల్త్ సర్వీస్ మేనేజర్లు:** ఆరోగ్య రంగంలో సేవలను సమన్వయపరిచేందుకు సదరు అంశాల్లో లోతైన పరిజ్ఞానం, అన్వయం తెలిసిన మేనేజర్ల సేవలు బాగా అవసరమవుతున్నాయి. ఆరోగ్య రంగంలో దూసుకు వస్తున్న సరికొత్త సాంకేతికత, చట్టాలపై అవగాహన కలిగి నాయకత్వ స్థానాల్లో పనిచేసే హెల్త్ సర్వీస్ మేనేజర్లకు డిమాండ్ పెరుగుతోంది. రాబోయే కొద్ది సంవత్సరాల్లోనే మూడున్నర లక్షల మందికి పైగా హెల్త్ సర్వీస్ మేనేజర్లు అవసరమవుతారని ఒక అంచనా.



డేటా అనలిస్ట్

సవివరంగా సమాచార సేకరణ ఆధునిక పోకడ. దీంతో పెద్ద ఎత్తున సమాచారం పోగుపడుతోంది. ఆ సమాచారాన్ని అవసరానుగుణంగా విభజించి, విశ్లేషించేందుకు సదరు నైపుణ్యాలకు కలిగిన మానవ వనరులకు డిమాండ్ పెరుగుతోంది. ఐటీ రంగంలో డేటా అనలిస్ట్‌కు ఈ రోజుల్లో ఎంతో డిమాండ్ ఉంది.

ప్రాజెక్ట్ బేస్డ్ హ్యూమన్ రిసోర్స్ డైరెక్టర్

ప్రాజెక్ట్ ఆధారిత ఉద్యోగాల దిశగా వివిధ కంపెనీలు పరుగులు పెడుతున్నాయి. ఆ ప్రాజెక్టులోని ఉద్యోగులు అందర్నీ ఒక తాటిపైకి తెచ్చే పని కోసం ప్రత్యేకించి హ్యూమన్ రిసోర్డ్ డైరెక్టర్లను నియమిస్తున్నారు. ఈ క్రమంలో ముందడుగు, ప్రాజెక్టు నిర్వహణకు అవసరమైన సిబ్బంది ఎంపిక కూడా ఈ డైరెక్టర్లు చేసుకోవాల్సి ఉంటుంది. అందుకు ప్రాజెక్టు మేనేజ్‌మెంట్‌లో లోతైన అవగాహన ఉండాలి.

సాఫ్ట్‌వేర్ డెవలపర్

కంప్యూటర్స్, రోబోట్స్, మొబైల్స్... ఏవైనా సరే సాఫ్ట్‌వేర్ లేకుంటే పనిచేసే ప్రసక్తే ఉండదు. స్మార్ట్ ఫోన్స్ వినియోగంతో మొబైల్ డెవలప్‌మెంట్ యాప్స్, సాఫ్ట్‌వేర్ అవసరం మరింత పెరుగుతోంది. దాంతో సాఫ్ట్‌వేర్ డెవలపర్లకు డిమాండ్ పెరుగుతోంది. రాబోయే పదేళ్ళలో పన్నెండు లక్షల మందికి ఓపెనింగ్స్ ఉంటాయని అంటున్నారు.

బ్లాక్‌చైన్ డెవలపర్

అర్థం చేసుకోవడం కొద్దిగా కష్టమైనప్పటికీ ఇంటర్నెట్ మాదిరిగానే బ్లాక్‌చైన్ అనేది ఛేంజ్‌మేకర్‌గా మారుతోంది. భూముల లావాదేవీల్లో ఈ సాంకేతికత వినియోగానికి కృషి చేస్తున్నారు. రాబోయే రోజుల్లో ఇతోధిక డిమాండ్ ఈ టెక్నాలజీకి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.



ఆగ్‌మెంటెడ్ రియాలిటీ డెవలపర్

రియల్ వరల్డ్ బోర్ కొట్టిస్తోంది. చూపులకు సంబంధించి మరింత ఉన్నతిని జనాలు కోరుకుంటున్నారు. డిజిటల్ ఇమేజస్, స్పెషల్ గ్లాసులు, బయోనిక్ కాంటాక్ట్ లెన్స్‌లను కనుగొనడం ఇందులో భాగమే. దరిమిలా ఈ ఆగ్‌మెంటెడ్ రియాలటీ డెవలపర్లు డిజైనింగ్, సాంకేతికతను ప్రభావపూరితంగా వినియోగంలో సహకరించాల్సి ఉంటుంది. ఒకరకంగా వ్యక్తుల జీవితంపై ప్రభావం చూపే సాంకేతికత అన్నమాట.

పర్సనల్ ప్రైవసీ అడ్వయిజర్

టెక్నాలజీ అనుభవంలోకి రావడంతో పర్సనల్ ప్రైవసీకి ఆటంకం కలుగుతోంది. అలాగే వ్యక్తి తరపున సామాజిక మాధ్యమాలు సహా వివిధ వ్యవహారాలను చక్కబెట్టాల్సి వస్తుంది. ఈ పనులను చూసే పర్సనల్ ప్రైవసీ అడ్వయిజర్ సేవలు అందించే వ్యక్తులు అందునా తగు నైపుణ్యాలు పొంది ఉండాలి. కాంట్రాక్ట్ ప్రాతిపదికన పర్సనల్ బ్రాండ్ అడ్వైజర్ మరో వృత్తి. వ్యక్తి స్థాయి దృష్ట్యా సెల్ఫ్ ప్రమోషన్ లేదంటే బ్రాండ్ ఇమేజ్‌ను పెంచే కృషి ఈ నిపుణులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

డిజిటల్ కంటెంట్ స్పెషలిస్ట్

స్మార్ట్ ఫోన్ తదితర గాడ్జెట్లు నేడు అవసరంగా మారాయి. మార్కెటింగ్ కార్యకలాపాలకు కూడా వాటినే వినియోగిస్తున్నారు. తమ ఉత్పత్తిని కొనుగోలు చేసే వ్యక్తులను పట్టుకోవడం నుంచి వారికి సమాచారాన్ని అందించడం వరకు వివిధ పనులకు సదరు నైపుణ్యం అంటే డిజిటల్ కంటెంట్ స్పెషలిస్టుల సేవలు అవసరమవుతున్నాయి. ఇంటర్నెట్ మార్కెటింగ్, రైటింగ్, మల్టీమీడియా, డిజిటల్ ఆర్ట్స్ వంటివన్నీ ఈ పరిధిలోకే వస్తాయి. జాబ్ టైటిల్, సామర్థ్యాలకు సంబంధించి తేడాలు ఉన్నప్పటికీ అవన్నీ ఈ గొడుగు కిందకే వస్తాయి.

మెకానికల్/ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ స్పెషలిస్ట్



సాంకేతిక విస్తృతి మెకానికల్ ఇంజనీరింగ్ స్పెషలిస్టులకు డిమాండ్ పెంచుతోంది. అడ్వాన్స్‌డ్ రోబోట్స్, ఆటోమేషన్ ఎక్విప్‌మెంట్, 3డి-ప్రింటింగ్ మెషీన్స్, క్లీన్ ఎనర్జీ పరికరాల డిజైన్, టెస్టింగ్ కోసం మెకానికల్ ఇంజనీరింగ్ స్పెషలిస్టుల సేవల అవసరవుతాయి. రెండు లక్షలకు మించి ఈ రంగంలో నిపుణులు కావాల్సి వస్తారని అంచనా. అలాగే ఎలక్ట్రానిక్స్ సంబంధ సర్క్యూటరీ, ఇతర పరికరాలు మరింత చిన్నవిగా మారి సంక్లిష్టత పెరుగుతోంది. ఈ సాంకేతిక పురోగతిలో ప్రయోజనాలు పొందేందుకు సంబంధిత నిపుణులు అవసరమవుతారు. అలా అరలక్షకు మించి కంప్యూటర్ హార్డ్‌వేర్ ఇంజనీర్లు, మరో లక్ష మంది ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్లు, ఇంకో లక్షకు మించి టెక్నీషియన్లు అవసరమవుతారని సమాచారం.

సివిల్ / కమర్షియల్ డ్రోన్ పైలెట్ / డిస్పాచర్

వివిధ పనులను చక్కబెట్టే మానవ రహిత విహంగాలు ఇవి. వ్యక్తులకు సాధ్యం కాని ప్రదేశాలకు వీటిని పంపవచ్చు. తమ ప్యాకేజీలను నిర్దేశిత ప్రాంతాలకు పంపేందుకు ఆమెజాన్ కంపెనీ తాజాగా సన్నాహాలు చేస్తోంది. మిలటరీ, రిక్రియేషన్ వ్యవహారాల నుంచి, పట్టణాల్లోని వీధుల నుంచి వ్యర్థ పదార్థాల తొలగింపు, వాయు కాలుష్య నియంత్రణ తదితరాల కోసం డ్రోన్ ఉపయోగపడుతుంది. వీటి వినియోగం పెరుగుతున్న కొద్దీ పైలెట్/డిస్పాచర్‌కు డిమాండ్ అధికమవుతూ ఉంటుంది.

టెక్ ఎథిస్ట్

సరికొత్త సాంకేతికత పర్యవసానాలను వివరించే వ్యక్తి టెక్ ఎథిస్ట్. ఉదాహరణకు డిజైనర్ బేబీలు. ఇక్కడ తల్లిదండ్రులు ఎవరు అన్న సమస్య ఉత్పన్నమవుతుంది. రోబోట్స్ విషయంలోనూ ఇదే సమస్య ఎదురవుతుంది. మారుతున్న ప్రపంచంలో వీటి విషయంలో వచ్చే నైతిక అంశాలను టెక్ ఎథిస్ట్ వివరిస్తాడు.

రిమోట్ హెల్త్‌కేర్ ఇంజనీర్

ఆరోగ్యరంగంలో వస్తున్న మార్పులు సరికొత్త ఉద్యోగాలకు అవకాశం కల్పిస్తోంది. రోగి సుదూరంలో ఉన్నప్పటికీ రోబోట్ సహాయంతో చికిత్స చేసే సదుపాయం కలుగుతోంది. దాంతో వాటి సక్రమ నిర్వహణ, మరమ్మతుల కోసం ఈ ఇంజనీర్ల సేవలు కావాల్సి వస్తున్నాయి.

వర్చువల్ రియాలిటీ ఇంజనీర్




మనం చాలా ప్రాంతాలు సందర్శించాలని అనుకుంటాం. అయితే వీలుకాదు. టెక్నాలజీ సహకారంతో ఆ ప్రాంతాలనే మన ముందుంచితే ఇంకేముంది. టాలెంటెడ్ విఆర్ డిజైనర్లకు ఈ రంగంలో అవకాశాలు పెరుగుతున్నాయి. మనకు దూరంగా ఉన్న దాన్ని అందుబాటులోకి తెచ్చే ఈ ప్రక్రియలో విఆర్ డిజైనర్లు, డెవలపర్లకు అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయి.

నానోటెక్ ఇంజనీర్

ఆటమ్స్, మాలిక్యూల్స్ స్థాయికి మెటీరియల్‌ను తీసుకువచ్చి వివిధ రోగాలకు సంబంధించిన చికిత్స చేయడం ఇప్పటికే ఆరంభ దశలో ఉంది. అడ్వాన్స్‌డ్ మెటీరియల్‌లో నానోస్కేల్ టెక్నాలజీ ప్రారంభమైంది. ఇది మరికొన్ని ఉత్పత్తులకు విస్తరిస్తున్న నేపథ్యంలో నానోటెక్ ఇంజనీర్లకు ప్రాధాన్యం ఏర్పడనుంది.

సింథటిక్ బయాలజీ ఇంజనీర్



ఈ రంగంలోని ఇంజనీర్లు ఇప్పటికే ల్యాబ్‌లో మాంసాన్ని సృష్టించారు. మాలిక్యులర్ బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంజనీరింగ్ పరిజ్ఞానంతో వీటిని సృష్టిస్తారు. ఇప్పటికే ఉన్న వాటిని రీ డిజైన్ చేయడం ఇందులోని ప్రక్రియ. తాజాగా ఉనికిలోకి వచ్చిన రంగమిది.

వెదర్ కంట్రోల్ ఇంజనీర్

వాతావరణ మార్పులతో కరవు, వరదలు సంభవిస్తూ ఉంటాయి. సైన్స్ అడ్వాన్స్‌మెంట్‌తో ముందుగా తెలుసుకుని తగు చర్యలు తీసుకుంటున్నారు. జియో ఇంజనీరింగ్ ఇప్పటికే చిన్న స్థాయిలో జరుగుతోంది. ఇకపై ఆ ఉపద్రవాలను ఎదుర్కొనేందుకు ప్రత్యేకించి వెదర్ కంట్రోల్ ఇంజనీర్లు ఉనికిలోకి వస్తారు.

బయో మెడికల్ ఇంజనీర్



ఆరోగ్యరంగంలో విప్లవానికి బయో మెడికల్ ఇంజనీరింగ్ ఫీల్డ్‌కు చెందిన ప్రొఫెషనల్స్ నాంది పలికారు. హృదయస్పందన లెక్కింపు మొదలుకుని చికిత్స, వైద్యానికి సంబంధించిన పనులు యాంత్రీకరణకు లోనవుతున్న నేపథ్యంలో బయోమెడికల్ ఇంజనీర్ పాత్ర కూడా పెరుగుతోంది. రాబోయే రోజుల్లో ఈ రంగంలో కెరీర్‌కు ఎదురు లేదన్నది నిపుణుల వాదన. 2026లోపు పదహారు వేల ఖాళీలు భర్తీ అవుతాయని కూడా చెబుతున్నారు.

స్మార్ట్ బిల్డింగ్ టెక్నీషియన్

రోజులు గడుస్తున్న కొద్దీ ఇళ్లు, కార్యాలయాలు, ఫ్యాక్టరీలు ఆటోమేషన్ ప్రయోజనాలు పొందనున్నాయి. కరెంటు, హీట్, ఎయిర్ కండిషనింగ్, సెక్యూరిటీ వంటివన్నీ ఆటోమేషన్ కానున్నాయి. రిఫ్రిజిరేటర్ వంటి వస్తువులు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌లో భాగం కానున్నాయి. దీంతో హెచ్‌విఎసి టెక్నీషియన్స్ కాస్తా స్మార్ట్-బిల్డింగ్ టెక్నీషియన్స్‌గా మారనున్నారు.

3డి-ప్రింటింగ్ టెక్నీషియన్

సాంకేతికత పురోగతితో రిఫ్రిజిరేటర్లు, మైక్రోవేవ్స్ మాదిరిగానే 3డి ప్రింటింగ్ మెషీన్లు అవసరమవుతాయన్నది ఫ్యూచరిస్టుల నమ్మకం. గృహస్తులు సైతం తమకు అవసరమైన సైజులో తీసుకుంటారు. దాంతో సదరు టెక్నీషియన్ల సేవలు అవసరమవుతాయి.

బయోమెక్ టెక్నీషియన్

బయానిక్ అవయవాలు మరింతగా తప్పుదారి పట్టించేలా రూపొందుతున్నాయి. వైకల్యంలేని వ్యక్తులు వీటి సహాయంతో సూపర్ హ్యూమన్ సామర్థ్యాలను సంతరించుకోవచ్చు. వీటికి మరమ్మతులు చేపట్టే వ్యక్తులు కూడా అవసరమవుతారు. ఇదే కోవలో కస్టమర్ డిజైన్డ్ బేబీ రూపకల్పన జరగనుంది. వయసు మీదపడకుండా చూసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ పరిశోధనలు, అభివృద్ధిపై ప్రభుత్వ నియంత్రణ ఏవిధంగా ఉంటుందన్న విషయాన్ని పక్కనబెడితే జెనెటిక్ ఇంజనీర్లకూ డిమాండ్ ఏర్పడే అవకాశం ఉంది.

రోబోటిక్ సర్వీస్ టెక్నీషియన్



వంటపని, లాండ్రీ, క్లీనింగ్ వంటి కార్యకలాపాల నిర్వహణ కోసం రాబోయే రోజుల్లో వ్యక్తుల స్థానంలో రోబోట్లు వస్తాయన్నది అంచనా. సదరు పనులను సులువుగా చేసేందుకు వివిధ ఆధునిక పరికరాల స్థానంలో రోబోట్స్ ఆ పని చేస్తాయి. వీటి నిర్వహణ, మరమ్మతులకు సదరు మెకానిక్‌లకు డిమాండ్ ఉంటుంది.


ప్రతిభ



కళ్లజోడుతో వెలుగులోకి...

పిల్లల ఆసక్తిని గమనించి ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారు. ఇందుకు పదమూడేళ్ల ప్రియభారత సాహూ మంచి ఉదాహరణ. ఎనిమిదో తరగతి చదువుతున్న ఈ కుర్రాడు దృష్టి, వినికిడి లోపం ఉన్న పిల్లల కోసం కళ్లద్దాలు రూపొందించి అందరి దృష్టిని ఆకర్షించాడు. అంధులు, కంటి చూపు సరిగాలేని వారు సింపుల్ స్టిక్ సహాయంతో నడవడం చూస్తూనే ఉంటాం. టెక్నాలజీలో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నా దృష్టిలోపంతో బాధపడే వారికి సరైన పరికరాలు అందుబాటులోకి రాలేదు. అయితే ఇప్పుడు ఈ కుర్రాడు రూపొందించిన కళ్లజోడు వీరికి అద్భుతంగా ఉపయోగపడనుంది. "మా ఊళ్లో దృష్టిలోపంతో బాధపడుతున్న ముసలివాళ్లను చూశాను. మరొకరి ఆసరా లేకుండా వాళ్లు నడవలేకపోవడం చూసి వాళ్లకు పనికొచ్చే పరికరం తయారుచేయాలని అనిపించింది. నా ఆలోచనను మా సైన్స్ టీచర్‌తో పంచుకున్నాను. ఆ టీచర్ సహకారంతో మా స్కూల్ ప్రయోగశాలలోనే కళ్లద్దాలు రూపొందించాను" అని చెబుతున్నాడు ప్రియభారత్. ప్రస్తుతం అతడు ఒడిస్సాలో జజ్‌పూర్ జిల్లా అడంగలోని ప్రహ్లాద్ చంద్ర బ్రహ్మచారి హైస్కూల్లో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. ప్రియభారత్ రూపొందించిన కళ్లద్దాలలో రెండు మోడల్స్ ఉన్నాయి. దృష్టిలోపం ఉన్న వారికి అల్ట్రాసోనిక్ సెన్సర్, బజర్ ఉన్న అద్దాలు ఒకరకమైతే, దృష్టిలోపంతో పాటు వినికిడి లోపం ఉన్న వారికి వైబ్రేటర్ మోటర్ ఉన్న మోడల్‌ను రూపొందించాడు. త్వరలోనే ఈ అద్దాలకు జీపీఎస్ మోటర్, స్పీకర్ అమర్చనున్నాడు. జీపీఎస్ అమర్చితే గూగుల్‌మ్యాప్స్‌తో సింక్రనైజ్ అయితే ఆటోమెటిక్‌గా గైడ్ చేస్తుంటాయి. తాను రూపొందించిన కళ్లద్దాలకు పేటెంట్ కోసం దరఖాస్తు చేసే ప్రయత్నాల్లో ఉన్నాడు ప్రియభారత్.

దారి కనుక్కోండి?



పదాలను పట్టికలో కనిపెట్టండి?

letter Q

Q	I	A	S	L	E	N	E	O	D	P
U	P	Q	U	I	N	C	E	V	E	E
E	I	U	P	O	T	A	T	O	Q	A
S	N	C	N	Q	C	L	L	Y	U	C
T	E	S	U	U	L	A	Q	N	A	H
I	A	E	R	I	K	T	U	E	R	S
O	P	B	W	V	C	E	E	E	T	N
N	P	M	H	E	K	R	E	D	Z	O
G	L	P	U	R	P	P	N	Z	K	A
Q	U	I	L	L	N	G	I	E	H	E
N	P	U	E	T	Z	Q	U	I	L	T



6 తేడాలు గుర్తించండి?



సరైన నీడ ఏది?




డైలీ సుడోకు -240

7			4		6		5	
	5	4						
	2	9			5			8
		8				1	9	2
9	1	2				5		
1			7			8	6	
						4	3	
	7		5		4			1

సుడోకు - 239 సమాధానం

4	5	8	9	2	3	6	1	7
7	3	2	4	6	1	5	9	8
9	6	1	5	7	8	3	4	2
8	4	3	1	9	2	7	5	6
2	7	5	3	4	6	1	8	9
6	1	9	7	8	5	2	3	4
5	9	4	6	1	7	8	2	3
1	8	6	2	3	4	9	7	5
3	2	7	8	5	9	4	6	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.



మాస్ లుక్

సిగిరెట్ కాల్చుతూ మాస్ అవతారంలో సందడి చేస్తున్నారు రవితేజ. తాజాగా ఆయన నటిస్తున్న 'డిస్కోరాజా' చిత్రంలోని స్టిల్ ఇది. రవితేజ బాడీ లాంగ్వేజ్‌కి తగ్గట్టు పక్కా మాస్ లుక్‌లో ఉన్న ఈ పోస్టర్‌ను నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతూ విడుదల చేసింది చిత్ర బృందం. వి.ఐ ఆనంద్ దర్శకత్వంలో రామ్ తాళ్లూరి నిర్మిస్తున్నారు. నభా నటేశ్, పాయల్ రాజ్‌పుత్ నాయికలు. ఇటీవల విడుదలైన టీజర్‌కు, రెండు పాటలకు చక్కని స్పందన లభించింది. ఈ నెల 24న ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

ఇంతకుముందు ఇలా జరగలేదు

- అనిల్ సుంకర



“సరిలేరు నీకెవ్వరు' టైటిల్ ఓ వ్యక్తిని ఉద్దేశించి పెట్టింది కాదు. ఇండియన్ ఆర్మీ నేపథ్యంలో సాగే చిత్రం కావడంతో అలా పెట్టాం. ఇంట్లో ఒక వ్యక్తిని దేశానికి కాపలా పెట్టే వారి పేరెంట్స్‌కి 'సరిలేరు మీకెవ్వరు' అని చెప్పే సినిమా ఇది. సైనికుల గౌరవం మరింత పెంచుతుంది. ఇండియన్ ఆర్మీకి సరైన నివాళి అవుతుంది” అని నిర్మాతల్లో ఒకరైన అనిల్ సుంకర అన్నారు. మహేశ్‌బాబు హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన 'సరిలేరు నీకెవ్వరు' చిత్రం ఈ నెల 11న ప్రేక్షకుల ముందుకొస్తుంది. ఈ సందర్భంగా అనిల్ సుంకర మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. “ఇండియన్ ఫిల్మ్ హిస్టరీలో ఇంతవరకూ రాని యూనిక్ పాయింట్‌తో తెరకెక్కిన చిత్రమిది. 140 రోజులు ఎలాంటి అవాంతరాలు లేకుండా సినిమా పూర్తి చేశాం. మహేశ్‌ని ఫ్యాన్స్ ఎలా చూద్దాం అనుకుంటున్నారో అలా ఈ చిత్రంలో చూస్తారు. 13 సంవత్సరాల తర్వాత మళ్లీ తెరపై కనిపించబోతున్న విజయశాంతి అవార్డు విన్నింగ్ పెర్ఫార్మెన్స్ ఇచ్చారు. మహేశ్, విజయశాంతి మధ్య వచ్చే సన్నివేశాలు ఎవరూ ఊహించని విధంగా ఉంటాయి. వాళ్ళిద్దరి మధ్య వచ్చే ప్రతి సీన్‌కి ప్రేక్షకుల నుండి ఈలలు, చప్పట్లు కొడతారు. అవి లేనిచోట కన్నీళ్ళు పెడతారు. ఫస్టాఫ్‌లో 30 నిమిషాలు సాగే ట్రైన్ ఎపిసోడ్ ఆద్యంతం అలరిస్తుంది. ఫస్ట్ కాపీ చూశాక గర్వంగా అనిపించింది. ఇప్పటి వరకూ అనిల్ రావిపూడిలో ఒక యాంగిల్ మాత్రమే చూశారు. ఈ సినిమా తర్వాత ఆయన వేరే లీగ్‌లో ఉంటారు. ఎంటర్‌టైన్‌మెంట్ వదలకుండా మహేశ్‌లాంటి హీరోతో ఏమేం చేయగలడో అన్నీ చేశారు. ఈ నెల 5న జరగబోయే ప్రీ రిలీజ్ వేడుకకి చిరంజీవి అతిథిగా హాజరుకానున్నారు. ఈ కార్యక్రమానికి మహేశ్ హోస్ట్‌గా వ్యవహరించనున్నారు. ఇంతకు ముందెప్పుడూ ఇలా జరగలేదు. అందుకే దీనికి మెగా సూపర్ ఈవెంట్ అని పేరు పెట్టాం” అని అన్నారు.

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం	వెండి (కిలో)	రూపాయి (ఒక డాలర్‌కు)	ముడి చమురు
52.28	14.05	121	520	14 పైసలు	
41,306.02	12,182.50	39,119	46,145	71.22	66.00
		ముంబై 10 గ్రాములు (99.9 స్వచ్ఛత)			

కొత్త ఏడాది శుభారంభం

» 52 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ కొత్త సంవత్సరం తొలి రోజే లాభాలు నమోదు చేసింది. సెన్సెక్స్ 52.28 పాయింట్ల లాభంతో 41,306.02 వద్ద, నిఫ్టీ 14.05 పాయింట్ల లాభంతో 12,182.50 వద్ద ముగిశాయి. ఐటీ, ఫార్మా, ఎఫ్ఎంసీజీ కంపెనీల షేర్లలో కొనుగోళ్లు, ఇందుకు దోహదం చేశాయి. 2019 సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికంలో కరెంట్ ఖాతా లోటు (సీఏడీ) జీడీపీలో 0.9 శాతానికి తగ్గడం, వృద్ధి రేటును పట్టాలు ఎక్కించేందుకు మౌలిక రంగంపై వచ్చే ఐదేళ్లలో రూ..102 లక్షల కోట్లు ఖర్చు చేయనున్నట్టు ఆర్థిక మంత్రి చేసిన ప్రకటనా, మార్కెట్ సెంటిమెంట్‌ను పెంచాయి.

కొత్త ఏడాది తొలి రోజు ప్రధాన అంతర్జాతీయ మార్కెట్లన్నీ సెలవు పాటించాయి. దీంతో దేశీయ అంశాలే మార్కెట్‌ను ముందుకు నడిపించాయి. ఈ ఏడాది లార్జ్ క్యాప్ కంపెనీల షేర్లతో పోలిస్తే స్మాల్ అండ్ మిడ్ క్యాప్ కంపెనీల షేర్లు మంచి లాభాలు ఇచ్చే అవకాశం ఉందనే వార్తలు ఊపందుకున్నాయి. దీంతో ట్రేడర్లు, మదుపరులు మంచి ఫండమెంటల్స్ ఉన్న స్మాల్ అండ్ మిడ్ క్యాప్ కంపెనీల షేర్ల కొనుగోళ్లకు దిగారు.

రూపాయి అప్

డాలర్ మారకంలో రూపాయి బుధవారం 14 పైసల లాభంతో 71.22 వద్ద ముగిసింది. కరెంట్ ఖాతా లోటు తగ్గడం, అమెరికా-చైనా వాణిజ్య యుద్ధానికి త్వరలో తెరపడబోతోందన్న వార్తలు ఇందుకు దోహదం చేశాయి. కొనసాగుతున్న ఎఫ్‌పీఐల పెట్టుబడులతో సెంటిమెంట్ మరింత బలపడింది.

పార్క్ హోటల్స్ పబ్లిక్ ఇష్యూ

క్యాపిటల్ మార్కెట్ నుంచి రూ.1,000 కోట్లు సమీకరించేందుకు అపీజే సురేంద్ర పార్క్ హోటల్స్ ఐపీఓ కోసం సెబీకి ముసాయిదా పత్రాలు సమర్పించింది. ప్రస్తుతం ఉన్న కొన్ని అప్పుల చెల్లింపుతోపాటు ఇతర వ్యాపార అవసరాల కోసం ఈ ఐపీఓ తలపెట్టినట్టు కంపెనీ పేర్కొంది.

ప్రైవేట్ రంగంలో 7లక్షల కొలువులు

» దక్షిణాది రాష్ట్రాల్లోనే అధిక ఉద్యోగాలు

» స్టార్టప్స్‌లో ఎక్కువ కొలువులు

ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగా ఉన్నాయి. అయినా ఈ ఏడాది ప్రైవేట్ రంగంలో సుమారు 7 లక్షల కొత్త ఉద్యోగ నియామకాలు ఉంటాయని అంచనా. వీటితో పాటు ఉన్న ఉద్యోగుల జీతాలూ ఈ ఏడాది దాదాపు 8 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. మైహైరింగ్‌క్లబ్.కామ్, సర్కారి నౌకరి.ఇన్ఫో అనే వెబ్‌సైట్లు జరిపిన 'ఎంప్లాయ్‌మెంట్ ట్రెండ్స్ సర్వే'లో ఈ విషయం వెల్లడైంది.

హైదరాబాద్, ముంబై, బెంగుళూరుతో సహా దేశంలోని 42 ప్రధాన నగరాల్లో 12 రంగాలకు చెందిన 4,278 కంపెనీలను సర్వే చేసిన నివేదిక రూపొందించారు. ఈ ఏడాది కొత్తగా ఏర్పడే ఉద్యోగాల్లో ఎక్కువ (2,15,400) దక్షిణాది రాష్ట్రాల్లో ఏర్పడతాయని అంచనా. కొత్త ఉద్యోగాల్లో అధికంగా స్టార్టప్స్‌లోనే ఉండనున్నాయి.



ఈ రంగాల్లోనే ఎక్కువ కొలువులు

కొత్త కొలువుల్లో ఎక్కువ (1.12 లక్షలు) రిటైల్, ఈ-కామర్స్ రంగాల్లో ఏర్పడనున్నాయి. 1,05,500 ఉద్యోగాలతో ఐటీ, ఐటీ సేవల రంగాలు ద్వితీయ స్థానంలో ఉంటాయి. హెల్త్‌కేర్ (98,300) ఎఫ్ఎంసీజీ (87,500), తయారీ (68,900), బీఎఫ్ఎస్ఐ (59,700) తర్వాతి స్థానాల్లో ఉండనున్నాయి.

సర్వేలోని మరిన్ని అంశాలు..

- మెట్రో నగరాల్లోనే 5,14,900 కొత్త ఉద్యోగాలు లభిస్తాయి.
- ఖర్చులు తగ్గించుకునేందుకు చిన్న నగరాలకు కంపెనీలు మారుతున్నాయి.
- 10 శాతం వరకు బోనస్‌కు అవకాశం ఉంది.



5% వృద్ధీ కష్టమే!

» అమెరికన్ ఆర్థికవేత్త స్టీవ్ హాంకే

న్యూఢిల్లీ: ఈ ఏడాది భారత జీడీపీ 5 శాతం మేర వృద్ధి చెందడమూ కష్టమేనని అమెరికాకు చెందిన ప్రముఖ ఆర్థికవేత్త స్టీవ్ హాంకే అన్నారు. ప్రస్తుతం ఆయన జాన్స్ హాప్కిన్స్ విశ్వవిద్యాలయంలో అప్లైడ్ ఎకనామిక్స్ బోధిస్తున్నారు. రుణ మార్కెట్ కుంచించుకుపోవడంతోనే గడిచిన కొన్ని త్రైమాసికాల్లో భారత వృద్ధి భారీగా క్షీణించిందన్న హాంకే.. ఇది చక్రీయ స్వభావ స్వల్పకాలిక సమస్యే తప్ప వ్యవస్థాగత సమస్య కాదన్నారు. 2019 సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో వృద్ధి రేటు ఆరేళ్ల కనిష్ఠ స్థాయి 4.5 శాతానికి పడిపోయింది. అమెరికా మాజీ అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్ ఆర్థిక సలహాదారుల కమిటీలో హాంకే ఒకరు. బడా ఆర్థిక సంస్కరణలు చేపట్టడంలో మోదీ ప్రభుత్వం విఫలమైందని తాజా ఇంటర్వ్యూలో ఆయన అభిప్రాయపడ్డారు. కఠినమైన, అవసరమైన ఆర్థిక సంస్కరణలు చేపట్టేందుకు మోదీ సర్కారు ఆసక్తిగా ఉన్నట్లు అన్పించడం లేదన్నారు.

బ్యాంకు మోసం కేసులో
రూ.51 కోట్ల ఆస్తుల జప్తు

» చేపల చెరువుల పేరుతో ఐడీబీఐ బ్యాంకుకు టోపీ

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): తప్పుడు పత్రాలతో రుణం తీసుకుని బ్యాంకును మోసం చేసిన కేసులో నిందితుడితోపాటు అతడి బంధువులకు చెందిన రూ.51.43 కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జప్తు చేసింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. విశాఖ నగరానికి చెందిన కుమార్ పప్పూసింగ్ చేపల చెరువులు, కోళ్ల ఫారాల కోసమని తనతోపాటు తన కుటుంబసభ్యులు, తెలిసిన వ్యక్తులు 87 మంది పేరు మీద ఐడీబీఐ బ్యాంకు నుంచి రూ.51 కోట్లు రుణం తీసుకున్నాడు. రుణం సకాలంలో తీర్చకపోవడంతో బ్యాంకు అధికారులు షూరిటీ పెట్టిన ఆస్తులను జప్తు చేసేందుకు యత్నించగా తప్పుడు పత్రాలని తేలింది. బ్యాంకు నుంచి రుణంగా తీసుకున్న వారి ఖాతాలను పరిశీలించగా...పప్పూసింగ్ ఆ మొత్తాలను తన వ్యక్తిగత ఖాతాలు, కంపెనీకి చెందిన ఖాతాల్లోకి మళ్లించినట్టు తేలింది. దీనిపై బ్యాంకు అధికారులు సీబీఐ అధికారులకు ఫిర్యాదు చేయగా రుణం మంజూరుచేసిన బ్యాంకు అధికారులతోపాటు రుణగ్రహీతలపై కేసు నమోదుచేశారు. దీనిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తు చేసి కుమార్ పప్పూసింగ్‌తోపాటు రుణగ్రహీతలకు చెందిన రూ.37.7 కోట్ల విలువైన ఆస్తులను, వారి ఖాతాల్లోని రూ.13 కోట్లను అటాచ్‌మెంట్ చేసింది.

మాల్యా చరాస్తులు వాడుకోవచ్చు

» బ్యాంకులకు అనుమతిచ్చిన ప్రత్యేక కోర్టు

ముంబై: లిక్కర్ కింగ్ విజయ్ మాల్యా కేసులో బ్యాంకులకు కాస్త ఊరట లభించింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) సారథ్యంలోని 15 బ్యాంకుల కన్సార్షియం మాల్యా రుణ తిరిగి చెల్లింపుల కోసం ఆయన చరాస్తులను వాడుకునేందుకు ప్రత్యేక కోర్టు అనుమతిచ్చింది. ఈ ఆస్తుల్లో ఫైనాన్షియల్ సెక్యూరిటీలైన యునైటెడ్ బ్రూవరీస్ హోల్డింగ్స్ లిమిటెడ్ (యూబీహెచ్ఎల్) షేర్లు వంటివి ఉన్నాయి.

జీఎస్‌టీ వసూళ్లు
రూ.లక్ష కోట్లు



» డిసెంబరులో 16 శాతం వృద్ధి

» పుంజుకుంటున్న 'వినియోగ' డిమాండ్

న్యూఢిల్లీ: జీఎస్‌టీ వసూళ్లు మళ్లీ రూ.లక్ష కోట్లు దాటాయి. గత ఏడాది డిసెంబరు నెల్లో, జీఎస్‌టీ కింద రూ.1,03,184 కోట్ల వసూలయ్యాయి. 2018 డిసెంబరులో వసూలైన రూ.94,726 కోట్లతో పోలిస్తే ఇది 16 శాతం (రూ.8,274 కోట్లు) ఎక్కువ. 2019లో జీఎస్‌టీ వసూళ్లు రూ.లక్ష కోట్లు దాటడం వరుసగా ఇది రెండో నెల. గత ఏడాది నవంబరు నెల్లోనూ జీఎస్‌టీ వసూళ్లు రూ.1,03,492 కోట్లకు చేరాయి. గత ఏడాది డిసెంబరు నెల్లో వసూలైన రూ.1,03,184 కోట్ల జీఎస్‌టీలో రూ.19,962 కోట్లు సీజీఎస్‌టీ, రూ.26,792 కోట్లు ఎస్‌జీఎస్‌టీ, రూ.48,099 కోట్లు ఐజీఎస్‌టీ, రూ.8,331 కోట్లు సెస్సు ద్వారా వసూలయ్యాయి.

గాడిన పడుతున్న 'వినియోగం'

జీఎస్‌టీ వసూళ్లు వరుసగా రెండు నెలలపాటు రూ.లక్ష కోట్లు దాటడంతో 'వినియోగ డిమాండ్ క్రమంగా గాడిన పడుతోందనే అంచనాలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం జీడీపీ వృద్ధి రేటు పడకేయడానికి పెట్టుబడులతోపాటు వినియోగ డిమాండ్ పడకేయడం ప్రధాన కారణం. ఈ నేపథ్యంలో జీఎస్‌టీ వసూళ్లు వరుసగా రెండు నెలలు రూ.లక్ష కోట్లు దాటడం, ప్రభుత్వానికి కొంత ఊరట ఇస్తోంది.

కొనసాగనున్న జోరు

ఈ ఆర్థిక సంవత్సరం మిగిలిన మూడు నెలల్లో ప్రతి నెలా రూ.1.1 లక్షల కోట్లకు తగ్గకుండా జీఎస్‌టీ వసూళ్లు ఉండాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. వినియోగ డిమాండ్ గాడిన పడడం నిజమైతే, ముందు ముందూ నెలవారీ జీఎస్‌టీ వసూళ్లు రూ.లక్ష కోట్లు దాటడం పెద్ద కష్టం కాదని భావిస్తున్నారు.

తెలుగు రాష్ట్రాల్లోనూ జోరు

తెలుగు రాష్ట్రాల్లో కూడా జీఎస్‌టీ వసూళ్లలో వృద్ధి నమోదయింది. గత ఏడాదితో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో 11 శాతం పెరిగి రూ.2,265 కోట్లకు చేరగా తెలంగాణలో 13 శాతం వృద్ధితో రూ.3,420 కోట్లు వసూలయింది. గత ఏడాది డిసెంబరు నెల వసూళ్లు ఏపీలో రూ.2,049 కోట్లు.

మార్కెట్‌లో అప్రమత్తత

టెక్ వ్యూ

నిఫ్టీ మైనర్ రికవరీలో ప్రారంభమై రోజంతా కన్సాలిడేషన్ ధోరణిలోనే ట్రేడయింది. ఆ క్రమంలో మద్దతు స్థాయి 12150 వరకు దిగజారి మళ్లీ మైనర్ రికవరీ సాధించింది. చివరికి 21 పాయింట్ల లాభంతో డే గరిష్ఠ, కనిష్ఠ స్థాయిల మధ్యన ముగియడం అనిశ్చితిని సూచిస్తోంది. ప్రధాన ట్రెండ్ మైనర్ కరెక్షన్ ధోరణిలో ఉంది. ఇప్పటికీ 20 డిఎంఎ, స్వల్పకాలిక మద్దతు స్థాయి 12150కన్నా స్వల్పంగా పైనే ఉంది. ప్రస్తుత అప్‌ట్రెండ్ నిలబెట్టుకోవాలంటే ఇక్కడ రికవరీ తప్పనిసరి.

గురువారం స్థాయిలివే...

నిరోధం : 12230 మద్దతు : 12150

- మరింత రికవరీలో పడితే ఇంట్రాడే నిరోధం 12230 కన్నాపైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 12300. ఆ పైన పటిష్ఠంగా క్లోజయినప్పుడే సానుకూల సంకేతం ఇస్తుంది.
- మద్దతు స్థాయి 12150కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనతలో పడుతుంది. ప్రధాన స్వల్పకాలిక మద్దతు స్థాయి 12000..

■ వి.సుందర్ రాజా

ఏపీలో 525 కంపెనీలు మూత

» గత ఏడాదిలో నమోదైనవి 3,000

» విజయవాడలో ఆర్‌ఓసీ కార్యాలయం ప్రారంభించి ఏడాది

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): గత ఏడాది (2019) ఆంధ్రప్రదేశ్‌లో 525 కంపెనీల మూసివేతకు రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్‌ఓసీ)కి దరఖాస్తు చేసుకున్నాయి. అనుకున్న విధంగా నిధుల సమీకరణ చేయలేకపోవడం, ఉత్పత్తులకు గిరాకీ లేకపోవడం, ఊహించిన విధంగా ప్రభుత్వ ప్రాజెక్టులు చేతికి రాకపోవడం, నష్టాలు తదితర కారణాలతో ఈ కంపెనీలు మూతపడ్డాయి. వీటితోపాటు గత రెండేళ్లుగా ఆస్తులు, అప్పుల పట్టికను సమర్పించని 971 కంపెనీలను ఆర్‌ఓసీ రద్దు చేసింది. 2,927 మంది డైరెక్టర్లను అనర్హులుగా ప్రకటించారు. 2018లో ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా 2,000 కంపెనీలను ఏర్పాటు చేస్తే.. 2019లో 3,000 కంపెనీలు నమోదయ్యాయి. 2020 జనవరి ఒకటి నాటికి ఆంధ్రప్రదేశ్‌లో 32,691 కంపెనీలు ఉండగా.. 20,000 కంపెనీలు చురుగ్గా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని కంపెనీల రిజిస్ట్రార్ డెన్నింగ్ బాబు, సహాయ ఆర్‌ఓసీ సాయి శంకర్ లండా తెలిపారు. మిగిలిన కంపెనీలు రద్దు చేసే స్థితికి వచ్చాయన్నారు. విజయవాడలో ఆర్‌ఓసీ కార్యాలయాన్ని ప్రారంభించి సంవత్సరం పూర్తయింది. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మొదటి వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో ఆర్‌ఓసీ కార్యాలయ సిబ్బందితోపాటు కంపెనీ సెక్రటరీస్ అమరావతి చాప్టర్ ప్రతినిధులు పాల్గొన్నారు.



విజయవాడలో ఆర్‌ఓసీ కార్యాలయాన్ని ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఆర్‌ఓసీ డెన్నింగ్ బాబు, సహాయ ఆర్‌ఓసీ సాయి శంకర్ లండా తదితరులు.

గత ఏడాది కాలంలో వివిధ కంపెనీలు ఆర్‌ఓసీకి సమర్పించిన 5,000 ఎలక్ట్రానిక్ ఫారమ్ (ఈ-ఫారమ్)లను ప్రాసెస్ చేశారు. గతంలో ఒక ఈ-ఫారమ్‌ను ప్రాసెస్ చేయడానికి సగటున నెల రోజులు పట్టేది. ప్రస్తుతం మూడు రోజుల్లోనే ప్రాసెస్ చేసి అనుమతులు ఇస్తున్నామని ఆర్‌ఓసీ వర్గాలు తెలిపాయి. 2019లో మొత్తం 50 కంపెనీలపై ఆర్‌ఓసీకి ఫిర్యాదులు అందాయి. విగో రైడిన్ ఫన్, బిట్ కాయిన్ ఇండియా, లుకాస్ షాపింగ్ షాపింగ్, సెర్ఫా మార్కెటింగ్, వంటి కంపెనీలపై ఆర్‌ఓసీ కఠిన చర్యలు తీసుకుంది. సిబ్బంది కొరత ఉన్నప్పటికీ.. కంపెనీ సెక్రటరీలు, చార్టర్డ్ అకౌంటెంట్ల సహాయ సహకారాలతో కంపెనీల కార్యకలాపాలు సజావుగా సాగడానికి విజయవాడ ఆర్‌ఓసీ కార్యాలయం కృషి చేస్తోందని డెన్నింగ్ బాబు వివరించారు.

3 రోజుల్లో ఈ-ఫారమ్ ప్రాసెస్

మారుతీ, మహీంద్రా దూకుడు

డిసెంబరు అమ్మకాల్లో వృద్ధి



న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద కార్ల కంపెనీగా ఉన్న మారుతీ సుజుకీతోపాటు మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం) డిసెంబరు నెలలో దేశీయంగా వాహన అమ్మకాల్లో వృద్ధిని సాధించాయి. ఏడాది చివరి నెలలో అమ్మకాలు తగ్గుతుంటాయి. కానీ ఈ కంపెనీలు మాత్రం వృద్ధిని నమోదు చేసుకున్నాయి. హ్యుండయ్, టయోటా, టాటా మోటార్స్ అమ్మకాలు క్షీణించాయి. డిసెంబరులో మారుతీ దేశీయ అమ్మకాలు అంతకు క్రితం ఏడాది డిసెంబరుతో పోల్చితే 2.4 శాతం మేర పెరిగి 1,21,479 యూనిట్ల నుంచి 1,24,375 యూనిట్లకు చేరుకున్నాయి. కాంపాక్ట్ సెగ్మెంట్లో కొత్త వ్యాగన్ ఆర్, స్విఫ్ట్, సెలేరియో, ఇగ్నిస్, బాలెనో, డిజైర్ అమ్మకాలు 51,346 యూనిట్ల నుంచి 65,673 యూనిట్లకు పెరిగాయి.

మహీంద్రా: ఈ కంపెనీ దేశీయ అమ్మకాలు డిసెంబరులో ఒక శాతం పెరిగి 36,690 యూనిట్ల నుంచి 37,081 యూనిట్లకు చేరుకున్నాయి. తమ ఔట్‌లుక్‌కు అనుగుణంగానే అమ్మకాలు ఉన్నాయని, వాహనాల నిల్వలు కూడా సౌకర్యవంతమైన స్థాయిలో ఉన్నాయని ఎం అండ్ ఎం ఆటోమోటివ్ డివిజన్ చీఫ్ (అమ్మకాలు, మార్కెటింగ్) విజయ్ రామ్ నక్రా తెలిపారు. బీఎస్-6 వాహనాలను తీసుకువచ్చేందుకు సర్వసన్నద్ధం అయినట్టు ఆయన చెప్పారు.

హ్యుండయ్: డిసెంబరులో హ్యుండయ్ దేశీయ అమ్మకాలు 9.8 శాతం తగ్గి 42,093 యూనిట్ల నుంచి 37,953 యూనిట్లకు చేరాయి. 2019 సంవత్సరం దేశీయ ఆటోమోటివ్ పరిశ్రమకు సవాలుగా మారిందని, ప్రతికూల పరిస్థితుల్లోనూ తమ కంపెనీ వివిధ విభాగాల్లో 4 కొత్త కార్లను విడుదల చేసినట్టు హ్యుండయ్ డైరెక్టర్ (సేల్స్, మార్కెటింగ్) తరుంగ్ గార్గ్ తెలిపారు. గత ఏడాదిలో కంపెనీ దేశీయంగా మొత్తం 5,10,260 కార్లను విక్రయించింది.

***టయోటా:** టయోటా కిర్లోస్కర్ మోటార్ దేశీయ అమ్మకాలు డిసెంబరులో 45 శాతం తగ్గి 11,836 యూనిట్ల నుంచి 6,544 యూనిట్లకు చేరాయి. 2019లో ఈ కంపెనీ మొత్తం 1,26,701 వాహనాలను విక్రయించింది. అంతకు ముందు ఏడాదితో పోల్చితే అమ్మకాలు 16.36 శాతం క్షీణించాయి.*

టాటా మోటార్స్: దేశీయ మార్కెట్లో డిసెంబరులో మొత్తం వాహనాల అమ్మకాలు 12 శాతం తగ్గి 50,440 యూనిట్ల నుంచి 44,254 యూనిట్లకు చేరుకున్నాయి. మొత్తం ప్యాసెంజర్ వాహనాల అమ్మకాలు అంతకు ముందు ఏడాది డిసెంబరుతో పోల్చితే 10 శాతం తగ్గి 14,260 యూనిట్ల నుంచి 12,785 యూనిట్లకు చేరాయి.

ఎంజీ మోటార్స్: ఈ కంపెనీ డిసెంబరులో 3,021 వాహనాలను విక్రయించింది.

***హోండా కార్స్:** డిసెంబరులో ఈ కంపెనీ దేశీయంగా 8,412 కార్లను విక్రయించింది. అంతకు ముందు ఏడాది ఇదే నెలతో పోల్చితే అమ్మకాలు 36 శాతం తగ్గాయి. తాము అంచనా వేసిన విధంగానే అమ్మకాలు నమోదయ్యాయని, బీఎస్ - 4 వాహనాల పంపిణీ ప్రక్రియ పూర్తయిందని కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, డైరెక్టర్ (సేల్స్, మార్కెటింగ్) రాజేష్ గోయల్ తెలిపారు.*

సాధారణ నిస్తేజం

ఆస్ట్రో వ్యూ

తిథి : పుష్య శుక్ల సప్తమి
నక్షత్రం : ఉత్తరాభాద్ర
అప్రమత్తం : భరణి, పుబ్బ, పూర్వాషాఢ నక్షత్ర జాతకులు, మేష, సింహ రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

ట్రెండ్ మార్పు వేళలు : 11.05

ధోరణి : నిఫ్టీ ఫ్యూచర్స్ నిస్తేజంగా ప్రారంభమై 10.40 వరకు అదే ధోరణిలో ట్రేడ్ కావచ్చు. ఆ తర్వాత 12.15 వరకు మెరుగ్గా ట్రేడయి ఆ తర్వాత చివరి వరకు మరోసారి నిస్తేజంగాను ట్రేడ్ కావచ్చు.

ట్రేడింగ్ వ్యూహం : నిఫ్టీ ఫ్యూచర్స్ 9.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని 10.40 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 10.45 తర్వాత ఎటిపి కన్నా పైకి వస్తే లాంగ్ పొజిషన్లు తీసుకుని 1.45 సమయానికి క్లోజ్ చేసుకోవచ్చు. 2 గంటల తర్వాత ఎటిపి కన్నా దిగువకు వస్తే తిరిగి షార్ట్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయానికి క్లోజ్ చేసుకోవాలి.

నిరోధం : 12225, 12260

మద్దతు స్థాయిలు : 12140, 12105

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి
www.thefinancialastrologer.blogspot.in

ఇండిగో @250 విమానాలు

ముంబై: విమానయాన సంస్థ ఇండిగో మంగళవారంనాడు మరో నాలుగు నియో విమానాలు ప్రవేశపెట్టింది. ప్రస్తుతం దేశంలో 250కి పైబడి విమానాలు కలిగి ఉన్న ఏకైక విమానయాన సంస్థ ఇది. అలాగే ఈ ఘనత సాధించిన తొలి విమానయాన సంస్థ కూడా. రోజుకు 1500 సర్వీసులు నడుపుతున్న తొలి బడ్జెట్ విమానయాన సంస్థగా రికార్డు ఇండిగోకు ఉంది. ప్రస్తుతం దేశీయ విమానయాన మార్కెట్‌లో ఇండిగో వాటా 47 శాతం ఉంది. మంగళవారంనాడు మూడు ఎ321 నియో విమానాలు, ఒక 320 నియో విమానం తాము ప్రవేశపెట్టినట్టు ఆ కంపెనీ తెలిపింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్100 గుడ్లు)



1వ తేదీకి..		విజయవాడ	474
హైదరాబాద్	464	విశాఖపట్నం	487
2వ తేదీకి..		వరంగల్	467
చిత్తూరు	488	డజను గుడ్లు రూ. 72	
గోదావరి	474		

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	92	విజయవాడ	95
వరంగల్	92	గుంటూరు	94
మహబూబ్‌నగర్	92	ఒంగోలు	97
కరీంనగర్	92	చిత్తూరు	92
కర్నూలు	92	నెల్లూరు	92
విశాఖపట్నం	93	అనంతపురం	86
గోదావరి	93		

స్టాక్ ఆధారిత వ్యూహమే ఉత్తమం

గత రెండేళ్లలో మార్కెట్ తీరును గమనిస్తే 2020 సంవత్సరంలో ఈక్విటీ పెట్టుబడులకు స్టాక్ ఆధారిత వ్యూహమే ఉత్తమం అనిపిస్తోంది. మార్కెట్ గత రెండేళ్లలో సాధించిన ర్యాలీలో ఎలాంటి హేతుబద్ధత కనిపించడంలేదు. మార్కెట్ ర్యాలీ అన్ని విభాగాలకు విస్తరించలేదు. కొన్ని ప్రత్యేక షేర్లు మాత్రమే మార్కెట్ కదలికలకు కారణం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో రాబోయే కాలంలో ఏయే రంగాలు మార్కెట్ చోదకశక్తులు అనే అంశం చెప్పడం కష్టంగా ఉంది. మార్కెట్ గత రెండేళ్లలో భారీ ర్యాలీలో ముందుకు సాగుతున్నప్పటికీ సగటు ఇన్వెస్టర్లకు అందుబాటులో ఉండే స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి. ఈ విభాగాల్లోని షేర్లు ఇన్వెస్టర్లకు లాభాలకన్నా 50 నుంచి 90 శాతం మేరకు నష్టాలను మిగిల్చాయి. షేర్ల వారీగా చూసినా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోటక్ బ్యాంక్ వంటివి ర్యాలీలో ఎన్నో మెట్లు పైకి దూసుకుపోయినా ఫండమెంటల్స్ పటిష్ఠంగా ఉన్న కర్ణాటక బ్యాంక్, ధనలక్ష్మి బ్యాంక్ వంటివి భారీగా నష్టపోయాయి. సెన్సెక్స్‌లో 30 షేర్లుండగా ర్యాలీ కేవలం ఆరు షేర్లు -హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్, ఐసీఐసీఐ, టీసీఎస్, ఇన్ఫోసిస్, కోటక్ మహీంద్రా బ్యాంకులకే పరిమితమైంది. 2019లో నిఫ్టీ సాధించిన లాభాల్లో 95 శాతం వాటా ఈ ఆరు షేర్లదే. మార్కెట్‌ను కొన్ని షేర్ల ఆధారంగానే ముందుకు నడిపేందుకు ఉద్దేశపూర్వకంగానే ప్రయత్నం సాగినట్టు ఈ షేర్ల కదలికలు నిరూపిస్తున్నాయి. నిరంతరం తగ్గుతూ వస్తున్నాయన్న కారణంగా టాటా మోటార్స్, యస్ బ్యాంక్ రెండింటినీ సెన్సెక్స్ నుంచి తప్పించడం కూడా మార్కెట్ కృత్రిమ వృద్ధికి దోహదకారి అయిందని భావించవచ్చు. నిర్మొహమాటంగా చెప్పాలంటే ప్రస్తుతం స్టాక్‌మార్కెట్ దేశ వాస్తవ ఆర్థిక స్థితికి గాని, స్థూల మార్కెట్‌కు గాని ఇండెక్స్‌లు ప్రాతినిధ్యం వహించడంలేదు.

మ్యూచువల్ ఫండ్లలోనూ అదే పరిస్థితి

చిన్న ఇన్వెస్టర్లు ఈక్విటీ మార్కెట్లలో ప్రవేశించేందుకు అనుకూలంగా భావించే మ్యూచువల్ ఫండ్ల పరిస్థితి కూడా ఏమంత బాగా లేదు. ఎంఎఫ్ స్కీమ్‌లను నిర్వహించే అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు (ఏఎంసి) ఏయే షేర్లలో పెట్టుబడి పెట్టాలనేది కూడా స్టాక్ ఎక్స్ఛేంజిలు, సెబీ పరోక్షంగా నిర్దేశిస్తున్నాయి. ఏఎంసీలు కేవలం టాప్ 50 కంపెనీల్లోనే ఇన్వెస్టర్ల సొమ్మును పెట్టుబడిగా పెడుతున్నాయి. ఏదైనా ఒక కంపెనీ మార్కెట్‌లో లిస్టింగ్ అయిన తర్వాత దాని పూర్వాపరాలు, మంచి చెడుల ఆధారంగా అందులో ఇన్వెస్ట్ చేయాలా, వద్దా అనేది నిర్ణయించుకునే హక్కు ఇన్వెస్టర్‌కు ఉంటుంది. కాని ఎంఎఫ్‌ల విషయం వచ్చే సరికి ఆ హక్కును పూర్తిగా నిరాకరిస్తూ కొందరు పెద్దలు తమ కనుసన్నల్లో మాత్రమే వాటిని నడిపిస్తున్నారు. ఈ పరిస్థితిలో మ్యూచువల్ ఫండ్లు కూడా చిన్న ఇన్వెస్టర్లకు న్యాయం చేయగలిగే స్థితిలో లేవు.




- ఎఎస్ఎస్ఎన్ రాజు,
స్టాక్ మార్కెట్ నిపుణుడు

ఏ షేర్లపై దృష్టి పెట్టవచ్చు?

ఈ వాస్తవాలన్నీ పరిగణనలోకి తీసుకుంటే ఇన్వెస్టర్లు ఎవరైనా మార్కెట్‌లో నిలకడ ధోరణిని ప్రదర్శిస్తూ భవిష్యత్ వృద్ధి అవకాశాలు గల షేర్లను ఎంపిక చేసుకుని వాటిలో ఇన్వెస్ట్ చేయడం ప్రస్తుతానికి మంచి వ్యూహం. బ్యాంకింగ్ రంగంలో ఇండియన్ బ్యాంక్ బాగుంది. అలాగే ఫండమెంటల్స్ బాగున్న ఇతర ప్రభుత్వ రంగ బ్యాంకులపై కూడా దృష్టి పెట్టవచ్చు.

- సిమెంట్ రంగంలో ఎన్‌సీఎల్ ఇండస్ట్రీస్ రూ.82 వద్ద ఆకర్షణీయంగా ఉంది.
- ఫార్మాలో గ్రాన్యూల్స్ ఇండియా, ఫెర్మెంటా బయోలకు మంచి వృద్ధి అవకాశాలున్నాయి.
- ఇన్‌ఫ్రాలో ఎల్ అండ్ టీ, ఎన్‌బీసీసీ, ఎఫ్ఎంసీజీలో ఐటీసీ మెరుగైన షేర్లుగా కనిపిస్తున్నాయి.
- ధర ఎక్కువైనా పెట్టుబడి పెట్టగల సామర్థ్యం ఉన్న వారు మారుతీపై దృష్టి పెట్టవచ్చు. అలాగే డివిడెండ్లపై అధికంగా దృష్టి పెట్టే వారికి కూడా ఎన్‌టీపీసీ బాగుంది.
- ప్రస్తుతం ప్లాస్టిక్‌పై నిషేధం వచ్చిన కారణంగా వెస్ట్ కోస్ట్ పేపర్, స్టార్ పేపర్, జేకే పేపర్ భవిష్యత్తు బాగుంటుంది. ఆ షేర్లను కూడా పరిగణనలోకి తీసుకోవచ్చు.

బులియన్



బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	39,300	---	---	---	39,220
క్రితం ముగింపు	39,180	---	40,450	39,250	39,290
22 క్యారెట్లు	37,410	---	---	---	37,350
క్రితం ముగింపు	37,320	---	37,210	36,350	37,420
వెండి (కిలో)	46,600	---	---	---	50,900
క్రితం ముగింపు	47,200	---	48,000	48,100	50,900


అధికారులతో సమీక్షలో సీఎస్ సోమేశ్ కుమార్

నిరక్షరాస్యుల జాబితా సిద్ధం చేయండి

» పల్లె ప్రగతి-2 కోసం సీఎస్ సోమేశ్ ఆదేశాలు

హైదరాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): చదవడం, రాయడం రాని 18 ఏళ్లు పైబడిన నిరక్షరాస్యుల జాబితాను సిద్ధం చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా గురువారం ప్రారంభం కానున్న పల్లె ప్రగతి రెండో విడత నేపథ్యంలో ఈ నెల 10లోగా నిరక్షరాస్యుల జాబితా సిద్ధం చేయాలన్నారు. కలెక్టర్లతో ఆయన బుధవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వయోజనుల అక్షరాస్యతను పెంపొందించడానికి ప్రత్యేకంగా క్యాంపెయిన్ నిర్వహించాలన్నారు. అన్ని గ్రామ పంచాయతీల్లో అక్షరాస్యత పెంపు కోసం 'ఈచ్ వన్, టీచ్ వన్' నిర్వహించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారని చెప్పారు.

తెలంగాణకు కాబోయే సీఎం కేటీఆర్: కవిత

మహబూబాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రానికి కేసీఆర్ తర్వాత కేటీఆరే సీఎం అవుతారని మానుకోట ఎంపీ మాలోతు కవిత అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో కేటీఆర్ టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పార్టీని ముందుకు తీసుకెళ్తూనే ఐటీ, పురపాలక శాఖ మంత్రిగా ప్రభుత్వంలో కీలకపాత్ర పోషిస్తున్నారని తెలిపారు. రాజ్యసభ సభ్యుడు సంతోష్ గ్రీన్ చాలెంజ్‌ను స్వీకరించిన ఎంపీ మహబూబాబాద్‌లో బుధవారం మూడు మొక్కలు నాటారు. అనంతరం తన పార్లమెంట్ పరిధిలోని నర్సంపేట, డోర్నకల్, పినపాక ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, రెడ్యానాయక్, రేగ కాంతారావులకు ఆమె గ్రీన్ చాలెంజ్ విసిరారు.

ఏఎండీ కొత్త డైరెక్టర్‌గా డీకే సిన్హా



హైదరాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్(ఏఎండీ) కొత్త డైరెక్టర్‌గా డాక్టర్ డీకే సిన్హా నియమితులయ్యారు. ఇప్పటివరకు డైరెక్టర్‌గా ఉన్న ఎంబీ వర్మ పదవీ విరమణ చేయడంతో ఆ స్థానంలో సిన్హాను నియమిస్తూ అటామిక్ ఎనర్జీ విభాగం ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్‌లోని కార్యాలయంలో ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

డిసెంబరులో జీఎస్టీ వసూళ్లు లక్ష కోట్లు

న్యూఢిల్లీ, జనవరి 1(ఆంధ్రజ్యోతి): గత డిసెంబరులో జీఎస్టీ కింద రూ.1,03,184 కోట్లు వసూలైందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 2018 డిసెంబరుతో పోల్చితే 9% వృద్ధి నమోదైందని బుధవారం కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడించింది. ఈ మొత్తంలో సీజీఎస్టీ రూపంలో రూ.19,962 కోట్లు, ఎస్‌జీఎస్టీ రూపంలో రూ.26,792 కోట్లు, ఐజీఎస్టీ రూపంలో రూ.48,099 కోట్లు, సుంకాల కింద రూ.8,331 కోట్లు ఉన్నాయని వివరించింది. ముగిసిన డిసెంబరులో తెలంగాణ నుంచి జీఎస్టీ కింద రూ.3,420 కోట్లు వచ్చిందని, 2018 డిసెంబరుతో పోల్చితే 13% వృద్ధి నమోదైందని స్పష్టం చేసింది.

స్వైన్‌ఫ్లూ నివారణలో 'ప్రైవేటు' పాత్ర: హైకోర్టు

హైదరాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్వైన్‌ఫ్లూ నియంత్రణలో ప్రైవేటు ఆస్పత్రులను కూడా భాగస్వామ్యం చేయాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. రానున్న రోజుల్లో స్వైన్ ఫ్లూ ప్రభావం తీవ్రమయ్యే అవకాశం ఉన్నందున జిల్లా వైద్యాధికారులు, డయాగ్నస్టిక్ కేంద్రాలు అప్రమత్తంగా ఉండాలని హైకోర్టు సూచించింది. స్వైన్‌ఫ్లూ విజృంభణపై డాక్టర్ కరుణ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని హైకోర్టు శుక్రవారం విచారించనున్నది.

'ఈచ్ వన్-టీచ్ వన్' వాలంటీర్లుగా చేస్తాం

» వినోద్ కుమార్‌తో పెన్షనర్ల సంఘం

హైదరాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): సీఎం కేసీఆర్ పిలుపు మేరకు 'ఈచ్ వన్- టీచ్ వన్' కోసం వాలంటీర్లుగా పనిచేసేందుకు రాష్ట్ర పెన్షనర్ల సంఘం ముందుకొచ్చింది. బుధవారం రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ వినోద్‌కుమార్‌ను ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాజుల నరసయ్య, ఇనగంటి నవనీతరావు కలిశారు. పెన్షనర్ల సంఘం నిర్ణయాన్ని వినోద్‌కుమార్ అభినందించారు. కాగా, వినోద్‌కుమార్‌ను టీఎన్‌జీఓ... టీఎస్ఎటీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అబ్దుల్లా, రాజిరెడ్డి కలిశారు.

నేడు రాష్ట్ర సోషల్ డెమోక్రటిక్ జేఏసీ ఏర్పాటు

హైదరాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ హామీల అమల్లో వైఫల్యాలను ఎత్తిచూపి, వాటి అమలుకు కృషి చేసేందుకు కొత్త జేఏసీ పురుడుపోసుకోనుంది. 'తెలంగాణ ఉద్యమ నినాదాలు-ప్రభుత్వ విధానాలు'పై గురువారం సోషల్ డెమోక్రటిక్ జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు కానుంది. ఇందులో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సంబంధించిన సంఘాల భాగస్వామ్యం ఉంటుందని గుజ్జ కృష్ణ చెప్పారు.

ఉపాధ్యాయులు ఆదర్శనీయులు: సురవరం

హైదరాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నేటి సమాజానికి ఉపాధ్యాయులు ఆదర్శనీయులని సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రూపొందించిన 2020 నూతన డైరీని బుధవారం ఆవిష్కరించారు. నేటి ప్రభుత్వాల అనాలోచిత విధానాలతో ఉపాధ్యాయులు గుర్తింపు, సరైన జీతభత్యాలు పొందలేకపోతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సరైన నిధులు కేటాయించకుండా విద్యారంగాన్ని వివక్షకు గురి చేస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అన్నారు.

4 లేదా 5న మజ్లిస్ భారీ ర్యాలీ

» సీపీపై ఉత్తమ్ విమర్శలు సరికావు: అసదుద్దీన్ ఒవైసీ



హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అంజనీకుమార్‌పై పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేసిన విమర్శలు సరికావని మజ్లిస్ చీఫ్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ జనవరి 4 లేదా 5న నగరంలో భారీ ర్యాలీ నిర్వహించేందుకు అనుమతి కోరుతూ సీపీకి డిసెంబరు 20నే దరఖాస్తు పంపామన్నారు. దారుస్సలాం నుంచి ఈద్గా బిలాల్ , చార్మినార్ నుంచి ధర్నాచౌక్ వరకు ర్యాలీకి అనుమతించాలని దరఖాస్తులో కోరామని, మూడు ప్రత్యామ్నాయ దారులను కూడా సూచించినట్లు తెలిపారు. గతంలో ఒకసారి ఇందిరాగాంధీ సైతం దారుస్సలాం మైదానాన్ని వేదికగా చేసుకుని బహిరంగ సభ నిర్వహించిన విషయాన్ని ఒవైసీ గుర్తు చేశారు. సీఏఏపై నిరసన తెలుపడానికి ఉత్సాహం చూపుతున్న కాంగ్రెస్ పార్టీ.. నిజామాబాద్‌లో తాము నిర్వహించిన సభకు ఆహ్వానించగా రాలేదని పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం ఆయన ట్విటర్‌లో స్పందించారు.

స్కూటర్‌ను ఢీకొట్టిన అంబులెన్స్.. ఇద్దరి మృతి

» మృతుల్లో ఆరేళ్ల చిన్నారి.. మద్యం మత్తులో డ్రైవర్?

» భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడులో విషాదం

బూర్గంపాడు, జనవరి 1: ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడటానికి అంబులెన్స్‌కు ఫోన్ చేస్తాం.. కానీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బుధవారం సాయంత్రం ఓ అంబులెన్స్ ఢీకొని ఇద్దరు చనిపోయారు. మరొకరికి గాయాలయ్యాయి. ఒకే కుటుంబానికి చెందిన ఈ ముగ్గురూ నూతన సంవత్సర వేడుకల కోసం పాములేరుకు పిక్నిక్ కోసం వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి అంబులెన్స్ బూర్గంపాడు నుంచి వెళుతోంది. భద్రాచలం ఐటీడీఏ కాలనీకి చెందిన చంద్రిక(29), ఆమె తల్లి శ్రీలత, శ్రీలాస్య(6) స్కూటీపై భద్రాచలం వైపువెళుతున్నారు. శ్రీలాస్యకు చలేస్తుందనడంతో పులితేరు వాగు సమీపంలో ఆగారు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన అంబులెన్స్ వారిని ఢీకొట్టింది. అదుపుతప్పి చెట్టును ఢీకొంది. స్కూటర్‌పై ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. భద్రాచలం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చంద్రిక, శ్రీలాస్య చనిపోయారు. అంబులెన్స్ డ్రైవర్ దుర్గాప్రసాద్‌కు కూడా గాయాలయ్యాయి. కాగా, దుర్గాప్రసాద్ తన మిత్రులతో కలిసి బుధవారం మధ్యాహ్నం నుంచి బూర్గంపాడులోని వైన్‌షాపు వద్ద మద్యం తాగినట్టు స్థానికులు చెబుతున్నారు.

నమ్మిన వారు మోసగిస్తే బాధేస్తుంది!

ద్రోహులు బాగుపడరు.. నాకు దొంగ దెబ్బ తీయడం తెలియదు: ఈటల



హుజూరాబాద్, జనవరి 1: "నమ్మిన వారు మోసం చేస్తే బాధ కలుగుతుంది. అసెంబ్లీ ఎన్నికల్లో నన్ను ఓడించేందుకు కొందరు కుట్ర చేశారు. వారు బాగుపడరు" అని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో బుధవారం జమ్మికుంట, హుజూరాబాద్ మునిసిపాలిటీల టీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. ఎన్నికల్లో తాను ఎన్నోసార్లు పోటీ చేశానని, 18 ఏళ్లలో చాలా అనుభవం వచ్చిందన్నారు. తనకు కొట్లాడడమే తప్ప దొంగ దెబ్బ తీయడం తెలియదన్నారు. 'ఎన్నికలంటేనే పైసలు. పైసలుంటేనే టికెట్లు, ఓట్లు వస్తాయని అనుకుంటారు. కానీ, ప్రజల అభిమానం ఉంటే అన్నీ వస్తాయని మర్చిపోవద్దు' అని తెలిపారు. నిజాయితీగా పనిచేసే వారికే ప్రజలు ఓట్లు వేస్తారన్నారు. నాయకులను గెలిపించేందుకు కార్యకర్తలు ఎంత కష్టపడతారో తెలుసని చెప్పారు. అమ్ముడు పోనిది ఆత్మగౌరవం మాత్రమేనని, ప్రజలు ధర్మం తప్పరని స్పష్టం చేశారు. అలా తప్పి ఉంటే తాను గెలిచే వాడిని కాదన్నారు. నాటి సీఎం వైఎస్ తనకు నిధులివ్వకుండా ఇబ్బంది పెట్టారని, ఆ కసితోనే తాను మంత్రి కాగానే హుజూరాబాద్, జమ్మికుంట పట్టణాలకు ఎక్కువ నిధులు కేటాయించి అభివృద్ధి చేశానన్నారు. హుజూరాబాద్‌లో కాంగ్రెస్‌కు అడ్రస్ లేదన్నారు. మునిసిపాలిటీ ఎన్నికల్లో బీఫాంలు తానే ఇస్తానని ఈటల చెప్పారు. క్యాంపు రాజకీయాలు తన వల్ల కాదని, ధర్మంగా కొట్లాడడమే తెలుసనాన్నరు. కొందరు నాయకులు గెలవక ముందు ఒకలా, గెలిచిన తర్వాత మరోలా ఉంటారన్నారు. అలాంటి వారిని మినహాయించి టికెట్లు ఇస్తానని వెల్లడించారు. గెలుపు గుర్రాలకే టీఆర్ఎస్ టికెట్లు దక్కుతాయని స్పష్టం చేశారు.

మా ప్రత్యర్థి కాంగ్రెస్సే

(మొదటి పేజీ తరువాయి)



పార్టీని ఆషామాషీగా తీసిపారేయలేమన్నారు. తన చిన్నప్పుడు బీజేపీ ఎలా ఉందో, ఇప్పుడూ అలాగే ఉందని.. ఆ పార్టీలో ఎదుగుదల లేదని వ్యాఖ్యానించారు. మునిసిపల్ ఎన్నికల కోసం టీఆర్ఎస్ అంత చురుగ్గా ఇతర పార్టీలు కదలటం లేదని అన్నారు. ఎన్నికల్లో వరుస విజయాలతో పొంగిపోవాల్సిన పని లేదని, 2019లో టీఆర్ఎస్ మరీ కిందిస్థాయికి వెళ్లిన పరిస్థితి లేదని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు అనుకున్నట్టు రాకపోయినప్పటికీ, ప్రతి ఎన్నికల్లోనూ తమ పార్టీ నంబర్ వన్‌గా నిలిచిందన్నారు. ఏ పార్టీకైనా ఎత్తుపల్లాలు సహజమని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో మరో నాలుగేళ్లు టీఆర్ఎస్ అధికారంలో ఉంటుందని, ఈ పరిస్థితుల్లో ప్రజలు మునిసిపల్ ఎన్నికల్లో ఇతర పార్టీలకు అవకాశం ఇస్తారని అనుకోవడం లేదన్నారు. మిత్రపక్షమైనప్పటికీ మజ్లిస్‌తో కలిసి తాము పోటీ చేయబోమని స్పష్టం చేశారు.

ఏపీ సీఎం జగన్‌తో సత్సంబంధాలు

ఏపీ సీఎం జగన్‌తో రిలేషన్ బాగా లేదని ఎవరన్నారు? ఆయనతో సత్సంబంధాలే ఉన్నాయని కేటీఆర్ చెప్పారు. భౌగోళికంగా సరిహద్దు రాష్ట్రాలన్నింటితోనూ తెలంగాణ ప్రభుత్వానికి మంచి సంబంధాలే ఉన్నాయని తెలిపారు. అందువల్లే కాళేశ్వరం ప్రాజెక్టు సాకారమైందని చెప్పారు. చిన్న చిన్న సమస్యలు ఉంటే, చర్చల ద్వారా పరిష్కరించుకుంటామన్నారు. గోదావరి, కృష్ణా నదుల అనుసంధానంపై ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం జరగలేదని స్పష్టం చేశారు. ప్రాజెక్టును రెండు ప్రభుత్వాలు కలిసి చేస్తాయా? విడివిడిగా చేస్తాయా? అనేది భవిష్యత్తులో తేలుతుందన్నారు. తెలంగాణకు సముద్ర తీరం లేని పరిస్థితుల్లో ఏపీలోని బందర్ పోర్టును లీజుకు తీసుకునే ఆలోచన ప్రభుత్వానికి ఉందని తెలిపారు. ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ వస్తే భద్రాచలమే నౌకాశ్రయం అవుతుందని చెప్పారు. భవిష్యత్తులో సీ ప్లేన్స్ వస్తే.. మల్లన్నసాగర్, మిడ్ మానేరు, పాలమూరు జలాశయాలు ఉపయుక్తంగా ఉంటాయనడంలో సందేహం లేదని చెప్పారు. నకిరేకల్ వైపు డ్రై పోర్టు వచ్చే అవకాశం ఉందన్నారు.

కేంద్రం ఏం ఇస్తుందో వేచి చూస్తాం!

కేంద్రం చేపట్టిన చర్యల ద్వారా తెలంగాణకు ఏం మేలు జరుగుతుందో బడ్జెట్ వరకూ వేచి చూస్తామని కేటీఆర్ చెప్పారు. తెలంగాణ వంటి రాష్ట్రాలకు కేంద్రం చేయూతనిస్తే దేశానికే మంచిదన్నారు. అలా కాకుండా రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తూ బీజేపీ పాలిత, ఆ పార్టీ ఎంపీలున్న రాష్ట్రాలకే ఎక్కువ నిధులిస్తే.. వారికే నష్టమన్నారు. తాజా నిధుల విడుదల ప్రకటనపై స్పష్టత రావాల్సి ఉందని చెప్పారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ భూములపై కేంద్రం స్పందించడం లేదన్నారు. కేంద్రం రూపాయి ఇవ్వకపోయినా ఐటీలో తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా నిలుస్తోందని తెలిపారు.

కేసీఆర్‌ను మించిన హిందువెవరు?

పౌరసత్వ సవరణ చట్టానికి హిందువులంతా అనుకూలం, ముస్లింలందరూ వ్యతిరేకం అనే వాదన సరి కాదని కేటీఆర్ అన్నారు. "అలా అంటే కేసీఆర్‌ను మించిన హిందువు ఎవరున్నారు? ఆయన చేసినన్ని యాగాలు ఎవరైనా చేశారా? గుళ్లు ఎవరైనా కట్టించారా? కానీ ఆయన పౌరసత్వ సవరణ చట్టంలోని ఒక లోపాన్ని ఎత్తి చూపుతూ వ్యతిరేకించారు" అని చెప్పారు. ప్రతికూల పరిస్థితులను అనుకూలంగా మలుచుకోవటంలో కేసీఆర్‌ది అందవేసిన చేయి అని, ఆర్టీసీ సమ్మె విషయంలో అది మరోసారి రుజువైందన్నారు. 'కాబోయే సీఎం కేటీఆర్' అంటూ జరుగుతున్న ప్రచారంపై విలేకరులు ప్రశ్నించగా.. రానున్న కాలంలోనూ సీఎంగా కొనసాగుతానని కేసీఆర్ అసెంబ్లీలోనే స్పష్టత ఇచ్చారని, దీనిపై ఇంకా అనుమానాలు ఎందుకని కేటీఆర్ ఎదురు ప్రశ్నించారు.

వైదొలగడం.. ఉత్తమ్ ఇష్టం

టీపీసీసీ అధ్యక్ష పదవి నుంచి వైదొలగటం ఉత్తమ్ ఇష్టమని, దానిపై తాను ఎలాంటి వ్యాఖ్యలు చేయబోనని కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ సీపీపై ఉత్తమ్ చేసిన వ్యాఖ్యలు సరికాదని అభిప్రాయపడ్డారు.

కొత్త చట్టం.. సమర్థంగా అమలు

మునిసిపల్ శాఖ మంత్రిగా రాష్ట్రంలో కొత్త మునిసిపల్ చట్టాన్ని సమర్థంగా అమలు చేయటమే కొత్త సంవత్సరంలో తన లక్ష్యమని కేటీఆర్ చెప్పారు. ఎన్నికల తర్వాత పార్టీలకతీతంగా కౌన్సిలర్లు/కార్పొరేటర్లకు కొత్త చట్టంపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. తప్పు చేసే వారు టీఆర్ఎస్ వారైనప్పటికీ, పదవి నుంచి తొలగిస్తామని స్పష్టం చేశారు. కొత్త మున్సిపల్ చట్టం అమలు కోసం కలెక్టర్ ఆధ్వర్యంలో ఆరు బృందాలు ఏర్పాటు చేస్తామని, దీనికి విశేష అధికారాలు ఉంటాయన్నారు.

కొత్త విద్యా విధానం

అక్షరాస్యత పెంపు కోసం రాష్ట్రంలో కొత్త విద్యా విధానాన్ని తీసుకొస్తామని కేటీఆర్ పేర్కొన్నారు. 'ఈచ్ వన్- టీచ్ వన్' అంటూ కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు విద్యావంతులందరూ ఈ యజ్ఞంలో పాలుపంచుకోవాలని కోరారు. రాష్ట్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేవని కేటీఆర్ చెప్పారు. "రైతులు అవస్థలు పడితే ఇంట్లో కూర్చొంటారా? రోడ్డెక్కరా?" అని ఆయన ఒక ప్రశ్నకు సమాధానంగా బదులిచ్చారు.

పాత బస్తీకి మెట్రో పక్కా

ఎంఎంటీఎస్ మరో దశకు ప్రయత్నిస్తున్నామని, దీనిపై రైల్వే బోర్డు చైర్మన్‌తోనూ మాట్లాడినట్లు కేటీఆర్ చెప్పారు. పాత బస్తీకి మెట్రో రైలు పక్కాగా వస్తుందని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ముగిశాక జేబీఎస్-ఎంజీబీఎస్ మెట్రో మార్గాన్ని సీఎం కేసీఆర్ ప్రారంభిస్తారని, ఆ తర్వాత పాత బస్తీకి మెట్రో లైన్‌పై దృష్టి సారిస్తామన్నారు.

క్షేత్రస్థాయిలో ఏం జరుగుతోంది?

"మునిసిపల్ ఎన్నికల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితులు ఎలా ఉన్నాయి.. ఏం జరుగుతోంది" అని ముఖ్య నేతలను టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ భవన్‌లో టీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ, సీనియర్ నేతలతో కేటీఆర్ సమావేశమయ్యారు. వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన అనంతరం.. మునిసిపల్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై వారితో చర్చించారు. గత వారం జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో చర్చించిన పలు అంశాలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అతిత్వరలోనే ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులతో విస్తృత స్థాయి సమావేశాన్ని కేసీఆర్ నిర్వహిస్తారని కేటీఆర్ తెలిపారు. ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ అనుసరించే వ్యూహం గురించి నేతలకు ఆ సమావేశంలో కేసీఆర్ దిశానిర్దేశం చేస్తారని చెప్పారు.

పొగడకుండా ఉండలేకపోతున్నారు

రాబోయే దశకం తెలంగాణదే కావాలని కేటీఆర్ ఆకాంక్షించారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ముందుడుగు వేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే నాయకత్వ సంక్షోభం ఏర్పడుతుందని చాలా మంది భావించారని, కానీ ఇప్పుడు తెలంగాణ నాయకత్వ పటిమను దేశమే మెచ్చుకుంటోందన్నారు. లక్ష్మణ్ వెనక్కి లాగుతున్నప్పటికీ, తెలంగాణ అభివృద్ధిని కేంద్ర మంత్రులు పొగడకుండా ఉండలేకపోతున్నారని, గవర్నర్ తమిళిసై కాళేశ్వరాన్ని సందర్శించి మంచి మాటలు చెప్పారన్నారు. విపక్షాలు సద్విమర్శలు చేస్తే స్వీకరించటానికి సిద్ధంగా ఉన్నామని, రాజకీయం చేస్తే దీటుగా ఎదుర్కొంటామని చెప్పారు.

2020లోనూ శుభారంభమే!

అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయంతో 2019లోకి అడుగుపెట్టినట్లే.. 2020లోనూ టీఆర్ఎస్‌కు శుభారంభమే దక్కుతుందని కేటీఆర్ ధీమా వ్యక్తంచేశారు. మునిసిపల్ ఎన్నికల్లో తమ పార్టీ వంద శాతం మంచి ఫలితాలు సాధిస్తుందన్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన ఏడాదిలోనే 60 లక్షల సభ్యత్వాన్ని సాధించటం సంతోషంగా ఉందన్నారు. జిల్లాల వారీగా నిర్మాణాలు పూర్తయిన పార్టీ కార్యాలయాలను నెలాఖరులో కేసీఆర్ ప్రారంభిస్తారని తెలిపారు. కార్యకర్తలకు శిక్షణా తరగతులు ఏర్పాటు చేసి, వివిధ అంశాలపై తర్ఫీదు ఇస్తామని చెప్పారు. జిల్లాల వారీగా సోషల్ మీడియా వారియర్స్‌ను నియమిస్తామని తెలిపారు. మునిసిపోల్స్‌కు సంబంధించిన అంతర్గత నివేదికలు ఒకటి, రెండు రోజుల్లో అందుతాయని, వాటిని కేసీఆర్ సమగ్రంగా పరిశీలించాక ఈ వారంలోనే విస్తృత స్థాయి సమావేశం ఉంటుందని చెప్పారు. మునిసిపోల్స్‌లో పోటీకి ఎక్కువ మంది ఉత్సాహం చూపిస్తున్నారని, దీన్ని నివారించటానికి ఇన్‌చార్జీలుగా ఉన్న ఎమ్మెల్యేలు ఆశావహుల కాళ్లు పట్టుకోవటమో.. కడుపులో తల పెట్టడమో చేయాల్సి వస్తుందన్నారు.

ఓటర్లకు బదులు కిటికీ, బీరువా!

ఆర్మూర్, జనవరి 1: ఓటర్ల జాబితా తయారీలో అధికారుల నిర్లక్ష్యం మరోసారి బయటపడింది. పక్కాగా సర్వే చేసి ఓటర్ల జాబితాను రూపొందించాల్సి ఉండగా.. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మునిసిపల్ అధికారులు తప్పుల తడకగా తయారు చేశారు. ఓటరు ఫొటో బదులు వస్తువుల ఫొటోలు, ఒక్కొక్కరి పేర్లు రెండు చోట్ల, ఐదేళ్ల కిందట చనిపోయిన వారి పేర్లు కూడా జాబితాలో ఉండడం గమనార్హం. అంతేగాక కులాలను కూడా మార్చేశారు. అంటే సర్వే చేసిన సిబ్బంది కనీసం ఓటర్ల ఇళ్లకు వెళ్లలేదన్న విషయం అర్థమవుతోంది.

- 36వ వార్డులో 71 పోలింగ్ కేంద్రంలో ఒకే ఓటరు పేరు రెండు సార్లు వచ్చింది.
- ఓటరు ఫొటో బదులు కిటికీ, బీరువా ఫొటోలు పెట్టారు.
- 48వ పోలింగ్ కేంద్రంలో తల్లీ, కుమారుడి పేర్లు, ఫొటోలు పక్కపక్కనే 2చోట్ల ఉన్నాయి.
- మాజీ వార్డు మెంబరు నాయుడు, ఆయన కుమారుడు ఐదేళ్ల క్రితం చనిపోయారు. వారి పేర్లు అలాగే ఉన్నాయి.

ఇలాంటి తప్పులు వందల్లో ఉన్నాయి. వెంటనే సరి చేయకుంటే పోలింగ్ సరళిపై ప్రభావం చూపే అవకాశముంది. ఇప్పటికే వార్డుల విభజనలో అధికారులు విమర్శలపాలయ్యారు. అయినా ఓటరు జాబితా తయారీలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం గమనార్హం.

తల్లి పక్కలో నిద్రపోతున్న నాలుగేళ్ల చిన్నారిని ఎత్తుకెళ్లి అత్యాచారం

(మొదటి పేజీ తరువాయి)

వదిలేసి వచ్చాడు. ఈ అమానుష ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోనంపేటలో జరిగింది. నాగారం గ్రామానికి చెందిన కొమురయ్య (36) ఒక జులాయి. కోనంపేటకు చెందిన ఓ వితంతువుతో పరిచయమైంది. ఆమెకు నాలుగేళ్ల కూతురు ఉంది. తరుచూ వారి ఇంటికి వెళ్లేవాడు. మంగళవారం వెళ్లగా తల్లీ కూతుళ్లు నిద్రిస్తున్నారు. పాపను ఎత్తుకెళ్లిన కొమురయ్య అత్యాచారానికి పాల్పడ్డాడు. తల్లికి మెళకువ రావడంతో అదే రాత్రి స్థానికుల సహాయంతో పాప కోసం గాలించింది. కానీ ఆచూకీ దొరకలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. బుధవారం ఉదయం గ్రామానికి సమీపంలో గల అడవి నుంచి ఏడుపు వినిపించడంతో వెళ్లి చూడగా చిన్నారి కన్పించింది. శరీరంపై గాయాలున్నాయి. నిందితుడు కొమురయ్య కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం రాత్రి పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో ఐదేళ్ల చిన్నారిపై 12 ఏళ్ల బాలుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. పోతనకాలనీలోని ఒకే బ్లాక్‌లో ఉండే రెండు కుటుంబాలకు చెందిన చిన్నారులు ఆడుకునే క్రమంలో బాలుడు చిన్నారిపై లైంగిక దాడికి యత్నించాడు. భయంతో చిన్నారి ఏడ్చుకుంటూ వచ్చి తల్లిదండ్రులకు చెప్పింది. చిన్నారి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని, బాలుడిని అదుపులోకి తీసుకున్నారు.

బీసీ రిజర్వేషన్లు తగ్గిస్తే సుప్రీం కోర్టుకు: కృష్ణయ్య

రాంనగర్/హైదరాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ ఎన్నికల్లో బీసీరిజర్వేషన్లు తగ్గిస్తే సుప్రీం కోర్టులో సవాల్ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్య హెచ్చరించారు. ఏపీ 34%, కర్ణాటక 36, తమిళనాడు 50, మహారాష్ట్ర 48% రిజర్వేషన్లు అమలు చేస్తున్నాయని, రాష్ట్రంలోనూ 34% రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. లేకపోతే 14 బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామన్నారు.

ఉమ్మడి గుర్తు కావాలంటే 10 % సీట్లకు పోటీ చేయాల్సిందే

హైదరాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఎన్నికల గుర్తులులేని రిజిస్టర్డ్ పార్టీలు మునిసిపల్ ఎన్నికల్లో 'కామన్ సింబల్' కావాలనుకుంటే కనీసం 10% సీట్లలో అభ్యర్థులను పోటీకి దింపాల్సి ఉంటుందని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 10% అభ్యర్థులను రంగంలోకి దింపుతున్నట్టు ఆధారాలతో కమిషన్‌కు నివేదించాలన్నారు.

కాంగ్రెస్ 'మేనిఫెస్టో కమిటీ' చైర్మన్‌గా మాదం

హైదరాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ ఎన్నికల కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్సీ మాదం రంగారెడ్డిని ఆ పార్టీ నియమించింది. 11 మందితో కూడిన మేనిఫెస్టో కమిటీని ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి ఖుంటియా బుధవారం ప్రకటించారు. మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, ఆల్ ఇండియా ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ బెల్లయ్య నాయక్, టీపీసీసీ మైనారిటీ విభాగం చైర్మన్ ఎస్‌ఏ సోహేల్, మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్, మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్ తదితరులు సభ్యులుగా ఉన్నారు.

మునిసి'పోల్స్'కు మళ్లీ షెడ్యూల్ ప్రకటించాలి

» హైకోర్టును ఆశ్రయించిన ఉత్తమ్

హైదరాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మునిసిపల్ ఎన్నికలకు మళ్లీ షెడ్యూల్ జారీ చేసేలా ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ బుధవారం పిల్ దాఖలు చేశారు. వార్డులకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలకు రిజర్వేషన్లు ఖరారు చేయకుండానే రాష్ట్ర ఈసీ హడావుడిగా షెడ్యూల్ జారీ చేయడం రాజ్యాంగ విరుద్ధమని అందులో తెలిపారు. రిజర్వేషన్లను ఈ నెల 6న ప్రకటిస్తే, మరుసటి రోజే ఎన్నికల ప్రక్రియకు నోటిఫికేషన్ జారీ కానున్న నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రాలు పొందడం అసాధ్యమవుతుందన్నారు. మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలోని వార్డుల విభజనలో అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకపోవడంపై ఇప్పటికే కొందరు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించిన విషయాన్ని ఉత్తమ్ గుర్తుచేశారు. తగిన సమయం ఇవ్వాలని న్యాయస్థానం చెప్పినా వార్డుల విభజన మళ్లీ హడావుడిగానే జరిగిందని, రిజర్వేషన్లనూ ప్రకటించలేదని తెలిపారు. నూతన మునిసిపల్ చట్టం ప్రకారం వార్డుల్లో ఓటర్లు సాధ్యమైనంత వరకు సమానంగా ఉండాలని, రిజర్వేషన్లు కూడా ప్రకటించాల్సి ఉందని ఆయన తెలిపారు. అఖిలపక్ష సమావేశంలో రాష్ట్ర ఈసీ సరైన సమాధానం ఇవ్వకుండా దురుసుగా ప్రవర్తించిందని.. దళిత బహుజన పార్టీ నేతను బలవంతంగా బయటికి పంపిందని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు.

నేడే రిజర్వేషన్లు ప్రకటించండి!

ఎన్నికల్లో ఆరు సార్లు గెలిచిన తాను మునిసిపల్ ఎన్నికలకు భయపడుతున్నట్లుగా టీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఉత్తమ్ ఆరోపించారు. రిజర్వేషన్లను గురువారమే ప్రకటించి ఎన్నికలు ప్రస్తుత షెడ్యూల్ ప్రకారమే జరుపుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. "వార్డువారీ ఓటర్ల జాబితా 5న, రిజర్వేషన్లు 6న ప్రకటిస్తారట. 8న నామినేషన్లు మొదలవుతాయి. అభ్యర్థుల ఎంపికకు, కులధ్రువీకరణ పత్రాలు తెచ్చుకునేందుకు, అభ్యర్థులకు ఏ ఫామ్, బీ ఫామ్ జారీకి సమయం ఏది?" అని ప్రశ్నించారు.

మునిసిపోల్స్

రాజకీయాలను కేసీఆర్ భ్రష్టు పట్టించారు

» ఎన్నికలను డబ్బు మయం చేసిందీ ఆయనే

» కాంగ్రెస్ వారిని ఇబ్బంది పెడితే జైల్ భరో: ఉత్తమ్


గాంధీభవన్‌లో శంకర్‌నాయక్‌కు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్

హైదరాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాజకీయాలను భ్రష్టు పట్టించిన చరిత్ర కేసీఆర్‌దని, ఎన్నికలను డబ్బుమయం చేసిన ఘనతా ఆయనకే దక్కుతుందని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. టీఆర్ఎస్‌ది కుటుంబ పాలన.. దోపిడీ విధానమంటూ ధ్వజమెత్తారు. ఆరేళ్ల పాలనలో కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు బాగుపడడం, దోచుకుతినడం తప్ప రాష్ట్రానికి చేసిందేమీ లేదని ఆరోపించారు. గతంలో కాంగ్రెస్ తరఫున ఎంపీపీగా గెలిచి టీఆర్ఎస్‌లో చేరిన వనపర్తి జిల్లా నాయకుడు శంకర్‌నాయక్ బుధవారం అనుచరులతో కలిసి ఉత్తమ్ సమక్షంలో మళ్లీ కాంగ్రెస్‌లో చేరారు. గాంధీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ్ మాట్లాడుతూ.. అనేక కారణాలు, అపోహలతో కాంగ్రెస్‌ను వీడి ఇతర పార్టీల్లో చేరిన వారు తిరిగి రావాలని సూచించారు. దేశం, రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలు, ఎస్సీ, ఎస్టీలకు మేలు చేసింది కాంగ్రెస్సే అన్నారు. "2014 నుంచి 2019 వరకు కేసీఆర్ ఇచ్చిన హామీ ఒక్కటైనా నిలబెట్టుకున్నారా? యువతకు నెలకు రూ.3016 చొప్పున నిరుద్యోగ భృతి, రైతులకు రూ.లక్ష రుణమాఫీ ప్రకటించారు. ఏడాది గడిచినా ఈ పథకాలు అమలు చేయలేదు. డబుల్ బెడ్‌రూం మాట దేవుడెరుగు.. ఇందిరమ్మ ఇళ్లకూ బిల్లులు చెల్లించని దౌర్భాగ్య స్థితిలో కేసీఆర్ ఉన్నారు. వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి" అని సూచించారు. సీఏఏతో మతపరంగా దేశాన్ని విభజించేందుకు మోదీ ప్రయత్నిస్తుంటే సీఎం కేసీఆర్ బీజేపీకి మద్దతు ఇస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు ఇబ్బందులు పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అణిచివేత కొనసాగితే నిరసనగా జైల్‌భరో కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.



ఆస్ట్రేలియాలో దావానలం

పెర్త్, జనవరి 1: నూతన సంవత్సర వేడుకలతో యావత్ ప్రపంచమంతా సంబరాల్లో మునిగి తేలుతుంటే ఆస్ట్రేలియన్లు మాత్రం కార్చిచ్చుతో ఇబ్బందిపడుతున్నారు. ఆస్ట్రేలియాలో ఆగ్నేయ కోస్తా ప్రాంతంలోని న్యూ సౌత్‌వేల్స్, విక్టోరియా రాష్ట్రాల్లో గత నెలలో భారీగా మంటలు అంటుకున్నాయి. ఎటుచూసినా దట్టమైన పొగలు, అగ్నికీలలు వ్యాపించాయి. ఈ దావానలం ధాటికి రెండు రాష్ట్రాల్లోనూ డజన్ల కొద్దీ ఇళ్లు, వాహనాలు కాలిపోయాయి. స్థానికులను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మంటలను అదుపు చేయడానికి బుధవారం సైనిక నౌకలు, ఎయిర్‌క్రాఫ్టులను తరలించారు. సహాయ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

67,385

1న భారత్‌లో జననాలు!



- ప్రపంచ వ్యాప్తంగా 3,92,078 మంది..
- పుట్టిన వారిలో 17% మనదేశంలోనే!
- వివరాలను వెల్లడించిన యునిసెఫ్
- హైదరాబాద్‌లో 210 మంది జననం

హైదరాబాద్/సిటీ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో కొత్త సంవత్సరం తొలి రోజున 67,385 మంది పిల్లలు పుట్టి ఉంటారు! ప్రపంచ వ్యాప్తంగా జనవరి 1న 3,92,078 మంది జన్మించి ఉంటారు! ఇదీ యునిసెఫ్ అంచనా. ఈ మేరకు బుధవారం వివరాలను వెల్లడించింది. ప్రపంచ వ్యాప్తంగా జనవరి 1న జన్మించే శిశువుల్లో 17 శాతం మంది భారత్‌లోనే ఉంటారని తెలిపింది. ఈ విషయంలో అమెరికా అన్ని దేశాల కన్నా వెనుకబడి ఉంది. ఇక జనవరి 1న జన్మించే మొత్తం శిశువుల్లో సగం మంది 8 దేశాల్లోనే ఉంటున్నట్లు వెల్లడించింది. అందులో ఇండియా 67,385 మందితో అగ్రస్థానంలో ఉండగా.. చైనా 46,299, నైజీరియా 26,039, పాకిస్తాన్ 16,787, ఇండోనేషియా 13020, అమెరికా 10452, కాంగో 10247, ఇథియోపియా 8493 తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. కాగా.. హైదరాబాద్ నగరంలోని 4 ఏరియా ఆస్పత్రులు, 9 ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రులు, ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌ల్లో కలిపి బుధవారం 210 మందికి పైగా జన్మించారు.

130కే 200 ఉచిత చానళ్లు

(మొదటిపేజీ తరువాయి)



ఆఫ్ సర్వీసెస్ రెగ్యులేషన్స్, 2017కు ట్రాయ్ సవరణలు చేపట్టి ఈ కొత్త విధానాన్ని ప్రకటించింది. దానిప్రకారం..

- వినియోగదారుడు నెలకు రూ. 130 (పన్నులు అదనం) చెల్లిస్తే 200 ఉచిత చానళ్లను.. అది కూడా వారు ఎంచుకున్న చానళ్లను తప్పనిసరిగా ఇవ్వాల్సిందే. వాటితోపాటు కేంద్ర సమాచార, ప్రసార శాఖ తప్పనిసరిగా పేర్కొన్న దూరదర్శన్ వంటి 26 చానళ్లను కూడా ఇవ్వాలి. ప్రస్తుతం ఈ మొత్తానికి దూరదర్శన్ చానళ్లు కాకుండా కేవలం 100 ఉచిత చానళ్లను మాత్రమే ప్రసారం చేస్తున్నారు. ఆ తర్వాత ఇచ్చే ప్రతి 25 ఉచిత చానళ్లకూ రూ.20 (పన్నులు అదనం) వసూలు చేస్తున్నారు.
- వినియోగదారు నెలకు 160 చెల్లిస్తే సర్వీస్ ప్రొవైడర్లు తమవద్ద ఉన్న ఉచిత చానళ్లన్నీ ఇవ్వాల్సిందే.
- చాలా టీవీ చానళ్ల యాజమాన్యాలు.. అలా కార్టే (విడివిడిగా మనకు కావాల్సిన చానల్‌ను ఎంచుకునే పద్ధతి)లో తమ చానళ్లలో ప్రధాన చానల్‌కు ఎక్కువ ధర పెట్టి, దానికి అనుబంధంగా ఉండే మిగతా చానళ్లకు తక్కువ ధర పెట్టాయి. అన్నిటినీ కలిపి గంపగుత్తగా (బొకే) తీసుకుంటే మాత్రం తక్కువ ధరకే వచ్చేలా చేశాయి. దీంతో వినియోగదారులు అన్నింటినీ కలిపి తీసుకోవాల్సిన పరిస్థితి. దీనికి విరుగుడుగా ట్రాయ్ కొత్త విధానంలో రెండు ప్రధాన నిబంధనలను పెట్టింది. అవేంటంటే.. 1.) అలా కార్టేలో విడివిడిగా ఇచ్చే చానళ్ల ధర బొకే ధరకు ఒకటిన్నర రెట్లకు మించి ఉండకూడదు. ఉదాహరణకు.. 'అ' అనే చానల్ ఐదారు చానళ్లు ఇస్తుంది. వాటిని విడివిడిగా (అలాకార్టేలో) తీసుకుంటే రూ.60 అయ్యేలా ధరలు నిర్ధారిస్తుంది. అవే చానళ్లను బొకేలాగా కొనుక్కుంటే రూ.30కే ఇస్తామని ప్రకటిస్తుంది. దీంతో ప్రజలు బొకే తీసుకోవాల్సిన అగత్యం ఏర్పడుతుంది. అదే, కొత్త విధానం ప్రకారమైతే.. అలాకార్టేలో ఆ చానళ్ల ధరలన్నింటినీ కలిపినా రూ.45కు మించకూడదు. 2.) అలాకార్టేలో ఉండే ఒక చానల్ సగటు ధర.. ఆ చానల్ ఉన్న బొకేలోని చానళ్ల సగటు ధరకు 3 రెట్లకు మించి ఉండరాదు.
- బొకేలో చేర్చిన పే చానళ్లకు సంబంధించి ఒక చానల్‌కు గరిష్ఠ ధర రూ.19 నుంచి 12కు తగ్గింపు. అంటే రూ.12 లోపు ధర ఉన్న చానళ్లనే బొకేలో చేర్చాలి.
- ఒక ఇంట్లో రెండు కనెక్షన్లు ఉంటే... రెండో కనెక్షన్‌కు నెట్‌వర్క్ క్యారేజ్ ఫీజులో (అంటే మన కేబుల్/డీటీహెచ్ కనెక్షన్‌ను యాక్టివ్‌గా ఉంచుకోవడానికి ప్రతి నెలా కట్టే మొత్తం. అంటే రూ.130+పన్నులు) 40% చార్జీనే వసూలు చేయాలని పేర్కొంది. ఒకటి కన్నా ఎక్కువ టీవీలున్నవారికి పెద్ద శుభవార్త ఇది.
- ఏదైనా చానల్‌కు 20 శాతానికిపైగా వీక్షకులు ఉంటే సంబంధిత చానల్ నుంచి క్యారియర్ ఫీజును వసూలు చేయవద్దని ఎస్‌ఎంవోలకు ట్రాయ్ స్పష్టం చేసింది. 20 శాతానికి తక్కువగా ఎంత శాతం వీక్షకులు ఉన్నప్పటికీ క్యారియర్ ఫీజును రూ.4 లక్షలకు మించి వసూలు చేయకూడదు.
- కొత్త విధానం ప్రకారం సవరించిన అ-లా-కార్టె చానల్, బొకేల ధరలను జనవరి 15లోగా బ్రాడ్‌కాస్టర్లు, జనవరి 30లోగా డీటీహెచ్, కేబుల్ ఆపరేటర్లు తమ వెబ్‌సైట్లలో ప్రకటించాలి.




సీఏఏకు వ్యతిరేకంగా కొచిలో ముస్లిం సంస్థల సభ

సీఏఏ సెగ.. కోల్‌కతాలో ఫొటోగ్రాఫర్‌పై దాడి

- ఆందోళనలో పాల్గొన్న రోనీసేన్‌పై పిడిబాకు పోటు

న్యూఢిల్లీ, జనవరి 1: పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), జాతీయ పౌర పట్టిక (ఎన్నార్సీ)కు వ్యతిరేకంగా కోల్‌కతాలో జరిగిన ఆందోళనల్లో పాల్గొన్న ఫొటోగ్రాఫర్, సినీ నిర్మాత రోనీసేన్‌పై దాడి జరిగింది. ఘర్షణ, తోపులాటలో ఆయనకు స్వల్ప గాయాలయ్యాయి. తనపై పిడిబాకుతో అవిజిత్ దాస్ గుప్తా అనే వ్యక్తి దాడిచేసినట్లు పోలీసులకు రోనీసేన్ ఫిర్యాదు చేశారు. సీఏఏకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న జామియా ఇస్లామియా వర్సిటీ విద్యార్థులపై బాలీవుడ్ నటి స్వర భాస్కర్ ప్రశంసలు కురిపించారు. 'సీఏఏ, ఎన్నార్సీపై మనం ఆలస్యంగానైనా నిద్రలేచాం. మీ ఆందోళనలతో మొత్తంగా దేశాన్నే నిద్రలేపారు' అని ఆమె అన్నారు. సీఏఏను వ్యతిరేకిస్తూ బుధవారం ఢిల్లీలోని ఇండియాగేట్ వద్ద పెద్ద సంఖ్యలో జనం గుమిగూడారు. రాజ్యాంగాన్ని పరిరక్షించుకుంటామని ప్రతినబూనారు. వారాణసీలో డిసెంబరు 19న 144 సెక్షన్‌ను ఉల్లంఘిస్తూ సీఏఏకు వ్యతిరేకంగా ఆందోళనలు చేశారనే ఆరోపణలతో రవిశంకర్ (36), ఏక్తా (32) దంపతులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో వారి 14నెలల బిడ్డ పరిస్థితి దయనీయంగా మారింది. తల్లిదండ్రులను అరెస్టు చేయడంతో శిశువు ఒంటరైందని.. తల్లిపై బెంగ పెట్టుకొని బిడ్డ ఆరోగ్యం క్షీణిస్తున్నా బీజేపీ ప్రభుత్వానికి పట్టదా అంటూ ట్విటర్‌లో కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ విమర్శించారు. తన మతతత్వ పోకడలతో రాజ్యాంగాన్ని బీజేపీ బలహీన పరుస్తోందని బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి విమర్శించారు. పశ్చిమబెంగాల్‌లో సీఏఏకు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనలకు కౌంటర్‌గా ప్రచారం నిర్వహిస్తామని బుధవారం బీజేపీ ప్రకటించింది.



ఒకే దేశం ఒకే రేషన్ కార్డు

ఏపీ, తెలంగాణ సహా 12 రాష్ట్రాల్లో అమల్లోకి

న్యూఢిల్లీ, జనవరి 1: ఒకే దేశం ఒకే రేషన్ కార్డు విధానాన్ని కేంద్రం అమల్లోకి తీసుకొచ్చింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గుజరాత్, మహారాష్ట్ర, హరియాణా, రాజస్థాన్, కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, గోవా, జార్ఖండ్, త్రిపురల్లో బుధవారం నుంచి ఈ సదుపాయం ప్రారంభమైంది. దీని ప్రకారం ఈ 12 రాష్ట్రాలకు చెందిన ప్రజాపంపిణీ వ్యవస్థ లబ్ధిదారులు వీటిలో ఏ రాష్ట్రంలో ఉన్నా తమ వాటా రేషన్ సరుకులు తీసుకోవచ్చు. ఈ ఏడాది జూన్ నాటికి దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలను 'వన్ నేషన్ వన్ రేషన్' విధానానికి అనుసంధానిస్తారు. ఈ మేరకు రేషన్ కార్డులు కొత్త ఫార్మాట్‌లో రూపొందించాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. జూన్ 1 నుంచి నూతన కార్డులు అందుబాటులోకి వస్తాయి. వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు జారీచేసే కార్డులన్నీ ఒకే స్టాండర్డ్ ఫార్మాట్‌లో ఉంటాయి.



బిహార్ మంత్రుల కంటే నితీశే పేద

- ఆస్తిలో పెరిగినది రెండు ఆవులే

పట్నా, జనవరి 1: ముఖ్యమంత్రిగా ఉన్నా నయాపైసా కూడా వెనకేసుకోలేదంటున్నారు బిహార్ సీఎం నితీశ్ కుమార్! నిరుటితో పోలిస్తే ఆయన ఆస్తిలో పెరుగుదల కేవలం రెండు ఆవులు- ఒక దూడ. 2018లో ఆయనకు ఎనిమిది ఆవులుండేవి. ఇపుడు పది అయ్యాయి. మంత్రివర్గ సహచరుల, వ్యక్తిగత ఆస్తుల వివరాలను ఆయన బుధవారం ప్రకటించారు. కిందటేడాది ఓ పశువుల షెడ్డు, 8 ఆవులు, ఆరు దూడలు ఉన్నట్లు చూపారు. ఈసారి పది ఆవులు, ఏడు దూడలున్నట్లు తెలిపారు. స్థిరాస్థిగా ఢిల్లీ ద్వారకానగర్‌లో ఉన్న ఓ పాత ఇంటిని చూపారు. దాని విలువ రూ.42 లక్షలు. రూ.16లక్షల మేర చరాస్థి ఉన్నట్లు చెప్పారు. కిందటేడాది ఆయన వద్ద ఉన్న నగదు రూ 42వేలు కాగా ఇప్పుడది రూ 38,039 లకు తగ్గింది. నితీశ్ కుమారుడి కొడుకు పేరున రూ.1.49 కోట్ల స్థిరాస్తి, అంతే మొత్తంలో చరాస్తి ఉన్నట్లు.. అది టీచరుగా పనిచేస్తున్న తన భార్య నుంచి సంక్రమించినట్లు వెల్లడించారు. విశేషమేమంటే నితీశ్ మంత్రివర్గ సభ్యులకు ఆయన కంటే ఆస్తిపాస్తులు ఎక్కువ.



రేణూ దేశాయ్ అప్పుడలా.. ఇప్పుడిలా

హైదరాబాద్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తన కుమార్తె ఆద్యతో కలిసి దిగిన ఫొటోను ఆయన మాజీ భార్య రేణూ దేశాయ్ ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. ఇది తండ్రీకుమార్తెల ప్రేమ అంటూ వ్యాఖ్య రాశారు. 'ఆద్య కొన్నిసార్లు నా లాగా కనిపిస్తుంది. చాలా సార్లు వాళ్ల నాన్నమ్మ, నాన్నకు కాపీలా ఉంటుంది. నా కెమెరా ఫేవరెట్ పర్సన్ ఆద్య' అని ఆమె పోస్ట్ చేశారు. అయితే ఇటీవలే ఆమె తన పిల్లల ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఎంతైనా పవన్ రక్తం అంటూ నెటిజన్లు కామెంట్ చేశారు. తన రక్తమే అంటూ ఆమె సమాధానమిచ్చారు. అనంతరం ఆమె సమాధానంపై పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే మళ్లీ తాజాగా ఆ ఫొటో పోస్ట్ చేసి, ఆవిధంగా వ్యాఖ్యానించి ఉండవచ్చని భావిస్తున్నారు.

నింగిలోకి నలుగురు!

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నారు. కుదిరితే 2020 నవంబరులోనే చంద్రయాన్-3 ప్రయోగిస్తాం. చివరిక్షణంలో ఏమైనా మార్పులు జరిగితే తప్ప ఈ కార్యక్రమం వాయిదా పడదు" అని శివన్ స్పష్టం చేశారు. 2020లో పాతికవరకు ప్రయోగాలు చేపడతామని తెలిపారు. 2019లో పెండింగ్‌లో ఉన్న మిషన్స్‌ను ఈ ఏడాది మార్చిలోపు పూర్తి చేస్తామని కె.శివన్ ప్రకటించారు.

ఎందుకు గురి తప్పిందంటే...

2019లో భారత్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రయోగించిన చంద్రయాన్-2.... అతిస్వల్ప తేడాతో విఫలమైన సంగతి తెలిసిందే. చంద్రుడి ఉపరితలంపైకి సాఫీగా దిగాల్సిన 'విక్రమ్ ల్యాండర్'... దాదాపు రెండు కిలోమీటర్ల ఎత్తు నుంచి ఒక్కసారిగా కుప్పకూలింది (హార్డ్ ల్యాండింగ్). 'వెలాసిటీ రిడక్షన్' వ్యవస్థ వైఫల్యం వల్లే ఇలా జరిగిందని శివన్ తెలిపారు. దీనికి అంతర్గత కారణాలున్నాయని చెప్పారు. విక్రమ్ ల్యాండర్ ఎక్కడ కుప్పకూలిందో తమకు ముందుగానే తెలుసునన్నారు. వాటి శకలాలను తొలుత నాసా గుర్తించి ఇస్రోకు సమాచారం అందించిందన్నారు. ఈ ప్రక్రియలో సహకరించిన చెన్నైకి చెందిన యువ నిపుణుడిని ఆయన అభినందించారు. విక్రమ్ ల్యాండర్ శకలాల చిత్రాలను విడుదల చేయబోమని, ఇస్రో నిబంధనలు అందుకు అంగీకరించవని చెప్పారు. తమిళనాడులోని తూత్తుకుడిలో ఉపగ్రహ ప్రయోగ కేంద్రం ఏర్పాటుకు స్థల సేకరణ మొదలైందని తెలిపారు. ఇక్కడి నుంచి చిన్న ఉపగ్రహ వాహక నౌకల (ఎస్ఎస్ఎల్వీ) ప్రయోగానికి ఇది అనుకూలంగా ఉంటుందని చెప్పారు.

'యాన్' విశేషాలు...

- చంద్రయాన్-3లో భాగమైన ల్యాండర్, రోవర్, ప్రొపెల్షన్ మాడ్యూల్‌ల తయారీకి రూ.250 కోట్లు ఖర్చవుతుంది. ఉపగ్రహ ప్రయోగానికి రూ.365 కోట్లు ఖర్చవుతుంది. మొత్తం మిషన్ వ్యయం రూ.615 కోట్లు.
- చంద్రయాన్-2 ఆర్బిటర్ జీవితకాలం ఏడేళ్లు. చంద్రయాన్-3కి కూడా ఇదే ఆర్బిటర్‌ను ఉపయోగిస్తారు.
- 'గగన్‌యాన్'.. భారత్ చేపడుతున్న తొలి మానవ సహిత అంతరిక్ష ప్రయోగం. మన వ్యోమగాములకు శిక్షణ ఇచ్చేందుకు ఫ్రాన్స్, రష్యాలతో ఒప్పందం కుదిరింది.
- గగన్ యాన్‌లో మహిళా వ్యోమగాములు కూడా ఉంటారని గతంలో ఇస్రో ప్రకటించింది.

పీవోకే స్వాధీనమే టార్గెట్?

- సీడీఎస్ ఏర్పాటు వెనుక లక్ష్యమదే..!
- త్రివిధ దళాల సమన్వయంతో సంయుక్త కార్యాచరణకు వ్యూహం
- ప్రణాళికలు బయటపెట్టం: రావత్



భారత తొలి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్(సీడీఎస్) బిపిన్ రావత్‌తో ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ ముకుంద్ నరవణె, నేవీ చీఫ్ అడ్మిరల్ కరంబీర్ సింగ్, ఎయిర్ చీఫ్ మార్షల్ రాకేశ్ కుమార్ సింగ్ బదౌరియా

న్యూఢిల్లీ, జనవరి 1: పాక్-ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) స్వాధీనమే లక్ష్యంగా సైనిక వ్యవహారాల విభాగం ఏర్పాటు, మహాదళపతి (సీడీఎస్) వ్యవస్థలను కేంద్రం నెలకొల్పిందా?... ఈ ప్రశ్నలకు రాజకీయ వర్గాల్లో అవుననే సమాధానం వస్తోంది. మూడు దళాలను సమన్వయపరిచి- సంయుక్తంగా ఓ కార్యాచరణ సిద్ధం చేయడానికి ఈ వ్యవస్థను ఆరంభించినట్లు ప్రచారం జరుగుతోంది. బుధవారంనాడు దేశ తొలి సీడీఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన జనరల్ బిపిన్ రావత్‌ను ఈ ప్రశ్న అడిగినపుడు- ఆయన సమాధానం ఇవ్వడానికి నిరాకరించారు. "ప్రణాళికలను బహిరంగపరచం. ప్రభుత్వ నిర్ణయాలకు అనుగుణంగా మా పని ఉంటుంది" అని నర్మగర్భంగా వ్యాఖ్యానించారు.

ఆర్టికల్ 370 నిర్వీర్యం, కశ్మీర్ విభజన తరువాత కేంద్రం తన తదుపరి దృష్టిని పీవోకేపై సారించినట్లు ఇప్పటికే వార్తా కథనాలు వచ్చాయి. పాక్‌తో ఇక ఏ శాంతి చర్చలైనా కశ్మీర్ గురించి కాదు, ఆక్రమిత కశ్మీర్ స్వాధీనం గురించే... అని అనేక మంది కేంద్ర మంత్రులు పలు సందర్భాల్లో స్పష్టీకరించిన సంగతి తెలిసిందే. పీవోకేలోని గిల్గిట్, బాల్టిస్థాన్, ముజఫరాబాద్, ఆక్సాయ్ చిన్.. ఇవన్నీ భారత్ భూభాగమే అని విదేశాంగమంత్రి ఎస్ జయశంకర్ సైతం ఓసారి తేల్చిచెప్పారు. ప్రస్తుతం చైనా అధీనంలో ఉన్న ఆక్సాయ్ చిన్‌ను వదిలేసి మిగిలిన పాక్-ఆక్రమిత ప్రాంతాన్ని తిరిగి వశం చేసుకుని కశ్మీర్లో కలిపేయాలని కేంద్రం ప్రణాళికలు రచించినట్లు వెల్లడైంది. మూడు దళాల మధ్య సమన్వయంతో ఏకీకరణ జరిపేందుకు కేంద్రం జనరల్ రావత్‌కు మూడేళ్ల గడువు ఇచ్చింది. ఆలోగా ఇది సాధ్యమేనని రావత్ కూడా మీడియాతో అన్నారు. ఓ రకంగా పీవోకేపై సంయుక్త కార్యాచరణకు మూడేళ్ల గడువు పెట్టుకున్నట్లేనని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. దళాల సమన్వయమే కాదు, ఆధునిక యుద్ధరీతుల్లో దేశాన్ని సమాయత్తం చేయడం, రఫేల్, అణు జలాంతర్గాములు, ఎస్-400 వాయు రక్షణ వ్యవస్థలను సమకూర్చుకోవడం...వీటన్నింటినీ సీడీఎస్ త్వరితం చేయాల్సి ఉంటుందని అంటున్నారు.

నో పాలిటిక్స్..!

రాజకీయాలకు త్రివిధ దళాలు చాలా దూరమని జనరల్ బిపిన్ రావత్ స్పష్టం చేశారు. ఢిల్లీలో బుధవారంనాడు యుద్ధస్మారక చిహ్నం వద్ద అమరవీరులకు నివాళులర్పించి, అనంతరం త్రివిధ దళాల సైనిక వందనాన్ని స్వీకరించాక దేశ తొలి సీడీఎస్‌గా లాంఛనంగా బాధ్యతలు చేపట్టారు. సైనిక వ్యవహారాల్లో రాజకీయ జోక్యం పెరిగిపోతున్నదన్న విమర్శల గురించి ఆయనను ప్రశ్నించినపుడు- 'మేం రాజకీయాలకు దూరం. చాలా దూరం. అధికారంలో ఉన్న ప్రభుత్వ ఆదేశాలనుసారం పనిచేయడమే మా విధి' అని రావత్ బదులిచ్చారు. 'మూడు దళాల మధ్య సమన్వయం సాధించడం నా లక్ష్యం. వనరులు సద్వినియోగమయ్యేట్లు చూస్తా. ఆర్మీ, నేవీ, వైమానిక దళాలు మూడూ ఓ బృందంగా పనిచేసేట్లు చేస్తా. వాటి సామర్థ్యాన్ని పెంచే చర్యలపై దృష్టి పెడతా" అని వివరించారు. "ఇది నా ఆదేశాల ప్రకారం నడిచే వ్యవస్థ కాదు. సమీకృత వ్యవస్థ. మూడు విభాగాలూ కలిసి ఒకటిగా చేస్తాం. 1+1+1= 3 కాదు, 5 లేదా 7... అంటే అంత బలమైనది" అని రావత్ వ్యాఖ్యానించారు. ఆర్మీ నుంచి వైదొలిగాక బరువు దిగిపోయినట్లు భావించానని పేర్కొన్నారు.

కాంగ్రెస్ యూ టర్న్

సీడీఎస్ ఏర్పాటు విషయంలో ఆరంభంలోనే కేంద్రం తప్పటడుగు వేసిందంటూ జనరల్ రావత్‌పై పరోక్షంగా విమర్శలు గుప్పించిన కాంగ్రెస్ యూటర్న్ తీసుకుంది. దేశ భద్రతను పెంచే ఏ చర్యనైనా సమర్థిస్తామని అంటూ సీడీఎస్ ఏర్పాటును స్వాగతించింది. "మాటల కన్నా చేతలే ఎక్కువ విషయాన్ని చెబుతాయి. కొత్త సీడీఎస్ ఎలా పనిచేస్తారో త్వరలోనే దేశం తెలుసుకుంటుంది. సీడీఎస్‌ను నియమించినది ప్రభుత్వం. జనరల్ రావత్ తనపై ఉంచిన బాధ్యతలను నెరవేరుస్తారని భావిస్తున్నాం. దేశ భద్రతను పటిష్టం చేయడానికి ప్రభుత్వం ఏ చర్య తీసుకున్నా కాంగ్రెస్ దానిని వ్యతిరేకించదు" అని పార్టీ అధికార ప్రతినిధి సుస్మితా దేవ్ బుధవారంనాడు అన్నారు.



పోప్‌కు కోపమొచ్చింది!

నూతన సంవత్సర వేడుకల సందర్భంగా సెయింట్ పీటర్స్ ప్లాజాలో చిన్నారులకు ఆశీస్సులు అందించి వెళ్తున్న పోప్ ఫ్రాన్సిస్‌తో కరచాలనం చేసేందుకు ప్రయత్నించిన ఓ మహిళ.. ఆయన చెయ్యి పట్టుకొని లాగేసింది. 83 ఏళ్ల పోప్.. కొంచమైతే కిందపడిపోయేవారే! చెయ్యి వదలకపోవడంతో పోప్ ఆమె చేతిపై చిన్నగా కొట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో బుధవారం పోప్ క్షమాపణలు చెప్పారు. కొన్ని సార్లు సహనం కోల్పోతామని పేర్కొన్నారు.

భీమా-కోరేగావ్‌లో 'మహా' స్మరణ

- డిప్యూటీ సీఎం అజిత్ పవార్ నివాళి

పుణె, జనవరి 1: మహారాష్ట్రలో ప్రభుత్వం మారినప్పటి నుంచి వేగంగా జరిగిపోతున్న పరిణామాలకు 'భీమా-కోరేగావ్'...కీలక నిదర్శనంగా నిలిచింది. చారిత్రక భీమా-కోరేగావ్ ప్రాంతం సమీపంలోని విజయ స్తంభాన్ని మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ సందర్శించారు. ఆంగ్లేయులకు, మరాఠాలకు జరిగిన యుద్ధానికి గుర్తుగా ఈ స్తంభాన్ని ఈ ప్రాంతంలో ప్రతిష్ఠించారు. ఆ యుద్ధఘట్టానికి బుధవారంతో 202 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా భీమా-కోరేగావ్ సమీపంలో ఏర్పాటుచేసిన వార్షిక కార్యక్రమంలో వంచిత్ బహుజన్ అఘాడీ అధ్యక్షుడు ప్రకాశ్ అంబేడ్కర్‌తో కలిసి అజిత్ పవార్ పాల్గొన్నారు. దాదాపుగా ఐదు లక్షల మంది పాల్గొన్నట్టు భావిస్తున్న ఈ కార్యక్రమం కోసం ప్రభుత్వం అసాధారణ భద్రతా ఏర్పాట్లు చేసింది.

పాక్ చొరబాటుదారుల కాల్పుల్లో

అమరులైన ఇద్దరు జవాన్లు

- 2019లో 160 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టాం: కశ్మీర్ డీజీపీ



అమరులైన అర్జున్‌థాపా, సావంత్ సందీప్ రఘునాథ్(ఫైల్)

జమ్ము, జనవరి 1 : కశ్మీర్‌లోని సరిహద్దు నియంత్రణ రేఖ(ఎల్‌వోసీ) వెంట పాకిస్థానీ చొరబాటుదారుల కాల్పుల్లో ఇద్దరు భారత జవాన్లు అమరులయ్యారు. మంగళవారం అర్ధరాత్రి చొరబాటుదారులు పాక్ ఆక్రమిత కశ్మీర్ నుంచి ఖారీ త్రయత్ అడవుల మీదుగా రాజౌరి జిల్లా నౌషేరా సెక్టార్‌లోకి ప్రవేశించేందుకు యత్నించారు. ఈక్రమంలో ఆ అడవుల్లో కార్డన్ సెర్చ్ విధులు నిర్వర్తిస్తున్న జవాన్లపై కాల్పులకు తెగబడ్డారు. వారి దాడిని తిప్పికొట్టే ప్రయత్నంలో రైఫిల్‌మన్ అర్జున్‌థాపా మగార్(25), నాయక్ సావంత్ సందీప్ రఘునాథ్(29)లు అమరులయ్యారు. సావంత్ మహారాష్ట్రలోని సతారా జిల్లావాసి కాగా, మగార్ నేపాల్‌లోని గుర్ఖా జిల్లావాస్తవ్యుడు. కాగా, ఈ ఎన్‌కౌంటర్ ఇంకా కొనసాగుతోందని ఆర్మీ పీఆర్‌వో లెఫ్టినెంట్ కల్నల్ దేవేందర్ ఆనంద్ వెల్లడించారు. మరోవైపు నాలుగున్నర నెలల సుదీర్ఘ విరామం తర్వాత.. కశ్మీర్‌లోని ఆస్పత్రుల్లో బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్, మొబైల్‌ఫోన్లకు ఎస్ఎంఎస్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఆయా సేవలను మంగళవారం అర్ధరాత్రి నుంచి పునరుద్ధరించినట్లు ప్రభుత్వ అధికార ప్రతినిధి రోహిత్ కన్సాల్ ప్రకటించారు. అయితే బుధవారం సాయంత్రం వరకు కూడా ఆస్పత్రులకు ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి రాలేదని సమాచారం. కాగా, 2019 సంవత్సరంలో జమ్మూకశ్మీర్‌లో వివిధ ఘటనల్లో 160 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టినట్లు డీజీపీ దిల్‌బాగ్ సింగ్ తెలిపారు. 2018తో పోల్చితే 2019లో లోయలో ఉగ్రవాద ఘటనలు 30 శాతం తగ్గాయన్నారు. ఉగ్రవాద సంస్థల్లో స్థానిక యువత చేరే రేటు గణనీయంగా తగ్గిందన్నారు. ప్రస్తుతం కశ్మీర్‌లో 250 మంది ఉగ్రవాదులు క్రియాశీలంగా ఉన్నారని.. వారిలో 102 మంది పాకిస్థానీలన్నారు.

సౌదీ రిటర్న్‌కు నకిలీ జనన పత్రాల సమస్య!

- ఉపాధి కోసం తప్పుడు పత్రాలు.. సీఏఏ, ఎన్నార్సీ వస్తే ఇబ్బందులు

హైదరాబాద్, డిసెంబరు 1: పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), జాతీయ పౌర పట్టిక (ఎన్నార్సీ), జాతీయ జనాభా పట్టిక (ఎన్పీఆర్) అమలు చేస్తే ఉపాధి కోసం సౌదీకి వెళ్లొచ్చిన వారికి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. 1980-90దశకంలో చాలామంది రికార్డుల్లో వయసు మార్చేసి ఆ పత్రాలతో హైదరాబాద్ నుంచి సౌదీకి వలస వెళ్లారు. ఉపాధి కోసం 22ఏళ్లు.. ఆపైన వయసుగల వారు సౌదీకి వెళ్లేలా అప్పట్లో వాజ్‌పేయి ప్రభుత్వం అనుమతించింది. దీంతో 22ఏళ్లలోపు వయసున్నవారు కూడా ఎక్కువ వయసు ఉన్నట్లుగా రికార్డులు సృష్టించి సౌదీ వెళ్లారు. సీఏఏ, ఎన్నార్సీ, ఎన్పీఆర్ అమలుకు కేంద్రం సన్నద్ధమవుతున్న నేపథ్యంలో ఈ తరహా నకిలీ ధ్రువీకరణ పత్రాలను కలిగివున్న వారికి చిక్కులు తప్పవని న్యాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ తరహా వ్యక్తుల్లో ప్రధానంగా మైనారిటీలు ఎక్కువగా ఉన్నారని చెబుతున్నారు. గజిబిజిగా జనన ధ్రువీకరణ పత్రాలు ఉన్న వారైతే సంబంధిత డాక్యుమెంట్లు చూపించకపోతే ఏళ్ల తరబడి ఇబ్బందులు తప్పవని హెచ్చరిస్తున్నారు. ఆ రోజుల్లో నిబంధనలు ఇంత కఠినంగా ఉండేవి కావని.. వాటిని ఆసరాగా చేసుకొని తప్పుడు ధ్రువీకరణపత్రాలతో ఉపాధి కోసం ఎంతో మందిని ఏజెంట్లు సౌదీకి తీసుకెళ్లారని ఎంఏ షకీల్ అనే న్యాయవాది చెప్పారు. వెళ్లినవారిలో పలువురు తమ భార్యల పేర్లను పాస్‌పోర్టులో మార్చారని.. స్కూల్ సర్టిఫికెట్‌లో మరో పేరు ఉండటంతో అదీ సమస్యగా మారే అవకాశం లేకపోలేదని మరో న్యాయవాది చెప్పారు.

రిజర్వేషన్ల నుంచి మినహాయించండి: ఐఐఎంలు

న్యూఢిల్లీ, జనవరి 1: ఉపాధ్యాయ నియామకాల్లో రిజర్వేషన్ల అమలు నుంచి తమను మినహాయించాలని దేశవ్యాప్తంగా ఉన్న 20 ఐఐఎమ్‌లు కేంద్ర మానవ వనరుల శాఖను కోరాయి. టీచర్ల రిక్రూట్‌మెంట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఆర్థిక బలహీన వర్గాల రిజర్వేషన్లు అమలు చేయాలని కేంద్రం ఈ విద్యాసంస్థలకు బుధవారం లేఖ రాసింది. దీంతో ఐఐఎమ్‌లు ఈ విధంగా స్పందించాయి. ఈ విద్యాసంస్థల్లో టీచర్ల నియామకానికి సంబంధించి ప్రస్తుతం ఈ రిజర్వేషన్లు అమలు కావడం లేదు. శాస్త్రీయ, సాంకేతిక ఉపాధ్యాయ పోస్టుల్లో రిజర్వేషన్లు పాటించనవసరం లేదంటూ 1975లో సిబ్బంది, వ్యవహారాల శాఖ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం నియామకాలు జరుగుతున్నాయి.



నిఫ్ట్ డైరెక్టర్‌గా విజయ్‌కుమార్ మంత్రి

న్యూఢిల్లీ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(నిఫ్ట్) క్యాంపస్ డైరెక్టర్‌గా అసోం - మేఘాలయ కేడర్ 2007 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్ మంత్రి ఎంపికయ్యారు. ఈవిషయాన్ని కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ బుధవారం వెల్లడించింది. ప్రస్తుతం ప్రధానమంత్రి కార్యాలయంలో డిప్యూటీ కార్యదర్శిగా వ్యవహరిస్తున్న ఆయన నిఫ్ట్ డైరెక్టర్‌గా ఎంపికైనందున, ఆ పోస్టు నుంచి రిలీవ్ చేయడానికి కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదం తెలిపింది.



గన్నవరం ఎయిర్‌పోర్టులో హంపి

ఊహకందని విజయమిది!

కోనేరు హంపి

విజయవాడ (భవానీపురం): ప్రపంచ చెస్ చాంపియన్‌గా నిలుస్తానని ఊహించలేదని చెస్ స్టార్ కోనేరు హంపి తెలిపింది. రష్యాలో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్ ర్యాపిడ్ విభాగంలో విజేతగా నిలిచిన హంపి.. బుధవారం గన్నవరం విమానాశ్రయం చేరుకుంది. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. 'గతేడాది ఆగస్టులో వరుసగా మూడు మెగా టోర్నీల్లో బరిలోకి దిగినా ఓటమే ఎదురైంది. నా కెరీర్‌కు అది సవాల్ విసిరింది. దీంతో ఎలాగైనా గెలవాలన్న కసి, పట్టుదలే తాజా టైటిల్ గెలిచేందుకు దోహదం చేశాయి. నాన్న అశోక్, భర్త అన్వేష్‌ల సహకారం లేకుంటే ఈ విజయం సాధ్యమయ్యేదికాదు' అని హంపి చెప్పుకొచ్చింది.

ఇంతకంటే స్ఫూర్తి ఇంకేం కావాలి!

దివ్యాంగుడి వీడియోను షేర్ చేసిన సచిన్



న్యూఢిల్లీ: కొత్త ఏడాదిని అందరూ స్ఫూర్తిమంతంగా ఆరంభించాలని దిగ్గజం సచిన్ టెండూల్కర్ ఆకాంక్షించాడు. ఫ్యాన్స్‌కు శుభాకాంక్షలు చెబుతూ.. అందరికీ ప్రేరణగా నిలిచే ఓ వీడియోను షేర్ చేశాడు. దివ్యాంగుడైన రామ్ అనే బాలుడు క్రికెట్ ఆడుతున్న వీడియోను ట్విటర్‌లో పోస్ట్ చేశాడు. రెండు కాళ్లూ చచ్చుబడినా ఆ బాలుడు బంతిని కొట్టి పాకుతూ సింగిల్ తీయడం ఆకట్టుకుంటోంది. రన్ తీసిన తర్వాత సహచరుడికి బ్యాట్‌ను అందించడానికి మళ్లీ పిచ్ మధ్యకు పాక్కుంటూ వెళ్లాడు. ఈ వీడియో తన హృదయాన్ని ద్రవింపజేసిందని.. మీ గుండెలనూ బరువెక్కిస్తుందని మాస్టర్ కామెంట్ రాశాడు. 2020ను ఆరంభించడానికి ఇంత కంటే స్ఫూర్తిమంతమైన వీడియో ఇంకేం ఉంటుందన్నాడు.





నటాషాతో హార్దిక్ నిశ్చితార్థం

ముంబై: సెర్బియాకు చెందిన బాలీవుడ్ నటి నటాషా స్టాన్కోవిచ్‌తో తాను డేటింగ్ చేస్తున్నానని టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా అంగీకరించాడు. అంతేకాదు వారు ఎంగేజ్‌మెంట్ కూడా చేసేసుకున్నారు. ఆ ఫొటోలను హార్దిక్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. సముద్రంలో బోటు షికారులో..నటాషా ముసిముసి నవ్వులు చిందిస్తుండగా హార్దిక్ ఆమెకు ఉంగరం తొడిగాడు. అంతకు ముందు తాను, నటాషా ఉన్న ఫొటోను షేర్ చేస్తూ 'కొత్త ఏడాదిని నా వెలుగు జిలుగుల నటాషాతో ప్రారంభిస్తున్నా' అని హార్దిక్ రాసుకొచ్చాడు. ఈ సందర్భంగా హార్దిక్-నటాషాకు విరాట్ కోహ్లీ శుభాకాంక్షలు తెలిపాడు.

కొత్త దశాబ్ది తొలి ఏడాది క్రీడా రంగానికి తలమానికమైన ఒలింపిక్స్ జరగనున్నాయి. ప్రతి సంవత్సరం ఆయా క్రీడల ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో పాల్గొన్నా.. నాలుగేళ్లకోసారి జరిగే విశ్వ క్రీడా సంరంభంలో పాల్గొనడం ఏ ఆటగాడి కెరీర్‌కైనా పరిపూర్ణత. ఇక ఒలింపిక్స్‌లో పతకం నెగ్గితే ఆ ఆటగాడికి క్రీడా జీవితం సంపూర్ణమైనట్టే. గత రియో ఒలింపిక్స్ అనంతరం క్రీడా రంగంలో భారత్ అనూహ్యమైన అభివృద్ధి సాధించింది. వివిధ విభాగాల్లో మన ఆటగాళ్లు ప్రపంచ స్థాయిలో అదిరిపోయే ప్రదర్శన చేశారు. దాంతో టోక్యో ఒలింపిక్స్‌లో భారత అథ్లెట్లపై అంచనాలు అధికమయ్యాయి. నిరుడు ఆయా క్రీడాంశాల్లో తమదైన ముద్ర వేసి కొత్త సంవత్సరంలో కూడా అదే జోరు కొనసాగించే అవకాశమున్న క్రీడాకారులపై ఓ లుక్కేద్దాం.

ఈ ఏడాది ఐదుగురు!

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)



వినేష్ ఫొగట్

కజకిస్థాన్‌లో జరిగిన వరల్డ్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో కాంస్యం నెగ్గడం ద్వారా తన సామర్థ్యాన్ని వినేష్ ఫొగట్ నిరూపించుకుంది. కాంస్య పతక పోరులో గ్రీస్‌కు చెందిన మేటి రెజ్లర్ మరియా ప్రెవోలరాకీని 4-1తో చిత్తుచేసిన ఫొగట్..టోక్యో 'టిక్కెట్' కూడా ఖాయం చేసుకుంది. అంతేకాదు 2020 ఒలింపిక్స్‌కు క్వాలిఫై అయిన తొలి భారత రెజ్లర్‌గా ఆమె రికార్డు సృష్టించింది. వరల్డ్ చాంపియన్‌షిప్ ద్వారా ఒలింపిక్ బెర్త్ సొంతం చేసుకోవడంతో..టోక్యోలో పతకంపై వినేష్‌పై అంచనాలను పెంచేశాయి. స్టార్ రెజ్లర్ సాక్షి మాలిక్ ఫామ్‌లేమితో తంటాలుపడుతుండడంతో విశ్వ క్రీడల్లో వినేష్‌పై భారత్ భారీగా ఆశలు పెట్టుకొంది.



సౌరభ్ చౌధురి

దేశ షూటింగ్‌లో నిరుడు సౌరభ్ చౌధురి ఓ సంచలనం. గత ఫిబ్రవరిలో ఢిల్లీ ఆతిథ్యమిచ్చిన ఐఎస్‌ఎస్‌ఎఫ్ వరల్డ్‌కప్ పురుషుల 10మీ. ఎయిర్‌పిస్టల్ ఈవెంట్‌లో వరల్డ్ రికార్డుతో స్వర్ణం కొల్లగొట్టడం ద్వారా సౌరభ్ సంచలనం సృష్టించాడు. టైటిల్ సాధించడంతోపాటు టోక్యో ఒలింపిక్స్ బెర్త్‌నూ అతడు సొంతం చేసుకున్నాడు. ఢిల్లీ టోర్నీ ద్వారా భారత్ దక్కించుకొన్న ఒలింపిక్ ఏకైక బెర్త్ సౌరభ్‌దే కావడం విశేషం. అంతేకాదు ఢిల్లీ పోటీల మిక్స్‌డ్ టీమ్ విభాగంలో మనూ భాకర్‌తో కలిసి పసిడి పతకాన్ని కూడా చౌధురి చేజిక్కించుకున్నాడు. మ్యూనిచ్ ప్రపంచకప్‌లో ఈ రెండు విభాగాల్లో టైటిల్ కైవసం చేసుకొన్న సౌరభ్..రియో డి జనెరో వరల్డ్‌కప్‌లో వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకం అందుకున్నాడు. అలాగే ఏషియన్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో రజత పతకం నెగ్గిన ఈ ఉత్తరప్రదేశ్ టీనేజర్.. యశస్వినీ సింగ్‌తో కలిసి మిక్స్‌డ్‌లో టైటిల్ సాధించాడు. ఈనేపథ్యంలో టోక్యో ఒలింపిక్స్‌తో పాటు ఈ సంవత్సరం జరిగే ఇతర మెగా ఈవెంట్లలో సౌరభ్ మరిన్ని పతకాలు తన ఖాతాలో వేసుకుంటాడని అంచనా వేస్తున్నారు.



సాతియన్

భారత టీటీ అంటే దశాబ్దంన్నరగా తెలుగు ఆటగాడు శరత్ కమల్ పేరే వినిపిస్తోంది. అంతర్జాతీయ టీటీలో భారత్‌కు ఓ పేరు తీసుకొచ్చిన 37 ఏళ్ల కమల్ రిటైర్మెంట్‌కు సమీపిస్తున్నాడు. ఈ తరుణంలో అతడి వారసుడెవరన్న ప్రశ్నకు జి. సాతియన్ నేనున్నానంటూ ముందుకొచ్చాడు. శరత్ మార్గదర్శనంలో రాటుదేలిన సాతియన్ గతేడాది టాప్-20 అంతర్జాతీయ ఆటగాళ్లలో కొందరిని ఓడించి శభాష్ అనిపించాడు. వీరిలో జపాన్ యువ సంచలనం, వరల్డ్ నెంబర్ 5 హరిమోటో టొమోకాజు కూడా ఉండడం విశేషం. అంతేకాదు అంతర్జాతీయ టీటీ సమాఖ్య ర్యాంకింగ్స్‌లో టాప్-25లో స్థానం దక్కించుకున్న తొలి భారత ఆటగాడిగా 26 ఏళ్ల సాతియన్ రికార్డు సృష్టించాడు. గత జూలైలో అతడు 24వ ర్యాంక్ కైవసం చేసుకున్నాడు. అనతికాలంలోనే అంతర్జాతీయస్థాయిలో అద్భుతంగా రాణిస్తున్న సాతియన్‌పై టోక్యోలో భారీ అంచనాలున్నాయి.



అమిత్ పంఘల్

భారత్ బాక్సింగ్ గురించి చెప్పుకొంటే రెండుపేర్లే ప్రముఖంగా వినిపిస్తాయి. అందులో ఒకటి మేరికోమ్‌దైతే.. రెండోది అమిత్ పంఘల్‌ది. 49 కిలోల నుంచి 52 కేజీల విభాగానికి మారినా వరల్డ్ చాంపియన్‌షిప్‌లో దేశానికి తొలి రజత పతకం అందించాడంటే 23 ఏళ్ల అమిత్ సత్తా ఏపాటిదో అర్థమవుతుంది. 52 కిలోలలో ఏషియన్ చాంపియన్‌షిప్‌లో టైటిల్ పంచ్ విసిరిన పంగల్ టోక్యో ఒలింపిక్స్‌లో పతక అంచనాలను పెంచాడు.



శ్రేయాస్ అయ్యర్

పరిమిత ఓవర్లలో నాలుగో నెంబర్‌లో సమర్థుడైన బ్యాట్స్‌మన్ సమస్యను సుదీర్ఘకాలంగా టీమిండియా ఎదుర్కొంటోంది. రెండేళ్లుగా పలువురు ఆటగాళ్లను పరిశీలించినా వారిలో ఎవరూ కుదురుకోలేకపోయారు. కానీ గతేడాది అవకాశం దక్కించుకొన్న ముంబై బ్యాట్స్‌మన్ శ్రేయాస్ అయ్యర్ సత్తా చాటుకున్నాడు. పరిస్థితులకు తగ్గట్టు బ్యాటింగ్ చేయడంతోపాటు ఫీల్డింగ్‌లో చురుగ్గా ఉండే అయ్యర్ ప్రతిభకు కోచ్ రవిశాస్త్రి ఫిదా అయ్యాడు. అందుకే.. ఎంతోకాలంగా జట్టును వేధిస్తున్న నాలుగో నెంబర్ స్లాట్ తలనొప్పి తగ్గినట్టేనని అతడు పేర్కొన్నాడు. అక్టోబరులో ఆస్ట్రేలియాలో జరిగే టీ20 వరల్డ్‌కప్ అయ్యర్ సత్తాకు సవాల్ కానుంది. ఆ పరీక్షలో నెగ్గి జట్టులో తన స్థానాన్ని శ్రేయాస్ సుస్థిరం చేసుకుంటాడేమో చూడాలి.




రాహుల్ శ్రీవాత్సవ్

రాహుల్‌కు మూడో జీఎం నార్మ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ చెస్ క్రీడాకారుడు పెద్ది రాహుల్ శ్రీవాత్సవ్ (18) గ్రాండ్‌మాస్టర్ కావడానికి అవసరమైన ఆఖరి జీఎం నార్మ్‌ను సాధించాడు. ఇటలీలోని వెనిస్‌లో మంగళవారం ముగిసిన మోంటెబెలునా ఓపెన్ చెస్‌లో రాహుల్ మూడోస్థానంలో నిలిచి కాంస్య పతకంతో పాటు జీఎం నార్మ్ ధ్రువపత్రాన్ని కూడా అందుకున్నాడు. ప్రస్తుతం 2,469 ఎలో రేటింగ్ పాయింట్లతో ఉన్న అతడు మరో 31 పాయింట్లు సాధిస్తే తెలంగాణ నుంచి గ్రాండ్‌మాస్టర్ హోదాను సంపాదించిన మూడో చెస్ క్రీడాకారుడిగా నిలుస్తాడు. గత ఏడాది ఆగస్టులో గ్రీస్‌లో జరిగిన పోటీల్లో తొలి జీఎం నార్మ్‌ను, డిసెంబరులో జరిగిన సెర్బియా ఓపెన్‌లో రెండో జీఎం నార్మ్‌ను రాహుల్ సొంతం చేసుకున్నాడు.

జీవితేష్ ఖాతాలో ఇటలీ టైటిల్



వరంగల్‌కు చెందిన జొన్నలగడ్డ సాయి అగ్ని జీవితేష్ (21) ఇటలీలో జరిగిన రొబిచెట్టో ఓపెన్ టోర్నీ చెస్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. 94 మంది యూరోపియన్ ఇంటర్నేషనల్ మాస్టర్లు పాల్గొన్న ఈ టోర్నీలో జీవితేష్ అగ్రస్థానంలో నిలిచి సత్తా చాటాడు.

గంగూలీ నాకు భోజనం పంపేవాడు!



ఇంజమామ్

కరాచీ: క్రికెట్‌లో మతానికి తావులేదని పాకిస్థాన్ మాజీ కెప్టెన్ ఇంజమాముల్ హక్ అన్నాడు. తనపట్ల మతపరమైన వివక్ష చూపారని ఆరోపణలు చేసిన పాక్ స్పిన్నర్ డానిష్ కనేరియా ఆరోపణలను హక్ ఖండించాడు. కొందరు సహచరులు హిందువులతో కలసి భోజనం చేయరనే ఆరోపణకు సమాధానంగా.. గంగూలీ తనకు భోజనం పంపిన సందర్భాన్ని ఇంజీ గుర్తు చేసుకున్నాడు. '2005 టూర్‌కు ముందు కోల్‌కతాలో ఓ యాడ్ షూటింగ్‌కు వెళ్లా. గంగూలీ కూడా ఆ షూట్‌లో పాల్గొన్నాడు. దానికి ముందు సచిన్, నేను కలసి సౌరవ్‌కు చెందిన రెస్టారెంట్‌ను ప్రారంభించాం. నేను తినే భోజనాన్ని గంగూలీ తన రెస్టారెంట్ నుంచే పంపేవాడు' అని హక్ చెప్పాడు. పాకిస్థానీయులది విశాల హృదయమని, అందరినీ ఆదరిస్తారని చెప్పాడు. '2004లో పాక్ టూర్‌కు భారత్ వచ్చినప్పుడు సాదర స్వాగతం పలికాం. ఆ తర్వాతి ఏడాది మేం భారత్ పర్యటనకు వెళ్లినప్పుడూ అదే విధంగా ఆదరించారు. షార్జా మ్యాచ్‌ల సందర్భంగా హోటల్ రూమ్‌ల్లో టీమిండియా ప్లేయర్లతో కలిసి తినేవాళ్లమ'ని హక్ తెలిపాడు.

మాథ్యూస్ రీఎంట్రీ

భారత్ టూర్‌కు లంక జట్టు

కొలంబో: శ్రీలంక మాజీ కెప్టెన్ ఏంజెలో మాథ్యూస్ మళ్లీ టీమ్‌లోకి రీ ఎంట్రీ ఇచ్చాడు. ఈ నెల ఐదు నుంచి భారత్‌తో జరిగే మూడు టీ-20ల సిరీస్ కోసం 16 మంది సభ్యుల జట్టును శ్రీలంక క్రికెట్ ప్రకటించింది. మలింగ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. దాదాపు 16 నెలల గ్యాప్ తర్వాత మాథ్యూస్ టీ20లకు ఎంపికయ్యాడు. లంకేయులు గురువారం భారత్ రానున్నారు.

లంక జట్టు: మలింగ (కెప్టెన్), గుణతిలక, అవిష్క ఫెర్నాండో, మాథ్యూస్, దసున్ షనక, కుశాల్ పెరీరా, డిక్‌వెలా, ధసిల్వా, ఇసురు ఉదాన, భనుక రాజపక్సే, ఒషాడ ఫెర్నాండో, హసరంగా, లాహిరు కుమార, కుశాల్ మెండిస్, సందకన్, కసున్ రజిత.



వండర్ కిడ్

ఆర్చరీలో అంజని అద్భుత ప్రతిభ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): విల్లు చేత పడితే ఆ బాలిక సంధించే బాణాలకు లెక్కుండదు. బాణం గురి పెట్టిందంటే టార్గెట్ కూడా వణకాల్సిందే. ఆ చిన్నారి విల్లంబుల హోరులో రికార్డులు తెరమరుగవుతున్నాయి. హైదరాబాద్‌కు చెందిన 11ఏళ్ల బేతు చందనసాయి అంజని ఆర్చరీలో అద్భుత ప్రదర్శనతో వండర్ కిడ్‌గా పేరు తెచ్చుకుంటోంది. 10 మీటర్ల విభాగంలో 15 నిమిషాల్లో 136 బాణాలను నిర్దేశిత లక్ష్యానికి సంధించి ఇంటర్నేషనల్ వండర్ అండ్ జీనియస్ బుక్ ఆఫ్ రికార్డుల్లో అంజని చోటు సంపాదించింది. ఈ రికార్డు సాధనకు ముందు ఆమె 8 నిమిషాల్లో 76 బాణాలను వేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. కానీ విల్లు పట్టాక అంజనీ మదిలో అంకెలు మారిపోయాయి. 15 నిమిషాల వద్ద కౌంట్‌డౌన్ ఆపేసరికి 136 బాణాలు వేసి సరికొత్త రికార్డు నెలకొల్పింది.


యూట్యూబ్‌లో వీడియోలు చూసి..: అంజని తల్లిదండ్రులు శ్రీలక్ష్మి, సత్యనారాయణ. వీరి స్వస్థలం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం. హైదరాబాద్‌లోని గాజులరామారంలో స్థిరపడ్డారు. గత ఏడాది యూట్యూబ్‌లో ఆర్చరీ పోటీల వీడియోలు చూస్తూ ఆ క్రీడలో శిక్షణ తీసుకుంటానని అమ్మానాన్నలకు చెప్పింది. అలా గత జూన్‌లో కూకట్‌పల్లిలోని ఆర్చరీ కోచ్‌లు రమేష్, గంగరాజు వద్ద అంజని ప్రాక్టీస్ ప్రారంభించింది.

ఆసియా పసిఫిక్ పోటీలకు అర్హత: కూతురు ఆసక్తిని గమనించిన తండ్రి సత్యనారాయణ ఇంటి వద్ద కూడా ప్రాక్టీస్ రేంజ్‌ను ఏర్పాటు చేశారు. దీంతో రోజు ఉదయం ఐదు నుంచి ఏడు గంటల వరకు, సాయంత్రం 6నుంచి 8 గంటల వరకు సాధన చేయడం దినచర్యలో భాగంగా చేసుకుంది. సరిగ్గా రెండు నెలలు గడిచేసరికి గత సెప్టెంబరులో గండిపేటలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన టోర్నీలో అండర్-14 విభాగంలో రజత పతకం నెగ్గి శుభారంభం చేసింది. ఆ ఉత్సాహంతో గత నవంబరులో కేరళలో జరిగిన జాతీయస్థాయి రూరల్ పోటీల బరిలో దిగింది. అండర్-14 విభాగంలో 50 మీ. పోటీలో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 43 మంది ఆర్చర్లు తలపడ్డారు. వీరందరినీ వెనక్కి నెట్టి అంజని పసిడి పతకం సాధించి శభాష్ అనిపించింది. అంతేకాక థాయ్‌లాండ్‌లో వచ్చే నెలలో జరగనున్న ఆసియా పసిఫిక్ రూరల్ ఆర్చరీ పోటీల్లో పాల్గొనే అవకాశం కూడా అంజనికి లభించింది. భవిష్యత్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించడమే తన లక్ష్యమని అంజని చెబుతోంది.

వన్డే, టీ20 కెప్టెన్‌గా ధోనీ

అన్ని ఫార్మాట్లలో కోహ్లీ

క్రిక్‌ఇన్ఫో దశాబ్దపు జట్లు



న్యూఢిల్లీ: ఈఎస్‌పీఎన్ క్రిక్‌ఇన్ఫో దశాబ్దపు వన్డే, టీ20 జట్లకు కెప్టెన్‌గా ధోనీ ఎంపికయ్యాడు. అన్ని ఫార్మాట్లలోనూ ప్లేయర్‌గా చోటు దక్కించుకొన్న కోహ్లీని టెస్ట్ సారథిగా ఎంపిక చేశారు. విరాట్ తోపాటు భారత క్రికెటర్లలో అశ్విన్ ఒక్కడికే టెస్ట్ టీమ్‌లో చోటుదక్కింది. రోహిత్‌కు వన్డేల్లో చోటు లభించగా.. పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా టీ20 జట్టుకు ఎంపికయ్యాడు. ఐదుగురు వెస్టిండీస్ ప్లేయర్లు క్రిస్ గేల్, డ్వేన్ బ్రావో, సునీల్ నరైన్, పొలార్డ్, రస్సెల్ టీ20 టీమ్‌కు ఎంపిక కావడం విశేషం. ఇక మహిళల దశాబ్ది వన్డే, టీ20 జట్లలో మిథాలీ రాజ్, పేసర్ జులన్ గోస్వామికి చోటుదక్కింది. ఆస్ట్రేలియా ప్లేయర్ మెగ్ లానింగ్ కెప్టెన్‌గా ఎంపికైంది.

తెలంగాణపై బంగ్లాదేశ్ గెలుపు

ఆలిండియా మహిళల టీ-20

ఖమ్మం స్పోర్ట్స్: మహారాష్ట్ర, బంగ్లాదేశ్, పంజాబ్ జట్లు ఆలిండియా మహిళల టీ-20 క్రికెట్ పోటీల మూడోరోజు విజయాలు సాధించాయి. తొలి మ్యాచ్‌లో మహారాష్ట్ర జట్టు ఉత్తరప్రదేశ్‌పై 8 వికెట్లతో గెలుపొందింది. రెండో మ్యాచ్‌లో బంగ్లాదేశ్ జట్టు తెలంగాణను ఓడించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ నిర్ణీత 16 ఓవర్లలో 7 వికెటకు 131 పరుగులు చేసింది. 132 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన తెలంగాణ 7 వికెట్లు కోల్పోయి కేవలం 49 పరుగులే చేయగలిగింది. బంగ్లా బౌలర్ దీదీ రాణి సర్కార్ 5 వికెట్లు తీసింది. మరో మ్యాచ్‌లో పంజాబ్ జట్టు తమిళనాడును ఓడించింది.



తెలంగాణ, బంగ్లాదేశ్ జట్ల మధ్య మ్యాచ్ దృశ్యం



విరాట్ కోహ్లీ అభిమానులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపాడు. ఈ సందర్భంగా భార్య అనుష్కతో కలిసి దిగిన పైఫొటోను కోహ్లీ ట్విటర్‌లో పోస్ట్ చేశాడు.



తమిళ నటుడితో జ్వాల డేటింగ్..?

చెన్నై: బ్యాడ్మింటన్ మాజీ స్టార్ గుత్తా జ్వాల ప్రేమలో పడిందా..? అంటే అవుననే అంటోంది కోలీవుడ్ మీడియా. ఈ డబుల్స్ ఏస్ షట్లర్ కొన్నాళ్లుగా తమిళ నటుడు విష్ణు విశాల్‌తో డేటింగ్‌లో ఉన్నట్టు సమాచారం. తాము సన్నిహితంగా ఉన్న ఫొటోలను ఇరువురూ సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తుండడం ఈ వార్తలకు బలం చేకూరుస్తోంది. ఈ నేపథ్యంలోనే కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ విష్ణు తనను ముద్దాడుతున్న ఫొటోను జ్వాల బుధవారం ట్విటర్‌లో పోస్ట్ చేసింది. ఇప్పుడీ ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఫొటోతో ఇద్దరి మధ్య ఎఫైర్ బహిరంగమైపోయిందంటూ నెటిజన్లు తెగ కామెంట్ చేస్తున్నారు. విష్ణు విశాల్ తమిళంలో ఇప్పటివరకూ 14 సినిమాల్లో నటించాడు.

'మంట' గ్యాస్!

హైదరాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): వంట గ్యాస్ ధర మండుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో గ్యాస్ ధరలు పెరుగుతుండటంతో స్థానికంగానూ ఎగబాకుతున్నాయి. గత 5 నెలల్లో పెరగటమే తప్ప తగ్గిన దాఖలాలు లేవు. 2019 సెప్టెంబరు నుంచి పెరుగుదల మొదలైంది. అప్పటి నుంచి ఈ నెల వరకు పరిశీలిస్తే 14.2 కిలోల వంట గ్యాస్ సిలిండర్ ధర ఏకంగా రూ.141.50 పైసలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. హైదరాబాద్‌లో ఈ జనవరి నెలకు రూ.21 పెరిగింది. దేశీయంగా ఉత్పత్తి అంతగా లేకపోవడంతో ఇరాన్, సౌదీ తదితర దేశాల నుంచి మనం గ్యాస్‌ను దిగుమతి చేసుకుంటున్నాం. దీంతో గ్యాస్ ధరలు అంతర్జాతీయ మార్కెట్‌పై ఆధారపడి ఉంటున్నాయి. కేంద్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం ప్రకారం 'కాంట్రాక్ట్ ప్రైసింగ్ సిస్టమ్' అమలులో ఉంది. దీంతో ప్రతి నెలా ధరలను సమీక్షిస్తారు. ప్రతి నెలా గ్యాస్ ధరలు పెరగడమో, తగ్గడమో జరుగుతుంది. కానీ ఐదు నెలలుగా గ్యాస్ ధర పెరగడమే తప్ప తగ్గలేదు. 2019 ఆగస్టులో రూ.628 ఉండేది. సెప్టెంబరు నుంచి పెరుగుదల మొదలైంది.

సబ్సిడీయేతర సిలిండర్లపై అధిక భారం

ఎల్‌పీజీపై డీబీటీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్)స్కీం అమలులో ఉంది. ఈ క్రమంలో సబ్సిడీ గ్యాస్ వినియోగదారులపై 5% ఆర్థిక భారం పడుతోంది. సిలిండర్ ధర రూ.100 పెరిగితే సబ్సిడీ పరిధిలోని వినియోగదారుడు రూ.5 భరించాల్సి వస్తోంది. ట్యాక్స్ పోర్షన్‌కు రీయింబర్స్‌మెంట్ వర్తించడంలేదు. మిగిలిన రూ.95 వినియోగదారునికి డీబీటీలో తిరిగి వస్తాయి. ఇక నాన్-సబ్సిడీ వినియోగదారులకు మాత్రం మోత మోగుతుంది. ఒక్కో కుటుంబానికి కేంద్ర ఏడాదికి 12 వంట గ్యాస్ సిలిండర్లు సబ్సిడీపై వస్తాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.769 ఉంది. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా విక్రయించే కిరోసిన్ ధర లీటరుకు 26 పైసలు పెంచారు. జెట్ ఇంధనం(ఏటీఎఫ్) ధర సైతం కిలోలీటరుకు రూ.1,637.25 (2.6%) పెరిగి రూ.64.323.76కు చేరింది. కాగా, మొన్న రైల్వే చార్జీలు, ఇప్పుడు వంటగ్యాస్ ధరల పెంపుపై విపక్షాలు మండిపడ్డాయి. ఇది సామాన్యుడికి మోదీ ప్రభుత్వం కొత్త సంవత్సర కానుకా? అని కాంగ్రెస్ ప్రశ్నించింది.

హైదరాబాద్‌లో గత ఐదు నెలల్లో వంట గ్యాస్ ధరల వివరాలు (రూ.ల్లో)

నెల	పెరుగుదల	ధర
జనవరి	21	769
డిసెంబరు	15	748
నవంబరు	76	733.5
అక్టోబరు	13.5	657.5
సెప్టెంబరు	16	644
ఆగస్టు	--	628

100కు ఫోన్‌చేస్తే.. వచ్చి కొట్టారు

నా కుమారుడిపై పోలీసుల దాడి : నిర్మాత నట్టికుమార్

హైదరాబాద్ సిటీ/పంజాగుట్ట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): తన కుమారుడు క్రాంతితో పోలీసులు దుర్భాషలాడి, దాడికి పాల్పడ్డారని సినీ నిర్మాత నట్టికుమార్ ఆరోపించారు. విషయాన్ని సీపీ దృష్టికి తీసుకెళ్లానని.. అవసరమైతే హైకోర్టును ఆశ్రయిస్తానని అన్నారు. మంగళవారం రాత్రి 11.15 గంటలకు బేగంపేట కంట్రీ క్లబ్ నుంచి పార్క్ చేసిన కారును తీసుకెళ్లే సమయంలో తాళాలు తీసుకున్న సెక్యూరిటీ సిబ్బంది కనిపించకపోవడంతో డయల్ 100కు క్రాంతి కాల్ చేశాడన్నారు. కారులో ఉన్న రూ.లక్ష నగదు, క్రెడిట్ కార్డులు పోతాయేమోనన్న భయంతోనే ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అక్కడికి చేరుకున్న పంజాగుట్ట పోలీస్ పెట్రోలింగ్ సిబ్బంది.. 'డయల్ 100కు ఎందుకు ఫోన్ చేశావు?' అంటూ క్రాంతితో బాధ్యతారాహిత్యంగా మాట్లాడారన్నారు. ఈ వాదనను పోలీసులు ఖండించారు.

న్యాయం కోసం వస్తే.. అన్యాయం!

పంజాగుట్ట పోలీసు స్టేషన్ ముందు ఆత్మహత్యా యత్నానికి ప్రయత్నించిన లోకేశ్వరి మృతి



లోకేశ్వరి (ఫైల్)

పంజాగుట్ట/హైదరాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): సహజీవనం చేసిన వ్యక్తి వంచించాడన్న మనస్తాపంతో ఆత్మాహుతి యత్నానికి పాల్పడిన లోకేశ్వరి బుధవారం మృతిచెందింది. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్ ముందు ఆమె ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంది. తీవ్రంగా గాయపడిన ఆమెను ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ కన్నుమూసింది. ప్రవీణ్‌కుమార్ అనే బంగారం దుకాణం యజమాని తనను మోసగించాడని గత నెల 27న హైదరాబాద్ పంజాగుట్ట పోలీసులకు లోకేశ్వరి ఫిర్యాదు చేసింది. తర్వాత నాలుగు రోజులకే ఆత్మహత్యకు పాల్పడింది. చెన్నైకి చెందిన లోకేశ్వరికి 2000లో శ్రీనివాస్ అనే వ్యక్తితో వివాహం జరిగింది. కూతురు పుట్టిన కొద్దిరోజులకే శ్రీనివాస్ వారిని వదిలిపెట్టి వెళ్లిపోయాడు. హైదరాబాద్ వారాసిగూడకు చెందిన ప్రవీణ్‌తో ఆమెకు తిరుపతిలో పరిచయం ఏర్పడింది. 2012లో ఆమెను హైదరాబాద్ తీసుకొచ్చి సహజీవనం చేశాడు. ప్రవీణ్‌కు సోమాజిగూడ బాబుఖాన్ మాల్‌లో బీఎస్‌పీ జ్యువెలరీ షాప్ ఉంది. అందులో ఆమెను మేనేజర్‌గా నియమించాడు. పనుల నిమిత్తం ప్రవీణ్ తరచూ ఇతర ప్రాంతాలకు వెళుతుండేవాడు. ఇదే అదనుగా ఆమె 2014 జూన్‌లో బంగారు ఆభరణాలు, నగదును దొంగిలించిందని అదే నెల 28న పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. జూలై 14న లోకేశ్వరితో పాటు మరో ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. నగలు స్వాధీనం చేసుకున్నారు డిసెంబరులో ఆమె బెయిల్‌పై విడుదలైంది. ఏడాది క్రితం తిరిగి ప్రవీణ్‌ను ఫోన్‌లో సంప్రదించింది. పోలీసులు స్వాధీనం చేసుకుంది తన నగలేనని, దానికి గాను రూ.7.50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేసింది. గత నెల 27న స్నేహితుడు కన్నన్‌తో కలిసి లోకేశ్వరి హైదరాబాద్ వచ్చింది. నాంపల్లిలోని ఓ లాడ్జిలో దిగింది. అదే రోజు పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనను ప్రవీణ్ మోసం చేశాడని, డబ్బులు ఇస్తానని చెప్పి ఇవ్వలేదని ఫిర్యాదులో పేర్కొంది. కానీ ఆధారాలు చూపలేకపోయింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు జనరల్ డైరీలో నమోదు చేసి రశీదు కూడా ఇచ్చారు. ప్రవీణ్‌కు పోలీసులు ఫోన్ చేయగా తాను స్థానికంగా లేనని, రెండు రోజుల్లో వస్తానని చెప్పినట్లు తెలిసింది. లోకేశ్వరి మళ్లీ పోలీసు స్టేషన్‌కు వెళ్లగా విచారణ చేస్తున్నామని చెప్పారు. దీంతో ఆమె వెళ్లిపోయింది. ప్రవీణ్‌వస్తే మరిన్ని విషయాలు తెలుస్తాయని భావిస్తున్నారు. లోకేశ్వరి నాంపల్లిలోని ఓ పెట్రోల్ బంకులో ఆధార్ కార్డు చూపించి ప్లాస్టిక్ సీసాలో 2 లీటర్ల పెట్రోల్‌ను కొనుగోలు చేసింది. ఆమె స్నేహితుడు కన్నన్ కూడా వెంట ఉన్నాడు. సాయంత్రం 5.40 గంటల ప్రాంతంలో పంజాగుట్ట పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. కన్నన్ టీ తాగేందుకు వెళ్లాడు. తర్వాత ఆమె ఒంటిపైన పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంది.

మా నిర్లక్ష్యం లేదు

లోకేశ్వరి విషయంలో పంజాగుట్ట పోలీసుల నిర్లక్ష్యం లేదు. ఆమె ఫిర్యాదును తీసుకుని జనరల్ డైరీలో నమోదు చేశాం. ఆమెకు రశీదు కూడా ఇచ్చాం. కేసు విచారణలో ఉంది. ప్రవీణ్‌కుమార్‌కు స్వయంగా సంబంధిత ఎస్సై ఫోన్ చేశారు. తాను నగరంలో లేనని, రెండు రోజుల్లో వస్తానని అతను చెప్పాడు. ఇలా అవుతుందని అనుకోలేదు. ఈ ఘటన బాధాకరం. అధికారుల తప్పు ఉంటే చర్య తీసుకుంటాం.

– పంజాగుట్ట ఏసీపీ తిరుపతన్న



ఫౌండేషన్ డే వేడుకను ప్రారంభిస్తున్న సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ ఎన్వీ రమణ, చిత్రంలో హైకోర్టు సీజే రాఘవేంద్ర చౌహాన్ తదితరులు

జడ్జీల సంఖ్య 42కు పెంచాలని సిఫారసు వస్తే...

వారం రోజుల్లో క్లియర్ చేస్తాం

- హైకోర్టులో పెండింగ్ కేసులు 2.07 లక్షలు
- ఇది ఆందోళనకరం.. దేశమంతా ఇదే పరిస్థితి
- దేశమంతా తెలంగాణ వైపు చూస్తోంది
- హైకోర్టు ఆవిర్భావోత్సవంలో జస్టిస్ ఎన్వీ రమణ

హైదరాబాద్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): దేశమంతా హైకోర్టుల్లో జడ్జీల కొరత వేధిస్తోందని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. "తెలంగాణ హైకోర్టులో 24 మంది జడ్జీలుండాలి. కానీ ప్రస్తుతం 13 మందే ఉన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులు చూస్తే 2.07 లక్షల పైనే ఉన్నాయి. ఇది ఆందోళనకరం. జడ్జీల సంఖ్యను 24 నుంచి 42కు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం నుంచి హైకోర్టు ద్వారా సిఫారసు వస్తే దాన్ని సుప్రీంకోర్టు వెంటనే పరిశీలిస్తుంది. వారం రోజుల్లోగా దానిపై ఓ నిర్ణయానికి వచ్చి తగిన చర్యలు తీసుకుంటుందని" అని ఆయన చెప్పారు. తెలంగాణ హైకోర్టు ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా బుధవారంనాడు ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "ఒక్క తెలంగాణయే కాదు. పక్కనున్న ఆంధ్రప్రదేశ్‌లోనూ అదే పరిస్థితి. దేశమంతా కూడా ఇదే స్థితి. దేశం మొత్తం మీద హైకోర్టుల్లో ఉండాల్సిన జడ్జీలు 1100 పైచిలుకు కాగా, ప్రస్తుతం ఉన్నది కేవలం 600పైన మాత్రమే. సుప్రీంకోర్టులో ఏదీ పెండింగ్‌లో ఉండదు. కొత్త సీజే జస్టిస్ శరద్ బోబ్డే కూడా క్రియాశీలకంగా ఉంటున్నారు. ఏ ఫైలూ పెండింగ్‌లో పెట్టరు. సుప్రీంకోర్టు పరిశీలనలో ఉన్న సిఫారసు అంశాలు కేవలం 51 మందికి సంబంధించినవే. మేం క్లియర్ చేసి కేంద్రానికి పంపేస్తున్నాం. కానీ న్యాయశాఖ వద్ద 151 సిఫారసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఏవో నిర్దిష్ట కారణాల వల్ల తప్పితే పెండింగ్ ఉండదు. ఎన్నికలు రావడం, ఇతరంశాల వల్ల ప్రభుత్వ స్థాయిలో అప్పుడప్పుడూ ఆలస్యం జరుగుతుంది. కొన్ని విషయాలు బయటికి చెప్పలేం. కానీ ఈ ఖాళీల భర్తీ అనేది మరీ ఆందోళనకరంగా కనిపిస్తోంది" అని జస్టిస్ రమణ పేర్కొన్నారు. 'ఎంతో పోరాడి సొంతంగా హైకోర్టు సాధించుకున్నారు. కానీ తగినంత మంది జడ్జీలుంటేనే సార్థకత. ఇక్కడ పెద్ద భవనం ఉంది, జడ్జీలు లేరు. ఏపీలో భవనాలూ లేవు, తగినంత మంది న్యాయమూర్తులూ లేరు" అన్నారాయన.

జాతీయ న్యాయసేవల ప్రాధికార సంస్థ (నల్సా) కింద కొత్తగా వచ్చే న్యాయవాదులకు వృత్తిపరమైన శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందని, ప్రస్తుత తరుణంలో నైపుణ్య శిక్షణ అత్యంతావశ్యకమని ఆయన అభిప్రాయపడ్డారు. "నల్సా కోసం పదెకరాల స్థలాన్ని తెలంగాణ ఇచ్చింది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందిస్తున్నాను. ఈ భవన నిర్మాణానికి కొంత సమయం పడుతుంది. ఈలోగా ఏదేనా వేరే భవనంలో శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించాలి" అని ఆయన సూచించారు. "అందరికీ సత్వర న్యాయం నా కల. లీగల్ ఎయిడ్ నిమిత్తం రూ 400 కోట్లు ఖర్చు చేస్తున్నాం. అవసరమైన చోట న్యాయసలహా వేగంగా ఇచ్చేందుకు కృషి చేస్తున్నాం" అని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వంపై ప్రశంసలు గుప్పిస్తూ- 'దేశమంతా ఇపుడు తెలంగాణ వైపు చూస్తోంది. మీ ఆశలు, ఆశయాల మేరకు అన్నీ రూపుదిద్దుకుంటున్నాయి. ఇక్కడున్న ప్రశాంత వాతావరణం అందుకు దోహదం చేస్తోంది" అని పేర్కొన్నారు.



ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు

జూరాలకు రివర్స్ పంపింగ్‌తో శ్రీశైలం నీరు

కోయిల్‌సాగర్, సంగంబండలకూ.. 400 కోట్ల అంచనా వ్యయంగా ప్రతిపాదనలు

గద్వాల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం బ్యాక్ వాటర్‌తో తెలంగాణ ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథక నిర్మాణం చేపట్టింది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నుంచి కృష్ణా జలాలను జూరాలకు రివర్స్ పంపింగ్ ద్వారా తరలించడానికి కొత్త ప్రణాళికలు తయారు చేస్తున్నారు. ఈ ప్రణాళికలు సాకారమైతే జూరాల ప్రాజెక్టు జలకళను సంతరించుకోనుంది. దీంతో పాటు కోయిల్‌సాగర్, సంగంబండ రిజర్వాయర్లకూ సాగునీరు సమృద్ధిగా లభిస్తుంది. కాళేశ్వరం మాదిరిగా కృష్ణా జలాలను రివర్స్ పంపింగ్ చేసి జూరాలకు నీటిని చేర్చడానికి నీటిపారుదల శాఖ రూ.400 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసింది. ఈ ప్రతిపాదనలను ముఖ్యమంత్రి కేసీఆర్ పరిశీలించి, ఆమోద ముద్ర వేయాల్సి ఉంది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నుంచి జూరాలకు రివర్స్‌లో నీటిని తరలించి, వేసవిలోనూ జూరాలలో నీటి లభ్యత పెంచేందుకు ఈ ప్రతిపాదనలు తయారు చేశారు. కృష్ణా జలాల నీటి రివర్స్ పంపింగ్ కల సాకారమైతే జూరాల కింద ఆయకట్టుకు, తాగునీటికి ఇబ్బందులు తొలగుతాయి.



శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి; మల్లు భట్టివిక్రమార్క

శ్రీవారిసేవలో టీకాంగ్రెస్ నేతలు

తిరుమల, జనవరి 1: ఆంగ్ల నూతన సంవత్సరాది సందర్భంగా బుధవారం తిరుమల శ్రీవారిని తెలంగాణ కాంగ్రెస్ నేతలు శ్రీవారిని దర్శించుకున్నారు. సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఉదయం వీఐపీ బ్రేక్‌లో ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం రాజగోపాల్‌రెడ్డి ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తెలుగు రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి నూతన ఏడాదిలో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని శ్రీవారిని కోరుకున్నట్టు తెలిపారు. అలాగే శ్రీవారి అనుగ్రహంతో ఏపీలో జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని కోరుకుంటున్నట్టు చెప్పారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: K. Srinivas, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307,
RNI NO: AP TEL /2004/12975 .Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.